www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 17-4-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 1 | శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళ పక్షం తిథి: చవితి మ.3.24 తదుపరి పంచమి, నక్షత్రం: జ్యేష్ఠ పూర్తి, వర్జ్యం: మ.12.05-1.50, దుర్ముహూర్తం: ఉ.10.10-11.00, మ.3.09-3.58, అమృతఘడియలు: రా.10.39-12.25, రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 6.01, సూర్యాస్తమయం: 6.28 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విండ్‌షీల్డ్ దెబ్బతింటే ఎలా వెళ్లారు?

హెలికాప్టర్‌పై దాడి ఎవరు చేశారు?
జగన్ తిరుగు ప్రయాణం షెడ్యూల్‌లో ఉందా?
కో పైలట్‌పై పోలీసుల ప్రశ్నల వర్షం
కొన్ని ప్రశ్నలు దాటవేసిన శ్రేయాజ్ జైన్
పైలట్ అనిల్ గిర్హాజరుపై అనుమానాలు
ఇద్దరినీ మళ్లీ విచారణకు పిలిచే అవకాశం

12



తదుపరి సీజేఐ జస్టిస్ గవాయ్

2



కేంద్రానికి సుప్రీంకోర్టు సీజే సంజీవ్ ఖన్నా సిఫారసు
52వ భారత ప్రధాన న్యాయమూర్తిగా మే14న బాధ్యతల స్వీకరణ
రెండో దళిత సీజేఐగా రికార్డు సృష్టించనున్న జస్టిస్ గవాయ్
మహారాష్ట్రలో జననం.. బాంబే హైకోర్టులో పలు హోదాల్లో విధులు
2019 నుంచి సుప్రీంకోర్టులో కీలక ధర్మాసనాల్లో ముఖ్యభూమిక
370 రద్దు, పెద్దనోట్ల రద్దు, ఎన్నికల బాండ్ల నిలిపివేత తీర్పుల్లో భాగం

సచివాలయం, ఐకానిక్ టవర్ల నిర్మాణానికి టెండర్లు

6

రూ.4,668 కోట్లతో డయాగ్రిడ్ మోడల్‌లో నిర్మాణం
మే 1న టెక్నికల్ బిడ్లను తెరవనున్న సీఆర్డీఏ



సచివాలయం, ఐకానిక్ టవర్ల నమూనా

విశాఖ రైల్వే జోన్‌కు గెజిట్ ఏదీ?

6

ఒడిశా అధికారుల మోకాలడ్డు
కొత్తవలసను కూడా రాయగడ డివిజన్‌లో చేర్చాలని డిమాండ్
మళ్లీ ఆగిన జోనల్ ఆఫీస్ పనులు



కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు సగమివ్వాలి

ఏపీ రెవెన్యూ లోటు అగాధాన్ని పూడ్చండి: చంద్రబాబు

అధిక నిధులకు సిఫారసు చేయండి
అమరావతికి రూ.47,000 కోట్లు కావాలి
బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లను కలుపుతూ ప్రణాళికలు రూపొందించాలి
అప్పుడు వికసిత్ భారత్‌లో దక్షిణాదీ కీలకం
'స్థానిక సంస్థల' వెయిటేజీలు మార్చండి
రాష్ట్ర విభజనతో హైదరాబాద్‌ను కోల్పోయాం
తెలంగాణ ఆదాయంలో 75% ఆ నగరం నుంచే
గత పాలకుల నిర్లక్ష్యంతో రాష్ట్రానికి ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ
10 సూత్రాలతో స్వర్ణాంధ్ర విజన్-2047
పోలవరం-బనకచర్లకు సాయం చేయండి
16వ ఆర్థిక సంఘాన్ని కోరిన సీఎం
పనగారియా బృందానికి సవివర ప్రజంటేషన్



16వ ఆర్థిక సంఘం చైర్మన్ పనగారియాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ సాధనలో రాష్ట్రాలదే కీలక పాత్ర గనుక కేంద్ర పన్నుల్లో వాటి వాటా పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు 16వ ఆర్థిక సంఘాన్ని కోరారు. ప్రస్తుతం కేంద్ర పన్నుల్లో 41 శాతంగా ఉన్న రాష్ట్రాల వాటాను 50 శాతానికి పెంచాలని ముఖ్యమంత్రి కోరారు. అలాగే జనాభా, విస్తీర్ణం, అడవుల విస్తీర్ణం, తలసరి ఆదాయం తదితర అంశాల ఆధారంగా నిర్ణయించే క్షితిజ సమాంతర పన్నుల పంపకం(హారిజాంటల్ డివల్యూషన్)లో దక్షిణాది రాష్ట్రాల వాటా తగ్గిపోతోందని, 10వ ఆర్థిక సంఘం సమయంలో

మిగతా 11వ పేజీలో...

పోలవరం ప్రారంభోత్సవానికి రండి

పనగారియాకు సీఎం వినతి.. పుష్కరాల్లోపే ప్రాజెక్టును పూర్తిచేస్తాం
మీరు నీతి ఆయోగ్‌లో ఉన్నప్పుడే ఆ ప్రాజెక్టును రాష్ట్రానికి అప్పగించారు
72% పనులు పూర్తిచేశాం.. 'బనకచర్ల' రాష్ట్రానికి గేమ్ చేంజర్
అంతర్రాష్ట్ర నదుల అనుసంధానం కంటే రాష్ట్రంలో అంతర్గత సంధానంతోనే మేలు.. ఆర్థిక సంఘం చైర్మన్‌తో ముఖ్యమంత్రి

11

దార్శనికుడు చంద్రబాబు

సమస్యలపై ఆయనలా ప్రజంటేషన్ ఇచ్చే నాయకులు అరుదు
నిధుల పంపిణీపై ప్రతిపాదనలు ఇచ్చారు
జనాభా ప్రాధాన్యం తగ్గించాలని కోరారు
ప్రత్యేక హోదాకు ఇప్పుడు స్థానం లేదు
అరవింద్ పనగారియా వెల్లడి



గంగపుత్రులకు డబుల్ ధమాకా

వేట నిషేధ కాలంలో రెట్టింపు భృతి
గత ప్రభుత్వం ఇచ్చింది రూ.10 వేలు
20 వేలు ఇస్తామన్న చంద్రబాబు
మంత్రి అచ్చెన్న ఆదేశాలతో రీ సర్వే
అర్హులను గుర్తించిన మత్స్య శాఖ
1,22,968 మంది జాలర్లకు లబ్ధి
26న సొమ్ము విడుదల చేయనున్న సీఎం
మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక దన్ను

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మత్స్యకారులకు త్వరలోనే సర్కారు చేయూతనందించనుంది. వేట నిషేధ కాలంలో మత్స్యకార కుటుంబాలు ఇబ్బంది పడకుండా వారికి ఆర్థిక సాయం చేయనుంది. దీనికి సంబంధించిన నిధులు విడుదల చేసేందుకు మత్స్యశాఖ ఏర్పాట్లు చేస్తోంది. మత్స్యకారులకు వేట నిషేధ భృతిని

మిగతా 3వ పేజీలో...

మిథున్ రెడ్డికి సిట్ పిలుపు

రేపు విచారణకు రావాలని నోటీసు
మద్యం స్కామ్‌లో సిట్ స్పీడు
నేడు విచారణకు రానున్న సాయిరెడ్డి
రేపు రావాలని రాజ్ కసిరెడ్డి తండ్రికి నోటీసు
ఎల్లుండి హాజరు కావాలని రాజ్‌కు మరో తాఖీదు
రాజ్ ఫోన్లు స్విచ్ఛాఫ్.. మూడుసార్లు డుమ్మా



అమరావతి/విజయవాడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం దర్యాప్తులో 'సిట్' స్పీడు పెంచింది. కీలక సూత్రధారులు, పాత్రధారుల వరుస విచారణకు రంగం సిద్ధం చేసింది. ఇందులో భాగంగా... వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. శుక్రవారం విజయవాడలోని 'సిట్' కార్యాలయంలో విచారణకు హాజరు కావాల్సిందిగా ఆయనను ఆదేశించినట్లు సమాచారం. ఇదే సమయంలో... జగన్ హయాంలో కమీషన్లు సమర్పించుకున్న మద్యం ఉత్పత్తిదారులు, వ్యాపారులను కూడా విచారణకు పిలిచినట్లు తెలుస్తోంది. వీరిని మిథున్ రెడ్డితో కలిపి ప్రశ్నించి... కీలక వివరాలు రాబట్టాలని భావిస్తున్నట్లు సమాచారం. అయితే... ఆయన విచారణకు హాజరవుతారా, లేదా అనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఆయనకు అరెస్టు నుంచి సుప్రీంకోర్టు రక్షణ కల్పించినప్పటికీ... విచారణకు సహకరించాలని స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు అజ్ఞాతంలోకి వెళ్లిపోయి. పదేపదే విచారణకు డుమ్మా కొడుతున్న మద్యం స్కామ్ సూత్రధారి రాజ్ కసిరెడ్డికి 'సిట్' మరో నోటీసు జారీ చేసింది. ఒకవైపు ఆయనకోసం విస్తృతంగా గాలిస్తూనే... తాజాగా ఈ నెల 19న విచారణకు రావాలంటూ నోటీసు జారీ చేసింది. ఇప్పటికే మూడుసార్లు సిట్ విచారణకు డుమ్మా కొట్టిన రాజ్ కసిరెడ్డి ఇళ్లు, కార్యాలయం, బంధువుల ఇళ్లు, భార్య పేరుతో పెట్టుబడులు పెట్టిన ఆసుపత్రిలో రెండు రోజులపాటు హైదరాబాద్‌లో సిట్ సిబ్బంది సోదాలు జరిపారు. ఆ సమయంలో

మిగతా 12వ పేజీలో...

నేడు 'సిట్' ముందుకు సాయిరెడ్డి

మద్యం స్కామ్‌లో విచారణ

జగన్ హయాంలో జరిగిన మద్యం స్కామ్ గుట్టుమట్లు తెలిసిన వైసీపీ మాజీ ఎంపీ విజయసాయి రెడ్డిని గురువారం సిట్ అధికారులు ప్రశ్నించనున్నారు. మద్యం బాక్సుపై రూ.150 నుంచి 450 వరకు కమీషన్లు తీసుకున్నట్లు ఆధారాలు సేకరించిన దర్యాప్తు బృందాలు హ్యాండ్లింగ్ వ్యవస్థ, కొరియర్లతో కమీషన్లు సేకరించిన తీరు, మొత్తం నెట్‌వర్క్‌లో ఏడంచెలపై పూర్తి నిర్ధారణ కోసం విజయసాయి రెడ్డి

మిగతా 12వ పేజీలో...

చైనాను ఒంటరిని చేద్దాం

డ్రాగన్ కట్టడికి సుంకాల చర్చలను ఆయుధంగా వాడే యోచనలో ట్రంప్
చైనా ఉత్పత్తుల రవాణాకు అనుమతి ఇవ్వొద్దని పలు దేశాలకు సూచన!
చైనాతో వాణిజ్యం తగ్గించాలని ఒత్తిడి
వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం
చైనా ఉత్పత్తులపై అమెరికా సుంకాల భారం 245 శాతానికి?

వాషింగ్టన్, ఏప్రిల్ 16: వాణిజ్య సుంకాల యుద్ధంలో తమతో ఢీ అంటే ఢీ అన్నట్టుగా వ్యవహరిస్తూ తలనొప్పిగా మారిన చైనాను కట్టడి చేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యోచిస్తున్నారు! సుంకాలకు సంబంధించి ఇతర దేశాలు తమతో చర్చలకు వచ్చినప్పుడు.. చైనాతో వాణిజ్య కార్యకలాపాలను తగ్గించుకోవాలని వాటిపై ఒత్తిడి తేవడం ద్వారా డ్రాగన్ దేశాన్ని ఒంటరిని చేసేందుకు ఆయన ప్రణాళికలు రచిస్తున్నట్టు అమెరికాకు చెందిన వాల్‌స్ట్రీట్ జర్నల్ ఒక కథనాన్ని ప్రచురించింది. ప్రతీకార సుంకాల బారి నుంచి తప్పించుకోవాలంటే.. తమ తమ

మిగతా 2వ పేజీలో...

డబ్బులిస్తాం.. టికెట్ ఇస్తాం.. వెళ్లిపోండి!

అక్రమ వలసదారులకు ట్రంప్ ఆఫర్

భారతీయులపై చైనా వీసాల వర్షం!

ఈ ఏడాది జనవరి 1-ఏప్రిల్ 9 మధ్య 85 వేలకు పైగా వీసాలు మంజూరు
అమెరికాతో వాణిజ్య యుద్ధం నేపథ్యంలో భారత్ పట్ల మారిన చైనా వైఖరి!
'ఇండియన్ ఫ్రెండ్స్' రావాలని పిలుపు

2

బిల్లు గుభేల్‌మనిపిస్తోందా? చార్జీలు చిర్రెత్తిస్తున్నాయా? నెల నెలా కరెంటు ధరల మోతలతో 'విద్యుత్' షాకులిస్తోందా?! మరి ఈ 'మోత'లకు మూలకారణం ఎవ్వరు? ఈ అగచాట్లకు నాంది పలికిన నాయకుడెవరు? అని ప్రశ్నించుకుంటే..


ఒకే ఒక్క సమాధానం జగన్!

మరి ఆయన హయాంలో ఏం జరిగింది? ఇప్పుడు ఈ తిప్పలు ఎందుకు వచ్చాయి? ధరా భారం నుంచి సామాన్యులను గట్టెక్కించేందుకు చంద్రబాబు సర్కారు చేస్తున్న ప్రయత్నం ఏమిటి?

నెలనెలా జగన్ షాకులు

మోత మోగుతున్న విద్యుత్ బిల్లులు

ఇంధన 'సర్దుబాటు' పేరిట బాదుడు
వైసీపీ హయాంలో అనుసరించిన అడ్డగోలు విధానాలతో చార్జీల పెంపు
ప్రతి ఇంటిపైనా సగటున రూ.800 భారం మోపుతున్న డిస్కమ్‌లు
మోత తగ్గించేలా సర్కారు చర్యలు
జెన్కోలో విద్యుదుత్పత్తి పెంపు
బహిరంగ కొనుగోళ్లకు దాదాపు స్వస్తి
ఫలితంగా ధరలు తగ్గించే ప్రయత్నం



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రతి నెలా 1 నుంచి 10వ తేదీ మధ్య ప్రతి ఇంట్లో వినిపిస్తున్న మాట.. "ఈ నెల కరెంటు బిల్లు ఎంతొచ్చింది?. ఎంత బాదేశారు?" అనే!. దీనికి కారణం.. వాడుకున్న కరెంటులో నిలకడ ఉన్నా.. కట్టాల్సిన చార్జీల్లో నిలకడ లేకపోవడం. నెల నెలా రూ.300 మేరకు బిల్లు వచ్చే సాధారణ వినియోగదారుని కుటుంబం.. రూ.1200-రూ.1300 వరకు చెల్లించాల్సి వస్తోంది. దీనికి కారణం... సర్‌చార్జీల బాదుడే! నాటి జగన్ ప్రభుత్వం అనుసరించిన అడ్డగోలు విధానాల పాపం... ఇప్పటికీ వెంటాడుతోంది. భారీ ధరకు కరెంటు కొనుగోళ్లు, నాడు ఉత్పత్తి పెంచకపోవడం తదితర కారణాలతో డిస్కమ్‌లపై భారం పెరిగిపోయింది. ఆ భారాన్ని సర్‌చార్జీల రూపంలో జనంపై బాదడం మొదలైంది. వైసీపీ సర్కారు పోయినా... భారం మాత్రం కొనసాగుతూనే ఉంది. అయితే.. ఇప్పుడున్న చంద్రబాబు ప్రభుత్వం ఈ భారాలను తగ్గించేందుకు ఒకదాని తర్వాత ఒకటి అన్నట్టుగా విద్యుత్ వ్యవస్థను సంస్కరిస్తోంది. ఈ పది మాసాల కాలంలో ఉత్పత్తిని పెంచింది. తద్వారా పెరిగిన వినియోగానికి తగిన విధంగా సరఫరా చేస్తూ.. రూ.5 వేల కోట్ల మేరకు కొనుగోలు భారం నుంచి

మిగతా 11వ పేజీలో...

వక్ఫ్ ఆస్తులేవీ డీనోటిఫై చేయొద్దు



'వక్ఫ్ బై యూజర్' అయినా, వక్ఫ్ బోర్డుల ఆస్తులైనా ప్రస్తుతానికి చర్యలొద్దు
కేంద్రానికి సుప్రీం సూచన.. చట్టంలోని పలు అంశాలపై స్టే ఇచ్చేందుకు సిద్ధం?
'వక్ఫ్ బై యూజర్'లను అనుమతించకుంటే ఎలా?
వందల ఏళ్ల కిందటి ఆస్తులకు పత్రాలు ఎలా వస్తాయి?
హిందూ మత ట్రస్టుబోర్డుల్లో ముస్లింలకు చోటిస్తారా అని సుప్రీంకోర్టు నిలదీత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: దేశవ్యాప్తంగా 'వక్ఫ్ బై యూజర్'గా నమోదై ఉన్నవి సహా వక్ఫ్ ఆస్తులను వేటినీ డీనోటిఫై చేయవద్దని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. కేంద్రం తెచ్చిన వక్ఫ్ సవరణ చట్టంలోని కొన్ని సెక్షన్లను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై బుధవారం విచారణ సందర్భంగా ఈ ప్రతిపాదన చేసింది. ఈ మేరకు చట్టంలోని పలు అంశాలపై స్టే ఇచ్చేందుకూ సిద్ధమైంది. కానీ విచారణ చేపట్టకుండా ఉత్తర్వులేవీ జారీ చేయవద్దంటూ కేంద్రం కేవియట్

మిగతా 2వ పేజీలో...



రాజ్యసభ స్థానానికి 9న ఉప ఎన్నిక

విజయసాయి రాజీనామాతో ఖాళీ అయిన సీటుకు షెడ్యూల్ విడుదల చేసిన ఈసీ
ఈ నెల 22న నోటిఫికేషన్
29 వరకు నామినేషన్లు
పోటీలో టీడీపీ లేనట్లే.. బీజేపీకి కేటాయింపు!
అభ్యర్థి ఎవరో ఒకట్రెండు రోజుల్లో స్పష్టత

11

టీటీడీకి డ్రోన్ వర్రీ

క్షేత్ర భద్రతకు సవాలు విసురుతున్న డ్రోన్లు
కొండపైకి తేవడంపై ఏళ్ల క్రితమే నిషేధం
అలిపిరిలో భద్రతా సిబ్బంది నిర్లక్ష్యం వల్ల డ్రోన్లతో తిరుమలకు వచ్చేస్తున్న భక్తులు
వరుస ఘటనలతో అధికారుల్లో కలవరం
యాంటీ డ్రోన్ సిస్టమ్ ఏర్పాటుపై కసరత్తు
వచ్చే బోర్డు సమావేశంలో చర్చించి నిర్ణయం



2023లో డ్రోన్ ద్వారా తీసిన శ్రీవారి ఆలయ పైభాగ దృశ్యాలు

(తిరుమల-ఆంధ్రజ్యోతి)

తిరుమల శ్రీవారి ఆలయంపై డ్రోన్ల సంచారం క్షేత్ర భద్రతకు సవాలు విసురుతోంది. ఈ అంశం టీటీడీ అధికారులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ క్రమంలోనే యాంటీ డ్రోన్ సిస్టమ్ ప్రతిపాదన మరోసారి తెరపైకి వచ్చింది. ఆగమ శాస్త్ర నిబంధనల ప్రకారం శ్రీవారి ఆలయ విమాన గోపురంపై విమానాల రాకపోకలు నిషేధం. తిరుమలను నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించాలని ఇప్పటికే టీటీడీ పలుమార్లు

మిగతా 9వ పేజీలో...

తదుపరి సీజేఐగా జస్టిస్ గవాయ్

- కేంద్రానికి సుప్రీంకోర్టు సీజే సిఫారసు
- 52వ భారత ప్రధాన న్యాయమూర్తిగా మే14న చీఫ్‌జస్టిస్ ఖన్నానుంచి బాధ్యతలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 : సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బీఆర్ గవాయ్ ఎంపికయ్యారు. ఆయన పేరును కేంద్ర ప్రభుత్వానికి చీఫ్‌జస్టిస్ సంజీవ్ ఖన్నా బుధవారం సిఫారసు చేశారు. వచ్చే నెల 13వ తేదీన ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి పదవీవిరమణ చేయనున్నారు. ఆ మరునాడు, 52వ భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ గవాయ్‌తో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణం చేయిస్తారు. అనంతరం ప్రస్తుత సీజే నుంచి ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు. జస్టిస్ కేజీ బాలకృష్ణన్ తర్వాత ప్రధాన న్యాయమూర్తిగా నియమితులు కానున్న రెండో దళిత న్యాయమూర్తి జస్టిస్ గవాయ్. చీఫ్ జస్టిస్‌గా సంజీవ్ ఖన్నా అప్పటి సీజే చంద్రచూడ్ నుంచి గత నవంబరులో బాధ్యతలు తీసుకున్నారు. జస్టిస్ చంద్రచూడ్ బాటలోనే ఆయనా 65 ఏళ్ల వయసులో పదవీవిరమణ చేయనున్నారు. జస్టిస్ బీఆర్ గవాయ్ పూర్తిపేరు భూషణ్ రామకృష్ణ గవాయ్. మహారాష్ట్రలోని అమరావతిలో 1960 నవంబరు 24న ఆర్ఎస్ గవాయ్, కమల దంపతులకు ఆయన జన్మించారు. ఆర్ఎస్ గవాయ్ దళిత నాయకుడు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (గవాయ్ వర్గం) అధ్యక్షుడు. పార్లమెంటు సభ్యునిగాను, గవర్నర్‌గాను ఆయన సేవలు అందించారు. ఆయన సోదరుడు రాజేంద్ర గవాయ్ కూడా రాజకీయాల్లోనే కొనసాగుతున్నారు. జస్టిస్ గవాయ్ అమరావతి విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రంలో ఉత్తీర్ణులయ్యారు. 1985లో బార్‌కౌన్సిల్‌లో సభ్యులయ్యారు. బొంబాయి హైకోర్టులో 1992 నుంచి 1993 వరకు ఏజీపీగాను, ఏపీపీగాను పనిచేశారు. నాగ్‌పూర్ బెంచ్‌లో పీపీగా 2000 జనవరి 17న నియమితులయ్యారు. హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా 2005 నవంబరు 12న నియమితులయ్యారు. ఆయన 2019 మే 24 నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా కొనసాగుతున్నారు.

'ఎస్సీ వర్గీకరణ' బెంచ్‌లో సభ్యులు

పలు చరిత్రాత్మక తీర్పులు వెలువరించిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనాల్లో జస్టిస్ గవాయ్ సభ్యునిగా ఉన్నారు. ముఖ్యంగా, జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ను రద్దుచేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సమీక్షించిన ఐదుగురు న్యాయమూర్తుల బెంచ్‌లో ఆయన ఒకరు. ఎన్నికల బాండ్లను నిలిపివేస్తూ కీలక తీర్పును వెలువరించడంలో ఐదుగురు న్యాయమూర్తుల బెంచ్‌లో జస్టిస్ గవాయ్ క్రియాశీలక భూమిక పోషించారు. పెద్ద నోట్ల రద్దు నిర్ణయాన్ని 4:1 మెజారిటీతో ఆమోదించిన ఐదుగురు సభ్యుల బెంచ్‌లో ఆయన ఒకరు. ఎస్సీ వర్గీకరణ జరిపే రాజ్యాంగ అధికారం రాష్ట్రాలకు ఉన్నదంటూ 6:1 మెజారిటీలో ఆమోదించిన ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనంలో ఆయన సభ్యుడు.

లోకం తీరు



గంగా జెమునీ తెహ్‌జీబ్‌కు అత్యున్నత ప్రతీక ఉర్దూ

అది విదేశీ భాష కాదు.. మన దేశంలో పుట్టిన భాష: సుప్రీం

బోర్డుల మీద ఉర్దూ ఉండొద్దన్న పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: మన దేశంలోని 'గంగా జెమునీ తెహ్‌జీబ్'కు (హిందూ, ఇస్లామిక్ సాంస్కృతిక సమ్మేళనానికి) ఉర్దూ భాష ఒక అత్యున్నత ప్రతీక అని, భారతదేశ సాంస్కృతిక వైవిధ్యం చూసి మనం గర్వపడాలని సుప్రీంకోర్టు హితవు పలికింది. ఉర్దూ పుట్టిందే భారతదేశంలోనని గుర్తు చేసింది. ఉర్దూను ముస్లింల భాషగా భావించటం అంటే మన దేశ వైవిధ్య వాస్తవికతను పూర్తిగా పక్కనపెట్టి చూసే ధోరణి అని పేర్కొంది. మహారాష్ట్రలోని అకోలా జిల్లా పాతూర్‌లో మునిసిపల్ కౌన్సిల్ కొత్త భవనం బోర్డు మీద అక్షరాలను మరాఠీతోపాటు ఉర్దూలో రాయటాన్ని వర్షాతాయి అనే మాజీ కౌన్సిలర్ వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సుదాంశు, జస్టిస్ వినోద్ చంద్రన్ బుధవారం విచారణ జరిపారు. పిటిషన్‌ను కొట్టేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఉర్దూ మన దేశానికి సంబంధించినది కాదనే దురభిప్రాయం కారణంగానే ఆ భాషపై రకరకాల అపోహలు నెలకొన్నాయని ధర్మాసనం తెలిపింది.

కులాల పేరుతో సంఘాల రిజిస్ట్రేషన్ వద్దు

- మద్రాస్ హైకోర్టు ఆదేశం

చెన్నై, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కులాల పేరుతో సంఘాల రిజిస్ట్రేషన్ చేయరాదంటూ తమిళనాడులోని అన్ని రిజిస్ట్రార్ కార్యాలయాలకు సర్క్యులర్ జారీ చేయాలని రిజిస్ట్రేషన్ శాఖ ఐజీని మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. దక్షిణభారత సెంగుంద మహాజన సంఘం నిర్వహణ కోసం ప్రత్యేక అధికారిని నియమించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై బుధవారం మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భరతచక్రవర్తి నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు వెలువరించింది. కులాలను ప్రోత్సహించే సంఘాలను రిజిస్ట్రేషన్ చట్టం కింద నమోదు చేయవచ్చా, అదేవిధంగా విద్యాసంస్థల పేర్లలో ఉన్న కులాల పేర్లను తొలగించడం సాధ్యమా? అనే అంశాలను పరిశీలించి నివేదిక సమర్పించాలని రాష్ట్రాన్ని ఆదేశించింది. కులాల పేరుతో సంఘాల రిజిస్ట్రేషన్లు చేయరాదంటూ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సర్క్యులర్లు జారీచేయాలని ఆ శాఖ ఐజీని ఆదేశించింది. కుల సంఘాలు నిర్వహిస్తున్న పాఠశాలలు, కళాశాలల నేమ్‌బోర్డుల్లో ఉన్న కులాలను 4వారాల్లోపు తొలగించాలని స్పష్టం చేసింది. లేని పక్షంలో సంబంధిత విద్యాసంస్థల లైసెన్సును రద్దు చేయాలని విద్యాశాఖను ఆదేశించింది. ప్రభుత్వం నిర్వహిస్తున్న కల్లర్, ఆదిద్రావిడుల సంక్షేమ పాఠశాలల పేర్లను కూడా తొలగించాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

ఇకపై రైళ్లలోనూ ఏటీయం సేవలు

ముంబై, ఏప్రిల్ 16: ఏటీఎం సేవలు ఇకపై రైళ్లలోనూ అందుబాటులోకి రానున్నాయి. ప్రయోగాత్మకంగా ముంబై-మన్మాడ్ మధ్య ప్రయాణించే పంచవటి ఎక్స్‌ప్రెస్‌లో అమలు చేశారు. ఈ రైల్లోని ఓ ఏసీ కోచ్‌లో ఏర్పాటు చేసిన ఏటీఎం ట్రయిల్ రన్ విజయవంతంగా ముగిసినట్లు అధికారులు తెలిపారు. దారి మధ్యలో టన్నెళ్లు, పరిమిత మొబైల్ కనెక్టివిటీ ఉన్న ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలు ఎదురైనప్పటికీ, ఏటీఎం సేవల విషయంలో ప్రయాణికులు సంతృప్తితో ఉన్నారని చెప్పారు. ఇండియన్ రైల్వేస్ ఇన్నోవేటివ్ నాన్ ఫేర్ రెవెన్యూ ఐడియాస్ స్కీంలో భాగంగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర సహకారంతో ఏటీఎం ఏర్పాటు చేశామన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు నక్సల్స్ ఎన్‌కౌంటర్

చర్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో మరోమారు తుపాకీ గర్జించింది. కొండగావ్, నారాయణపూర్ జిల్లాల సరిహద్దుల్లోని అడవుల్లో బుధవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలం నుంచి ఏకే-47 తుపాకులను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మావోయిస్టుల కదలికల నేపథ్యంలో డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్ బలగాలు రెండు జిల్లాల సరిహద్దులోని బార్గమ్ అడవుల్లో కూంబింగ్ చేపట్టిన క్రమంలో నక్సల్స్ కాల్పులకు దిగినట్లు వివరించారు. మృతులను డీవీసీఎం సభ్యుడు హల్దార్ (రూ.8 లక్షల రివార్డు), ఏరియా కమిటీ సభ్యుడు రాము(రూ.5 లక్షల రివార్డు) ఉన్నట్లు వెల్లడించారు. ఎదురుకాల్పుల సమయంలో పలువురు మావోయిస్టులు అడవుల్లోకి పారిపోయారని, వారి కోసం కూంబింగ్ కొనసాగుతోందని బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు.



క్లిష్టమైన కేసులు ఛేదించిన పోలీసులకు ఏబీసీడీ అవార్డులు ప్రదానం చేస్తున్న డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా

చైనాను ఒంటరిని చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)





దేశాల గుండా చైనా ఉత్పత్తుల రవాణాకు అనుమతులు నిరాకరించాలని, చైనా కంపెనీలు తమ భూభాగంలో లేకుండా చూడాలని అడిగేందుకు ట్రంప్ యంత్రాంగం సిద్ధమైనట్టు అందులో పేర్కొంది. అందుకు ఆయా దేశాలు అంగీకరిస్తే చైనా ఆర్థికంగా దెబ్బతింటుంది. పైగా.. తమతో చర్చలకు సిద్ధమైనప్పుడు డ్రాగన్ దేశానికి పెద్దగా డిమాండ్లు చేసే అవకాశం ఉండదని అమెరికా భావిస్తోంది. ఈమేరకు ఇప్పటికే అమెరికా దీనిపై కొన్ని దేశాలతో చర్చించినట్టు కూడా వాల్‌స్ట్రీట్ జర్నల్ పేర్కొంది.

గంపగుత్తగా కాదు..

సుంకాల విషయంలో తనతో ఢీ అంటే ఢీ అన్నట్టుగా వ్యవహరిస్తున్న చైనాపై ప్రతీకార సుంకాన్ని అమెరికా నిశ్శబ్దంగా 245 శాతానికి పెంచేసిందా? శ్వేతసౌధం విడుదల చేసిన ఫ్యాక్ట్ షీట్ ప్రకారం చైనా ఉత్పత్తులపై సుంకాల భారాన్ని అమెరికా ఏకంగా 145% నుంచి 245 శాతానికి.. అంటే ఏకంగా మరో 100 శాతం మేర పెంచేసినట్టు. అయితే, వైట్‌హౌస్ ఫ్యాక్ట్‌షీట్‌లో పేర్కొన్న 245 శాతం మాట నిజమేగానీ.. అది చైనా నుంచి అమెరికా చేసుకునే అన్ని ఉత్పత్తుల పైనా గంపగుత్తగా వేసే భారం కాదు. ఆ విషయం ఫ్యాక్ట్ షీట్‌లోనే స్పష్టంగా ఉంది. 125 శాతం ప్రతీకార సుంకం, 20% ఫెంటనిల్ సుంకంతోపాటు.. కొన్ని వస్తువులపై 7.5 శాతం నుంచి 100 శాతం దాకా అదనంగా సుంకాలు ఉన్నట్టు అందులో పేర్కొంది. ఉదాహరణకు.. చైనా నుంచి దిగుమతి చేసుకునే సిరంజిలు, సూదులపై అత్యధికంగా 245 శాతం సుంకాలున్నాయి. 2024లో జో బైడెన్ హయాంలో వాటిపై 100 శాతం సుంకాలు విధించారు. ట్రంప్ అధికారంలోకి వచ్చాక 20% ఫెంటనిల్ సుంకాలు వేశారు. తర్వాత.. ఏప్రిల్ 2న ప్రపంచ దేశాలన్నింటిపైనా విధించిన ప్రతీకార సుంకాల్లో భాగంగా చైనాపై 34 శాతం విధించారు. దానికి చైనా దీటుగా స్పందించి తానూ ప్రతీకార సుంకాన్ని విధించడంతో.. ఆ సుంకాన్ని క్రమక్రమంగా పెంచుకుంటూ 125 శాతానికి తీసుకెళ్లారు. అది 125 శాతం, ఫెంటనిల్ సుంకం 20 శాతం కలిపితే.. 145 శాతం అయ్యింది. సిరంజిలు, సూదులపై బైడెన్ హయాంలో విధించిన 100 శాతాన్ని కూడా కలుపుకొంటే వాటిపై భారం 245 శాతానికి చేరింది. అలాగే.. చైనా నుంచి దిగుమతి చేసుకునే ఊలు స్వెటర్లపై అమెరికా సుంకాల భారం ప్రస్తుతం 168.5 శాతంగా ఉంది. ఇలా ఉత్పత్తిని బట్టి సుంకాల్లో తేడా ఉంటుంది. కాగా.. వైట్‌హౌస్ ఫ్యాక్ట్ షీట్‌లో పేర్కొన్న 245 శాతం సుంకాల గురించి చైనా విదేశాంగ మంత్రిని మీడియా ప్రశ్నించగా.. పన్ను రేట్ల గురించి అమెరికానే అడగాలని ఆయన సూచించారు. సుంకాలు, వాణిజ్య యుద్ధాల్లో విజేతలు ఎవరూ ఉండరని మరోసారి తేల్చిచెప్పారు. చైనా ఇలాంటి వాటికి భయపడదని తేల్చిచెప్పారు.

మేం సిద్ధమే కానీ..

తాను విధించిన ప్రతీకార సుంకాల దెబ్బకు ప్రపంచ దేశాలన్నీ తమతో చర్చలు జరిపి, వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి తహతహలాడుతున్నాయని పదేపదే చెబుతున్న ట్రంప్‌కు.. చైనా ప్రతీకార చర్యల సెగ బాగానే తగులుతున్నట్టు కనిపిస్తోంది. అలాగని చైనాతో చర్చల కోసం తామే ముందడుగు వేయాలంటే అహం అడ్డొస్తోంది. దీంతో.. 'కిందపడ్డా నాదే పైచేయి' అనే సామెత చందంగా అగ్రరాజ్యం వ్యవహరిస్తోంది. "చైనాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి ట్రంప్ సిద్ధంగానే ఉన్నారు. కానీ.. చర్చల దిశగా మొదటి అడుగు బీజింగే వెయ్యాలి" అంటూ వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కారొలిన్ లీవిట్ చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. "ఇప్పుడు బంతి చైనా కోర్టులో ఉంది. ఆ దేశమే మాతో ఒప్పందం కుదుర్చుకోవాలి. ఆ దేశంతో మేము ఏ ఒప్పందాలూ చేసుకోనవసరం లేదు" అని ఆమె పేర్కొన్నారు. చైనాతో ఒప్పందానికి సిద్ధంగా ఉన్నట్టు ట్రంప్ తనతో స్వయంగా తెలిపినట్టు ఆమె వెల్లడించారు.

చైనా నిర్ణయంతో భారత్‌కు మేలు!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం రోజురోజుకూ ముదురుతోంది. ఈ నేపథ్యంలో అమెరికా నుంచి బోయింగ్ విమానాల దిగుమతిని నిలిపివేయాలని చైనా భావించింది. అయితే.. ఈ నిర్ణయం భారత్‌కు కలిసొచ్చే అవకాశం ఉంది.! వాస్తవానికి చైనా విమానయాన సంస్థలు ప్రస్తుతం బోయింగ్ నుంచి సుమారు వంద బీ737 మ్యాక్స్ విమానాల డెలివరీ కోసం ఎదురుచూస్తున్నాయి. భారత్‌కు చెందిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌తోపాటు ఆకాశ ఎయిర్ కూడా కొన్ని బీ787 డ్రీమ్‌లైనర్ విమానాల కోసం ఆర్డర్ పెట్టాయి. అయితే.. అమెరికా నుంచి బోయింగ్‌లు కొనుగోలు చేయకూడదని చైనా తీసుకున్న నిర్ణయంతో.. ఆ దేశం కోసం రూపొందించిన బోయింగ్ విమానాలను భారతీయ విమానయాన సంస్థలకు మళ్లించే అవకాశం ఉంది. ఈ క్రమంలో భారతీయ విమానయాన సంస్థలు బోయింగ్ నుంచి ఊహించని ప్రయోజనాలు పొందే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఆకాశ ఎయిర్‌లైన్స్ సహా పలు భారత విమానయాన సంస్థలకు అవి అడిగిన వాటికంటే అదనపు విమానాలు లభించే అవకాశం ఉందని చెబుతున్నాయి. ఎయిరిండియా గతేడాది 25 మ్యాక్స్ విమానాలను కొనుగోలు చేసింది. మరికొన్ని విమానాలు రావాల్సి ఉంది. అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం నేపథ్యంలో ఇవి ఊహించినదానికంటే ముందే అందే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు బోయింగ్‌కు గుడ్‌బై చెప్పిన చైనా.. ఐరోపాకు చెందిన ఎయిర్‌బస్ వైపు మళ్లనుంది. ఈ నేపథ్యంలో ఎయిర్‌బస్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన ఏ320 విమానాలకు డిమాండ్ పెరుగుతుందని భావిస్తున్నారు.

ట్రంప్ సర్కారుకు కోర్టు ఝలక్!

- భారత విద్యార్థి వీసా రద్దుపై స్టే

న్యూయార్క్, ఏప్రిల్ 16: విద్యార్థి వీసా రద్దు విషయంలో ట్రంప్ ప్రభుత్వానికి కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. భారతీయ విద్యార్థి వీసా రద్దును ఫెడరల్ న్యాయమూర్తి అడ్డుకున్నారు. భారత్‌కు చెందిన క్రిష్‌లాల్ ఇస్సార్దాసాని(21) విస్కాన్సిన్-మాడిసన్ వర్సిటీలో కంప్యూటర్ ఇంజనీరింగ్ చివరి సెమిస్టర్ చదువుతున్నారు. ఈ ఏడాది మే నెలలో అతని గ్రాడ్యుయేషన్ పూర్తికానుంది. బార్ వెలుపల గొడవ పడ్డారనే కారణంతో 2024 నవంబరు 22న క్రిష్‌ను అరెస్టు చేశారు. అయితే ఈ కేసులో అతనిపై అభియోగాలు మోపడానికి డేన్ కౌంటీ డిస్ట్రిక్ట్ అటార్నీ నిరాకరించారు. ఈ వ్యవహారంలో అతను కోర్టుకు కూడా హాజరుకాలేదు. ఈ క్రమంలో ఏప్రిల్ 4న క్రిష్‌లాల్ విద్యార్థి వీసాను ట్రంప్ ప్రభుత్వం రద్దు చేసింది. స్టూడెంట్ అండ్ ఎక్స్‌చేంజ్ విజిటర్ ప్రోగ్రామ్ (సెవిస్) డేటాబేస్ నుంచి అతని రికార్డును తొలగించింది. దీనిపై అతను ఫెడరల్ కోర్టును ఆశ్రయించారు. రికార్డు తొలగింపుపై తాత్కాలిక స్టే ఇవ్వాలని మాడిసన్ న్యాయవాది కోర్టును అభ్యర్థించారు. 'సెవిస్ రికార్డు రద్దు చేయడానికి సంబంధించి ఎలాంటి హెచ్చరికలు, ముందస్తు సమాచారం ఇవ్వలేదు. తప్పు చేసి ఉంటే దానిపై వివరణ ఇవ్వడానికి గానీ, సమర్థించుకోవడానికి గానీ అవకాశం కూడా ఇవ్వలేదు' అని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. వాదనల అనంతరం క్రిష్‌లాల్ బహిష్కరణపై స్టే విధిస్తూ న్యాయమూర్తి విలియం కోన్లీ మంగళవారం తీర్పు వెలువరించారు. క్రిష్ ఎలాంటి నేరాన్ని పాల్పడలేదని పేర్కొన్నారు. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేశారు.

భారతీయులపై చైనా వీసాల వర్షం!

- ఈ ఏడాది జనవరి 1-ఏప్రిల్ 9 మధ్య 85 వేలకు పైగా వీసాలు మంజూరు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో సుంకాల సమరం చేస్తున్న చైనా.. భారత్ విషయంలో తన పంథా మార్చుకున్నట్టు తెలుస్తోంది. భారతీయులపై డ్రాగన్ కంట్రీ వీసాల వర్షం కురిపిస్తోంది. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఈ నెల 9వ తేదీ మధ్య దాదాపు 85 వేలకు పైగా వీసాలను మంజూరు చేసింది. ఇరు దేశాల ప్రజల మధ్య పరస్పర సంబంధాలను పెంపొందించే క్రమంలోనే ఇంత భారీ సంఖ్యలో వీసాలు మంజూరు చేసినట్టు భారత్‌లోని చైనా రాయబారి జు ఫీహాంగ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు. "ఇండియన్ ఫ్రెండ్స్ మరింత మంది మా దేశాన్ని సందర్శించాలి. చైనా ద్వారాలు తీసే ఉంటాయి. సురక్షితం. స్నేహపూరిత వాతావరణాన్ని అనుభవించండి" అని ఫీహాంగ్ ఆహ్వానించారు. కాగా, గత 2023 ఏడాది మొత్తంలో భారతీయులకు 1.8 లక్షల వీసాలను మాత్రమే మంజూరు చేసిన చైనా ఈ ఏడాది తొలి నాలుగు(జనవరి 1-ఏప్రిల్ 9) మాసాల్లోనే 85 వేలకుపైగా వీసాలు ఇవ్వడం గమనార్హం. అంతేకాదు, వీసా దరఖాస్తుల్లో పలు ముఖ్యమైన సడలింపులు కూడా ఇచ్చింది. కేవలం అవసరమైన సమాచారాన్ని మాత్రమే కోరుతోంది. వీసా దరఖాస్తు దారులు వాటిని సమర్పించడానికి ఆన్‌లైన్ అప్పాయింట్‌మెంట్ బుక్ చేసుకునే విధానాన్ని తొలగించి, నేరుగా వీసా కేంద్రాల వద్ద దరఖాస్తులు సమర్పించే సౌలభ్యం కల్పించారు. అదేవిధంగా 180 రోజులకంటే తక్కువగా చైనాలో ఉండాలని భావించే వారికి బయోమెట్రిక్ డేటా, వేలి ముద్రలు వంటివాటిని మినహాయించారు. వీటితోపాటు.. వీసా ఫీజును కూడా తగ్గించారు.

రండి కలిసి పోరాడదాం!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న ఎడతెగని సుంకాలపై పోరాడేందుకు తమతో కలిసి రావాలని భారత్ సహా పలు దేశాలకు చైనా పిలుపునిచ్చింది. సుంకాల పేరుతో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న ట్రంప్‌కు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని భారత్‌లోని చైనా దౌత్యకార్యాలయ అధికార ప్రతినిధి యు జింగ్ వ్యాఖ్యానించారు. భారత్, చైనాలు రెండూ అభివృద్ధి చెందుతున్న అతి పెద్ద దేశాలని, ఈ నేపథ్యంలో అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా సంయుక్త పోరాటం చేయాల్సి ఉందన్నారు. ఇదిలావుంటే, ట్రంప్ విధించిన సుంకాలపై ప్రపంచ వ్యాప్తంగా ఆందోళనలు రావడంతో ఆయన ఇతర దేశాల విషయంలో కొంత వెనక్కి తగ్గారు. కానీ, చైనా విషయంలో తన పంతాన్ని కొనసాగిస్తున్నారు.

డబ్బులిస్తాం.. విమానం టికెట్ ఇస్తాం.. వెళ్లిపోండి!

అక్రమ వలసదారులకు అధ్యక్షుడు ట్రంప్ ఆఫర్

వాషింగ్టన్, ఏప్రిల్ 16: అమెరికాలో నివసిస్తున్న అక్రమ వలసదారులకు దేశాధ్యక్షుడు ట్రంప్ సరికొత్త ఆఫర్ ప్రకటించారు. స్వీయ బహిష్కరణను ఎంచుకొనే వారు స్వదేశానికి తిరిగి వెళ్లడానికి కొంత మొత్తం డబ్బులతో పాటు విమానం టికెట్ కూడా ఇస్తామని తెలిపారు. భవిష్యత్తులో వారిలో కొందరిని అమెరికాలోకి చట్టబద్ధంగా అనుమతించే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తుందని చెప్పారు. "మేం వారికి కొంత డబ్బు, విమానం టికెట్ ఇవ్వబోతున్నాం. వారికి తగిన నైపుణ్యం ఉంటే.. ఆ తర్వాత వారితో కలిసి పనిచేయబోతున్నాం. వారిని వీలైనంత త్వరగా వెనక్కి రప్పించుకుంటాం' అని మంగళవారం ఓ ఇంటర్వ్యూలో ట్రంప్ పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో ఉంటూ నేరాలకు పాల్పడుతున్న వారిపై అధికారులు దృష్టిసారించారని, అయితే ఇతరులు మాత్రం సౌకర్యవంతంగా వెళ్లిపోయేలా ప్రోత్సహిస్తామని వెల్లడించారు. కాగా, ప్యూ రిసెర్చ్ సెంటర్ నివేదిక ప్రకారం 2022లో సరైన పత్రాలు లేకుండా అమెరికాలో 7,25,000 మంది భారతీయులు నివసిస్తున్నారు. అక్రమ వలసదారుల జాబితాలో మెక్సికన్లు, సాల్వడోరియన్ల తర్వాత మనోళ్లే అత్యధికం. మైగ్రేషన్ పాలసీ ఇన్‌స్టిట్యూట్ అంచనాల ప్రకారం 3,75,00 మందితో భారత్ ఐదో స్థానంలో నిలిచింది.

వక్ఫ్ ఆస్తులేవీ డీనోటిఫై చేయొద్దు!

(మొదటి పేజీ తరువాయి)

దాఖలు చేయడంతో విచారణను గురువారం (ఏప్రిల్ 17) మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేసింది. ఇదే సమయంలో వక్ఫ్ సవరణ చట్టంలోని పలు అంశాలపై కేంద్రానికి కొన్ని ప్రశ్నలను సంధించింది. కేంద్రం చేసిన వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పెద్ద సంఖ్యలో పిటిషన్లు దాఖలైన విషయం తెలిసిందే. చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల త్రిసభ్య ధర్మాసనం బుధవారం ఈ పిటిషన్లపై విచారణ ప్రారంభించింది. ఈ సందర్భంగా పిటిషనర్ల తరఫున ప్రముఖ న్యాయవాది కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీ, రాజీవ్ ధవన్, ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తదితరులు సుదీర్ఘంగా వాదనలు వినిపించారు. వక్ఫ్ ఆస్తులన్నీ రిజిస్టర్ చేసుకోవాలన్న నిబంధన సరికాదని, వందల ఏళ్లుగా చాలా ఆస్తులు 'వక్ఫ్ బై యూజర్ (ఎలాంటి పత్రాలు లేకుండా చాలా కాలం నుంచి వక్ఫ్ ఆస్తులుగా కొనసాగుతున్నవి)'గా కొనసాగుతున్నాయని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు ధర్మాసనానికి నివేదించారు. అయితే వక్ఫ్ ఆస్తుల దుర్వినియోగాన్ని అరికట్టడమే దీని ఉద్దేశమని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వివరించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. "వందల ఏళ్లుగా వ్యక్తిగత ట్రస్టులుగా కొనసాగుతున్న 'వక్ఫ్ బై యూజర్'లను ఇప్పుడు ఎలా రిజిస్టర్ చేస్తారు? వాటికి పత్రాలు ఎక్కడి నుంచి వస్తాయి? రిజిస్టర్ చేసుకోకుంటే వక్ఫ్ గుర్తింపు (డీనోటిఫై) తొలగిస్తే ఎలా? ఇంతకుముందు చాలా సందర్భాల్లో కోర్టులు 'వక్ఫ్ బై యూజర్'ను గుర్తించాయి. ఇప్పుడు మీరు గుర్తింపును వెనక్కి తీసుకుంటే చాలా సమస్యలు చెలరేగుతాయి.." అని స్పష్టం చేసింది. వక్ఫ్ బై యూజర్, వక్ఫ్ బోర్డులు సహా వక్ఫ్‌గా కోర్టులు ప్రకటించిన ఆస్తులు వేటినీ డీనోటిఫై చేయవద్దని సూచించింది.

అటు వ్యతిరేకం... ఇటు మద్దతుగా..

వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఎంఐఎం పార్టీ, జమియత్ ఉలేమా ఈ హింద్, ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు వంటి సంస్థలతోపాటు ఆప్, డీఎంకే, సీపీఐ, జేడీయూ తదితర పార్టీలు వేసినవి కలిపి మొత్తం 72 పిటిషన్లు దాఖలయ్యాయి. మరోవైపు కేంద్రానికి మద్దతుగా బీజేపీ పాలిత రాష్ట్రాలు హరియాణా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, అసోం రాష్ట్రాలు పిటిషన్లు వేయడం గమనార్హం.

హిందూ బోర్డుల్లో ముస్లింలను నియమిస్తారా?

వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతర సభ్యుల నియామకాల సెక్షన్‌ను ప్రస్తావిస్తూ.. 'హిందూ మత ట్రస్టు బోర్డుల్లో ముస్లింను నియమిస్తారా?' అని ధర్మాసనం ప్రశ్నించింది. వక్ఫ్ బోర్డులు, కేంద్ర వక్ఫ్ కౌన్సిల్‌లో సభ్యులుగా ముస్లింలే ఉండాలని పేర్కొంది. వక్ఫ్ బోర్డుల్లో ఎక్స్‌అఫీషియో సభ్యులు కూడా ముస్లింలే ఉండాలని సూచించింది. వక్ఫ్ చట్టం ప్రకారం కలెక్టర్లు తమ బాధ్యతలను నిర్వర్తించవచ్చుని.. కానీ దీనికి సంబంధించిన వివాదాస్పద సెక్షన్‌ను మాత్రం ప్రస్తుతానికి అమలు చేయవద్దని సూచించింది. చివరగా పార్లమెంటు చేసిన చట్టాల్లో సాధారణంగా న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోదని.. కానీ వక్ఫ్ చట్టంలోని పలు అంశాలపై అభ్యంతరాలు, వాటితో సమస్యలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయని ధర్మాసనం పేర్కొంది. గురువారం మధ్యాహ్నం విచారణ చేపడతామని.. ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మరోవైపు వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా చేపట్టిన నిరసనల్లో హింస చెలరేగడంపై ఆందోళన వ్యక్తం చేసింది.



ఢిల్లీలో ఆందోళనకు దిగిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు

రాజకీయ ప్రతీకారమే!

ఈడీ చార్జిషీట్‌లో సోనియా, రాహుల్‌ల పేర్లపై భగ్గుమన్న కాంగ్రెస్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: నేషనల్ హెరాల్డ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన చార్జిషీట్‌లో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీల పేర్లను పేర్కొనడాన్ని ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు తీవ్రంగా నిరసించారు. ఏఐసీసీ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జెండాలను చేతబూని బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇది రాజకీయ ప్రతీకార చర్య అంటూ ధ్వజమెత్తారు. 24, అక్బర్ రోడ్డులోని ఏఐసీసీ కేంద్ర కార్యాలయం వెలుపల కాంగ్రెస్ కార్యకర్తలు.. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. "కాంగ్రెస్ అగ్రనేతలు భయపడవద్దు.. మొత్తం దేశం మీతో ఉంది" అంటూ రాసి ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు. కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చిన నేపథ్యంలో భారీ స్థాయిలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కాంగ్రెస్ పార్టీలో రెండు రకాల గుర్రాలు

- రేసులో వాడే వాటిని పెళ్లికి.. పెళ్లికి వాడే వాటిని రేసులకు పంపుతున్నాం
- పార్టీ నేతలకు అప్పగిస్తున్న బాధ్యతలపై రాహుల్ వ్యాఖ్య

అహ్మదాబాద్, ఏప్రిల్ 16: కాంగ్రెస్‌లో నాయకత్వ సమస్యలను ప్రస్తావిస్తూ ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బుధవారం గుజరాత్‌లోని మోడాసాలో ఆయన మాట్లాడారు. "కాంగ్రెస్ పార్టీలో రెండు రకాల గుర్రాలు ఉన్నాయి. ఒకరకమేమో రేసుల్లో దౌడు తీసేవి, రెండో రకం పెళ్లిలో ఊరేగింపులకు వాడేవి. కాంగ్రెస్ చాలా సార్లు పెళ్లికి వాడే గుర్రాలను రేసులకు, రేసు గుర్రాలను పెళ్లిలకు పంపుతోందని కొందరు నాతో చెబుతున్నారు. ఇప్పుడా పరిస్థితిని సరిచేయాలి" అని రాహుల్ పేర్కొన్నారు. ఇకపై సరైన నేతలకు సరైన బాధ్యతలు అప్పగిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో కొందరు నేతలు బీజేపీతో అంటకాగుతున్నారని, అలాంటి వారిని గుర్తించి బయటికి పంపాల్సి ఉందన్నారు. పార్టీలో అంతర్గతంగా మార్పులు రావాల్సి ఉందని ఆయన చెప్పారు.



సంగరాతి గోవింద కుటుంబానికి రూ.15 లక్షల చెక్కు అందిస్తున్న మంత్రి అనిత

మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా

» రూ.15 లక్షల చొప్పున చెక్‌లు అందించిన హోం మంత్రి

కోటవురట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని బాణాసంచా తయారీ కేంద్రంలో ఈ నెల 13న జరిగిన పేలుడులో మృతిచెందిన వారి కుటుంబాలకు హోంమంత్రి వంగలపూడి అనిత బుధవారం ఎక్స్‌గ్రేషియా చెక్కులు అందజేశారు. ఈ దుర్ఘటనలో మొత్తం 8 మంది మృతి చెందగా.. వీరిలో కోటవురట్ల మండలానికి చెందినవారు ఆరుగురు ఉన్నారు. మిగిలిన ఇద్దరిలో దేవర నిర్మలది కాకినాడ జిల్లా సామర్లకోట, మెడిసి హేమంత్ స్వస్థలం విశాఖ జిల్లా భీమిలి. వీరికి కూడా చెక్కులు అందిస్తామని చెప్పారు.

రాష్ట్ర హజ్ కమిటీ నియామకం

» సభ్యులుగా 13 మంది.. మూడేళ్ల పదవీ కాలం

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం హజ్ కమిటీని నియమించింది. కమిటీలో 13 మంది సభ్యులను నియమించింది. ఈ మేరకు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీధర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మెల్యే ఎం.నజీర్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌తో పాటు స్థానిక సంస్థల నుంచి ముగ్గురిని, ముస్లిం థియాలజీలో ఎక్స్‌పర్ట్ షేక్ హసన్ బాషాతోపాటు మరో ఇద్దరిని, సామాజిక కార్యకర్తలు ఐదుగురిని హజ్ కమిటీలో సభ్యులుగా నియమించింది. ఈ 13మంది సభ్యుల్లో ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకోవాల్సి ఉంటుంది. కమిటీ పదవీ కాలం ఉత్తర్వులు వెలువడిన నాటి నుంచి మూడేళ్లుగా పేర్కొన్నారు. కాగా, హజ్ యాత్ర-2025కు ఈ నెల 29 నుంచి ప్రయాణాలు ప్రారంభంకానున్నట్టు రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రం నుంచి 1,630 మంది హజ్ యాత్రకు వెళ్తున్నట్టు వివరించారు.

రోస్టర్ పాయింట్ల విధానాన్ని సరిచేయాలి

» లేకుంటే హైకోర్టుకు వెళ్తాం: కృపాకర్ మాదిగ

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రెల్లి, మాదిగ, అనుబంధ కులాల విద్యార్థులు, నిరుద్యోగులు ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ ద్వారా వచ్చే విద్య, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలి అని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కృపాకర్ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం ఈమేరకు ఆయన ఓ ప్రకటన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణపై నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సిఫారసు చేసిన రోస్టర్ పాయింట్ల విధానాన్ని ఆయన తప్పు పట్టారు. అత్యంత వెనుకబడిన ఎస్సీ కులాల వారికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలనే సుప్రీంకోర్టు తీర్పు స్ఫూర్తికి విరుద్ధంగా కమిషన్ సిఫారసు ఉందన్నారు. రెల్లి అనుబంధ కులాల వారికి 1%, మాదిగ అనుబంధ కులాల వారికి 7%, మాల అనుబంధ కులాల వారికి 7% వచ్చేట్లు వెంటనే సవరించాలని రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీన్ని సవరించకపోతే మాదిగలు న్యాయం కోసం హైకోర్టు మెట్లు ఎక్కాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ ఆర్డినెన్స్ సాధన వెనుక ఎంతోమంది ఎంఆర్‌పీఎస్ కార్యకర్తల ప్రాణత్యాగాలు ఉన్నాయన్నారు.

గంగపుత్రులకు డబుల్ ధమాకా

నాడు-నేడు తేడా ఇదే!

వైసీపీ హయాంలో అనర్హులు:	24,741
జగన్ పాలనలో అర్హుల సంఖ్య:	1,05,387
చంద్రబాబు హయాంలో అనర్హులు:	7,259
ప్రస్తుతం లబ్ధి పొందే మత్స్యకారులు:	1,22,968
అదనంగా లబ్ధి పొందేవారు జాలర్లు:	17,581

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుత ప్రభుత్వం రూ.20 వేలు చొప్పున ఇవ్వనుంది. గత ప్రభుత్వం మత్స్యకార భరోసా పేరుతో రూ.10 వేలు చొప్పున ఇవ్వగా, దీనిని రూ.20 వేలకు పెంచుతామని గత ఎన్నికల మ్యానిఫెస్టోలో చంద్రబాబు ప్రకటించారు. ఈ మేరకు వాస్తవ లబ్ధిదారులకు సంతృప్త స్థాయిలో భృతి అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మత్స్యశాఖ తాజాగా గుర్తించిన అర్హులైన లబ్ధిదారులకు ఈ నెల 26న సీఎం చంద్రబాబు మత్స్యకార భృతిని వారి వారి బ్యాంకు ఖాతాల్లో డీబీటీ పద్ధతిలో జమ చేయనున్నారు. అయితే, గత ప్రభుత్వం 2024, మే నెలలో 12 ఉమ్మడి జిల్లాల్లోని 1,30,128 మంది జాలర్లలో 24,741 మందిని అనర్హులుగా, 1,05,387 మందిని అర్హులుగా గుర్తించింది. కానీ, గత జూన్‌లో ప్రభుత్వం మారిన తర్వాత మంత్రి అచ్చెన్నాయుడు దీనిపై సమీక్షించారు. మత్స్యకార భరోసాలో అర్హులకు అన్యాయం జరిగిందని, అనర్హులు లబ్ధి పొందారని ఫిర్యాదులు రావడంతో వాస్తవ లబ్ధిదారులను గుర్తించడానికి మంత్రి రీసర్వే చేయించారు. చేపల వేట కోసం మత్స్యకారుల బోట్లుకు ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చే డీజిల్‌ను తక్కువగా వినియోగించుకున్న వారు వేటకు వెళ్లడం లేదనే సాకుతో 16,213 మందిని మత్స్యకార భరోసాకు అనర్హులుగా గత ప్రభుత్వం ప్రకటించిన విషయం వెలుగులోకి వచ్చింది. నిజంగా వేటకు వెళ్లే వారందరికీ లబ్ధి అందించాలని ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రీసర్వే తర్వాత తుది జాబితా ప్రకారం 1,30,227 మంది జాలర్లలో 1,22,968 మందిని అర్హులుగా, 7,259 మందిని అనర్హులుగా మత్స్యశాఖ నిర్ధారించింది.

ఇదీ మత్స్యకార భృతి నేపథ్యం

ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజుల పాటు తూర్పు తీర సముద్ర జలాల్లో చేపల వేటపై ప్రభుత్వం నిషేధం అమలు చేస్తుంది. సముద్ర మత్స్య సంపదను పరిరక్షించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. చేపలు, రొయ్యలు, ఇతర సముద్ర జాతుల సంతానోత్పత్తికి వేట నిషేధం దోహదపడుతుంది. అయితే, వేట నిషేధం వల్ల జీవన భృతిని కోల్పోతున్న మత్స్యకారులకు ఉపశమనం కోసం 2013 వరకు 31 కిలోల బియ్యం ప్రభుత్వం పంపిణీ చేసేది. 2014, 15లో బియ్యం బదులు రూ.2 వేల నగదు అందజేయగా, 2016 నుంచి అప్పటి టీడీపీ ప్రభుత్వం భృతిని రూ.4 వేలకు పెంచింది. 2019 నుంచి రూ.10 వేలు పెంచినా డీజిల్ సబ్సిడీ తక్కువగా వాడుకున్న మత్స్యకారులు వేటకు వెళ్లడం లేదనే సాకుతో మత్స్యకార భరోసాకు వేల మందిని అనర్హులుగా జగన్ ప్రభుత్వం ప్రకటించింది. దీంతో తక్కువ మందికే సాయం అందింది. 2019-20లో 1,02,478 మంది అర్హులుగా ఉండగా, 2021-22లో 97,619 మందికే సాయం చేసింది. 2023-24లో 1,16,613 మందికి భరోసా ఇచ్చినా.. అనేక మంది అర్హులు లబ్ధి పొందలేదు. దీంతో మంత్రి అచ్చెన్నాయుడు సంతృప్త స్థాయిలో సర్వే చేయించి, 1,22,968 మంది అర్హులతో లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయించారు. వీరికి ప్రభుత్వం ఆర్థిక సాయం చేయనుంది.



శాసనమండలి సభ్యులుగా ప్రమాణం చేస్తున్న బీద రవిచంద్ర, శ్రీనివాసులు నాయుడు

ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): శాసన మండలికి ఇటీవల ఎమ్మెల్సీలుగా ఎన్నికైన బీద రవిచంద్ర, గాదె శ్రీనివాసులు నాయుడు బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. అమరావతిలోని శాసన సభ భవనంలో మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు వారితో ప్రమాణం చేయించారు. కార్యక్రమానికి అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్, ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్మెల్సీల కుటుంబ సభ్యులు, పలువురు మంత్రులు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు.

టీడీపీ సంస్థాగత ఎన్నికల నిర్వహణకు కమిటీ

» వర్ల రామయ్య చైర్మన్‌గా ఆరుగురు సభ్యులతో నియామకం

అమరావతి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల నిర్వహణ ప్రక్రియ జోరుగా సాగుతోంది. తాజాగా వర్ల రామయ్య చైర్మన్‌గా ఎన్నికల నిర్వహణ కమిటీని పార్టీ అధినేత చంద్రబాబు నియమించారు. ఈ కమిటీలో సభ్యులుగా మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, ఎస్.సవితతోపాటు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎండీ షరీఫ్, దగ్గుమళ్ల ప్రసాదరావును నియమించారు. మే 15 నాటికి అసెంబ్లీ, పార్లమెంటు కమిటీల ఎన్నికను పూర్తి చేయాలని పార్టీ అధినేత ఇప్పటికే ఆదేశించారు.

వైసీపీ ప్రభుత్వంలో రూ.కోట్ల విలువైన తులాభారం కానుకలు స్వాహా!

» బాధ్యులను జైలుకు పంపుతాం: భానుప్రకాశ్ రెడ్డి

తిరుమల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి భక్తులు తులాభారంలో సమర్పించే కానుకలు, నాణేలు కూడా గత వైసీపీ ప్రభుత్వంలో వాటాలేసుకుని తినేశారని టీటీడీ బోర్డు సభ్యుడు బీజేపీ నేత భానుప్రకాష్ రెడ్డి ఆరోపించారు. తిరుమలలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, శ్రీవారి ఆలయంలో ఏది జరగకూడదు, ఏది జరగదని భావించామో అవన్నీ గత ప్రభుత్వంలో జరిగాయని అన్నారు. 'వారం.. నెల వయస్సు ఉన్న బిడ్డలను కూడా తిరుమలకు తీసుకువచ్చి నాణేలు, చక్కర, బియ్యం, కలకండ, నెయ్యి వంటి వాటితో తులాభారం వేసి స్వామికి సమర్పిస్తారు. ఇలా రోజుకు దాదాపు రూ.10 లక్షలు తులాభారం ద్వారా శ్రీవారికి కానుకలు అందుతున్నాయి ఇందులో భారీగా అక్రమాలు జరిగినట్టు నా దృష్టికి వచ్చింది.' అని ఆరోపించారు. రోజుకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఆలయం నుంచి బయటకు తరలించారనే సమాచారం ఉందని తెలిపారు. దీనిపై విచారణ చేపట్టి తప్పుచేసిన, సమర్థించిన, తప్పించిన వారిని త్వరలోనే జైలుకు పంపుతామని చెప్పారు.

గోశాలపై విష ప్రచారం తగదు

» నిర్వహణలో టీటీడీ నిర్లక్ష్యం ఎక్కడా కనిపించలేదు
» సహజ మరణాలను అసహజంగా చిత్రీకరించడం సరికాదు
» హరినాథరెడ్డి అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోండి
» గోశాలను పరిశీలించిన సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



గోశాలలో ఆవును పరిశీలిస్తున్న సీపీఐ నేత నారాయణ

తిరుపతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): 'గోశాలకు టీటీడీ ఎలాంటి లోటు లేకుండా చూస్తోంది. ఆవుల సహజ మరణాలను అసహజంగా చిత్రీకరించి, విషప్రచారం చేయడం సరికాదు. మా పరిశీలనలో టీటీడీ నిర్లక్ష్యం ఏమాత్రం కనపడలేదు' అని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ స్పష్టం చేశారు. బుధవారం తిరుపతిలోని గోశాలను ఆయన సందర్శించి, దాదాపు గంటపాటు అక్కడి పరిస్థితులను పరిశీలించారు. వివాదానికి గల కారణాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గోశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'గోశాల వివాదం అంతర్జాతీయ స్థాయిలో జరుగుతోంది. భారతీయులు ఆవును ఎంతో పవిత్రంగా భావిస్తారు. మనుషులతో పాటు ఆవులకూ సహజ మరణం ఉంటుంది. ఇక్కడ దాణాకు లోటు లేదు. పౌష్టికాహారం, వైద్యులు నిరంతరం అందుబాటులోనే ఉన్నారు. దాతలు ఇచ్చేవి, బయటనుంచి కొనుగోలు చేసిన గోవులను మందలో కలపడం లేదు. దానివల్ల వాటినుంచి వచ్చే వ్యాధులు కూడా తక్కువే. గోశాలను నిశితంగా పరిశీలిస్తే టీటీడీ నిర్లక్ష్యం ఎక్కడా కనిపించలేదు. స్థానికంగా ఉండేవారు ఎవరైనా కొండకు యాత్రికులు పెరిగే విధంగా ప్రయత్నించాలి. కానీ విషప్రచారంతో భయపెట్టకూడదు. రాజకీయంగా ఏదైనా ఉంటే వేరే అంశాలతో విభేదించండి. చర్చాగోష్ఠిల్లో సవాళ్లు విసురుకోండి. అంతేగానీ స్వార్థ రాజకీయాల కోసం గోశాలను ఎన్నుకోకూడదు. మన వ్యవస్థలను మనమే ధ్వంసం చేయకూడదు' అని నారాయణ హితవు పలికారు. 'టీటీడీ వంటి సంస్థల్లో ఆవులతో పాటు అక్కడ పనిచేసే వాళ్లను కూడా కాపాడండి. జీతాలు మంచిగా ఇవ్వండి. కనీస వేతనాలు ఇచ్చేలా చేయండి. హరినాథరెడ్డి ఉన్నప్పుడు దాణాలో పురుగులు ఉన్నాయని సిబ్బంది చెబితే పిచ్చిపిచ్చి సామెతలు చెప్పాడట. అదే ఆహారం గోవులకు పెట్టమని చెప్పినట్లు తెలిసింది. అలాంటి వారిని కఠినంగా శిక్షించాలి. గత పాలకుల హయాంలో 25 ఆవులు వరుసపెట్టి చనిపోయాయని, రూ.60వేలు ఉన్న ఆవును రూ.2లక్షలు పెట్టి కొనుగోలు చేశారని కూడా తెలిసింది. వీటిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలి' అని నారాయణ డిమాండ్ చేశారు.

ఆయన హయాంలోనే అవకతవకలు



గోశాలలో 35 ఏళ్లుగా పనిచేస్తున్నా. పశువులను బిడ్డల్లా చూసుకుంటాం. వందలాది పశువుల్లో ఎక్కడో బక్కచిక్కి, వయసు దాటిన ఆవులు చనిపోవడం సర్వసాధారణం. అలాంటివి ఫొటోలు తీసి రాజకీయం చేస్తున్నారు. ఇంతకుముందున్న డైరెక్టర్ హరినాథ్‌రెడ్డి ఇదంతా చేశారనిపిస్తోంది. ఆయన హయాంలోనే అవకతవకలు జరిగాయి. అవుట్ సోర్సింగ్ సిబ్బంది కాకుండా 82మంది టైంస్కేల్ ఉద్యోగులం ఉన్నాం. మమ్మల్ని పర్మినెంట్ చేస్తామని రూ.25 వేలు చొప్పున వసూలు చేశారు. ఎంతకీ చేయకపోతే నాలుగేళ్ల తర్వాత మా డబ్బు తిరిగి తీసుకున్నాం.

- మునిరత్నం, వర్కర్, గోశాల

గోమాతపై రాజకీయం తగదు



ఆరోగ్యం బాగాలేక, వయసుపైబడి ఆవులు చనిపోయి ఉంటాయి. బయట నుంచి వచ్చిన ఆవులను గోకులంలో కొద్దిరోజులు ఉంచి వైద్య పరీక్షల తర్వాతే మందలోకి తోలుతారు. అంత జాగ్రత్తగా గోశాల నిర్వహణ ఉంటుంది. గోమాతపై రాజకీయం తగదు. - రవి, వర్కర్, గోశాల

విద్యార్థులు ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలి

» కేఎస్‌పీపీ పట్టాల ప్రదానోత్సవంలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు



హైదరాబాద్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులంతా ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అభిలషించారు. కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ(కేఎస్‌పీపీ) తృతీయ పట్టభద్రుల దినోత్సవాన్ని బుధవారం హైదరాబాద్ గీతం వర్సిటీలో ఘనంగా నిర్వహించారు. 30మంది విద్యార్థులకు పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీలను ప్రదానం చేశారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలను ఇచ్చి సత్కరించారు. మాస్టర్స్ డిగ్రీలు అందుకుంటున్న విద్యార్థులను గీతం అధ్యక్షుడు, ఎంపీ ఎం.శ్రీ భరత్ అభినందించారు. మాస్టర్స్ ప్రోగ్రామ్‌లో అగ్రస్థానంలో నిలిచిన ఒయిషిక్ భట్టాచార్యను గీతం అధ్యక్షుడి పేరిట ఏర్పాటు చేసిన బంగారు పతకంతో సత్కరించారు. కేఎస్‌పీపీ డీన్, ఐక్యరాజ్యసమితిలో భారతదేశ పూర్వ శాశ్వత ప్రతినిధి ప్రొఫెసర్ సయ్యద్ అక్బరుద్దీన్, గీతం రిజిస్ట్రార్ డి.గుణశేఖరన్, కేఎస్‌పీపీ సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ కన్వాల్, వీసీ ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా తదితరులు పాల్గొన్నారు.

రేషన్ వాహనాలకు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించండి

» మంత్రి నాదెండ్లకు ఎండీయూ ఆపరేటర్ల వినతి

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రేషన్ వాహనాలకు నాలుగేళ్లుగా చెల్లిస్తున్నట్లుగానే ఈ ఏడాది కూడా ఇన్సూరెన్స్ ప్రీమియం సొమ్మును చెల్లించాలని ఎండీయూ ఆపరేటర్లు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఎండీయూ ఆపరేటర్ల అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రౌతు సూర్యనారాయణ నేతృత్వంలోని ప్రతినిధి బృందం బుధవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను, కమిషనర్ సౌరభ్ గౌర్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఎండీ జిలానీ సమూన్‌లను కలిసి వినతిపత్రాలు అందజేశారు.

వైసీపీ పాలనలో ఉద్యోగుల జీవితాలు నాశనం

» కూటమి ప్రభుత్వంలో ఊరట: వెంకట శివారెడ్డి

అనంతపురం(ప్రెస్‌క్లబ్), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ఉద్యోగుల జీవితాలు నాశనమయ్యాయని ఏపీఎన్‌జీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట శివారెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగులకు ఊరట లభిస్తోందని తెలిపారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని ఎన్‌జీఓ హోంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ హయాంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. బకాయిలు చెల్లించాలని రోడ్డెక్కి నినదిస్తే, సమస్యలను పరిష్కరించకపోగా తమపైనే 3,600 అక్రమ కేసులు పెట్టారని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చాక రూ.1500 కోట్లు పాత బకాయిలు చెల్లించి అండగా నిలిచిందని తెలిపారు. ఉద్యోగులపై పెట్టిన 3,600 అక్రమ కేసులు ఎత్తివేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు డీజీపీకి ఆదేశాలు జారీ చేశారని చెప్పారు.

నేడూ పలు ప్రాంతాల్లో వర్షాలు

అమరావతి, విశాఖపట్నం, తిరువూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భిన్నమైన వాతావరణం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. పిడుగులు, వడగళ్లతో కూడిన వర్షాలు పడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. బుధవారం కోస్తా, రాయలసీమలో పలుచోట్ల పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. రాత్రి 8గంటల వరకు అనకాపల్లి జిల్లా చీడికాడలో 42.5, తిరుపతి జిల్లా పూలతోటలో 41 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గురువారం చిత్తూరు, తిరుపతి, ఉత్తరాంధ్ర జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. పగలు కర్నూలులో 40.7, నంద్యాల జిల్లా గోస్పాడు, శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లిలో 40.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా ఈదురు గాలులకు ఎన్టీఆర్ జిల్లాలో మామిడి రైతుల పరిస్థితి దారుణంగా మారింది. 15రోజుల్లో 4సార్లు ఈ దురు గాలులు సృష్టించిన బీభత్సానికి 60శాతం మామిడి కాయలు నేలరాలగా, మంగళవారం అర్ధరాత్రి వీచిన గాలులకు మరో 20 శాతం కాయలు రాలిపోయాయి.



రెడ్డిగూడెం మండలం నాగులూరులో నేలరాలిన మామిడిని చూపిస్తున్న రైతు

ఆ స్పీడ్ బ్రేకర్లపై ఏం చర్యలు తీసుకున్నారు?

కౌంటర్ వేయాలని ఆర్‌అండ్‌బీ చీఫ్‌కు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రోడ్లపై నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లను తొలగించడంతోపాటు ఇండియన్ రోడ్ కాంగ్రెస్ మార్గదర్శకాలకు అనుగుణంగా వాటిని మార్చేలా ఏం చర్యలు తీసుకున్నారో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రహదారులు భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్‌ను హైకోర్టు ఆదేశించింది. వ్యాజ్యం లో ప్రతివాదులుగా ఉన్నవారికి నోటీసులు జారీ చేసింది. ఈమేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. స్పీడ్ బ్రేకర్ల సమస్యపై న్యాయవాది తాండవ యోగేష్ పిల్ దాఖలు చేశారు. ఇండియన్ రోడ్ కాంగ్రెస్-1996 నిబంధనలు వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లతో వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు.

కరువు మండలాల స్కూళ్లలో మిడ్ డే మీల్స్‌పై వివరాలివ్వండి

» ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లోనూ కరువు ప్రభావిత మండలాల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరుతూ దాఖలైన పిల్‌పై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. దీనిపై వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాలు, పీఎం పోషణ్ మార్గదర్శకాల ప్రకారం పథకం అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పింది. వివరాలు అందజేయకుంటే ఆన్‌లైన్ ద్వారా సీఎస్ హాజరుకు ఆదేశిస్తామని తెలిపింది. ఈమేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. వేసవి సెలవుల్లో కరువు మండలాల్లోని విద్యార్థులకు భోజన పథకం అమలు చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ కాకినాడకు చెందిన 'హెల్ప్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్ట్' చైర్మన్ కీతినీడి అఖిల్ శ్రీ గురుతేజ పిల్ వేశారు. పిటిషనర్ తరఫున తాండవ యోగేష్ వాదనలు వినిపించారు. పథకం అమలుపై నిర్ణయం తీసుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరగా, దీనిపై కేంద్రానికి ప్రతిపాదనలు పంపించామని ప్రభుత్వ న్యాయవాది జయంతి చెప్పారు.

ఆర్జీయూకేటీ ఇన్‌చార్జ్ చాన్స్‌లర్‌గా మధుమూర్తి

అమరావతి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ ఇన్‌చార్జ్ చాన్స్‌లర్‌గా ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.మధుమూర్తిని నియమిస్తూ ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. గత ప్రభుత్వంలో చాన్స్‌లర్ అయిన కేసీ రెడ్డి పదవీ కాలం గతేడాది ముగియడంతో ఆ పోస్టు ఖాళీ అయ్యింది. కాగా చాన్స్‌లర్‌గా సీఎంను నియమించాలని గత ప్రభుత్వం ప్రతిపాదించింది. గవర్నరే ఉండాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఈ అంశం ప్రస్తుతం న్యాయశాఖ పరిశీలనలో ఉంది. ఈ నేపథ్యంలో ఖాళీగా ఉన్న చాన్స్‌లర్‌గా పోస్టుకు ఇన్‌చార్జ్‌ను నియమించారు.

ఉచ్చులో చిక్కి చిరుత మృతి

» నడుముకు ఉచ్చు బిగుసుకుపోవడంతో.. గ్రామస్థులు, అటవీశాఖ అధికారుల కళ్లెదుటే మృతి
» చిరుత గర్భంలోనే రెండు కూనలూ కన్నుమూత

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నిండు గర్భంతో ఉన్న చిరుతపులి వేటగాళ్ల ఉచ్చులో చిక్కి విలవిల్లాడింది. భీకరంగా అరుస్తూ పది గంటలపాటు నరకయాతన అనుభవించింది. నడుముకు ఉచ్చు బిగుసుకుపోవడంతో ఊపిరాడక కొట్టుమిట్టాడింది. చివరకు శరీరంలోని శక్తి సన్నగిల్లి, ఎండకు సొమ్మసిల్లి.. అటవీశాఖ అధికారులు, గ్రామస్థుల కళ్లెదుటే ప్రాణాలు విడిచింది. దీంతో దాని కడుపులో ఉన్న రెండు పిల్లలు కూడా కన్నుమూశాయి. అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలంలో బుధవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. మదనపల్లె మండలం పొన్నేటిగ్రామం సమీపంలో బుధవారం తెల్లవారుజామున పులి అరుపులు విన్న కొందరు గ్రామస్తులు అటువెళ్లి చూడగా.. వేటగాళ్ల ఉచ్చులో చిక్కి గిలగిలా కొట్టుకుంటున్న చిరుత కనిపించింది. దీంతో ఉదయం 8 గంటలకు వారు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎఫ్ఆర్‌వో జయప్రసాదరావు, డీఆర్‌వో మదనమోహన్ సంఘటనా స్థలానికి వచ్చి చిరుతను పరిశీలించారు. దాన్ని బంధించడానికి అటవీశాఖ వద్ద వలలు లేకపోవడంతో వాలీబాల్ నెట్‌లు తీసుకొచ్చారు. చిరుతకు మత్తు ఇంజెక్షన్ ఇచ్చేందుకు అటవీశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల కోసం గంట పాటు ఎదురుచూసారు. తీరా అనుమతి వచ్చాక తుపాకిలో ఇంజెక్షన్ పెట్టి పేల్చగా అవి పేలలేదు. దీంతో తిరుపతి జూపార్కు నుంచి ట్రాంకిలైజర్స్ గన్‌లు తీసుకురావాలని పై అధికారులను కోరారు. ఈలోగా గ్రామస్తులు చిరుతను కాపాడేందుకు ప్రయత్నించగా అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. సొమ్మసిల్లిన చిరుతకు తాగునీరు అందించడానికి కూడా నిరాకరించారు.చివరకు మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో చిరుత సొమ్మసిల్లి అచేతనంగా పడిపోయింది. అధికారులు దగ్గరకు వెళ్లి చూడగా అది మృతిచెందింది.

చిరుత కడుపులో పిల్లలు

ఆరేళ్ల వయసున్న ఈ ఆడ చిరుత గర్భంతో ఉన్నట్లు పశువైద్యాధికారులు డాక్టర్ ప్రసాదరెడ్డి, లారెన్స్ స్థానిక పశువైద్యశాలలో నిర్వహించిన పోస్టుమార్టంలో బయటపడింది. చిరుత కడుపులో రెండు మగ పిల్లలు కనిపించాయి. మరో 20 రోజుల్లో తల్లి గర్భం నుంచి బయట పడేవని డాక్టర్ రోహిణి వెల్లడించారు. చిరుత కళేబరంతో పాటు, దాని పిల్లలను కూడా అధికారులు దహనం చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పొత్తుపై నీలినీడలు

కమలంతో స్నేహం ఎన్నికల వరకేనని అన్నాడీఎంకె అధినేత పళనిస్వామి బుధవారం చేసిన వ్యాఖ్యను ఎవరికి తోచినరీతిలో వారు విశ్లేషించుకోవచ్చు. అధికారపక్షం డీఎంకెను ఓడించగలశక్తి తమకు ఉన్నదని పళనిపార్టీలో ఎంతమంది నమ్ముతున్నారో తెలియదు కానీ, బీజేపీతో గతవారం మొలిచిన పొత్తు కారణంగా తాము మరింత దెబ్బతినిపోతామన్న భయం మాత్రం అత్యధికుల్లో ఉంది. మరీ ముఖ్యంగా కార్యకర్తల్లో ఉన్న ఈ ఆందోళనను పటాపంచలు చేయడానికీ, వారిలో ఉత్సాహాన్ని నింపడానికి పళని ఈ వ్యాఖ్యలు చేసినట్టు కనిపిస్తోంది. బీజేపీని కాదు పొమ్మనగలిగే స్థితి పళని పార్టీకి లేదు. డీఎంకెను బలంగా ఢీకొట్టడానికి సమస్త సంపత్తీ ఉన్న బీజేపీ దానికి అవసరం. పొత్తును పునరుద్ధరించుకోవాలా వద్దా అని మల్లగుల్లాలు పడి, చివరకు కుదర్చుకున్నప్పటికీ, డీఎంకె నుంచి వస్తున్న విమర్శలు, ప్రశ్నలు పళని పార్టీని ఆత్మరక్షణలో పడేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే, ఎన్నికలవరకే పొత్తు అనడం ద్వారా, ఆ తరువాత ప్రభుత్వం ఏర్పాటులో కానీ, పాలనలోనే కానీ బీజేపీకి వీసమెత్తు చోటు ఉండదని పళని ముందే సందేశం ఇవ్వదల్చుకున్నట్టు కనిపిస్తోంది.

ప్రధాని మోదీ, అమిత్ షా ఇత్యాది బీజేపీ నాయకులు ఈ పొత్తును ఘనంగా ప్రశంసిస్తూ ప్రకటనలు చేశారు. నిజానికి, బీజేపీ నాయకులకంటే ఎక్కువగా ఈ పొత్తును ఆకాశానికి ఎత్తేస్తూ తమిళనాడు అభివృద్ధి, ఇరుపక్షాల ముందుచూపు, రాష్ట్రానికి మోదీ ఆశీస్సులు ఇత్యాది మాటలు వాడింది పళనిస్వామే. పొత్తుకు ఏ కండిషన్లు, డిమాండ్లు లేవని, అన్నాడీఎంకె వ్యవహారాల్లో, నిర్ణయాల్లో బీజేపీ ఏ మాత్రం జోక్యం చేసుకోబోదని, కలసికట్టుగా పనిచేస్తామని అమిత్ షా మొన్న శుక్రవారం పొత్తు ప్రకటన నాడు వివరించారు. రెండుపార్టీలను సహజభాగస్వాములని కీర్తించారు. ఈ పొత్తు పునరుద్ధరణ కోసం బీజేపీ అన్నామలై వంటి పోరాటవీరుడిని వదులుకుంది. ఆయన డీఎంకెమీద అస్త్రాలు సంధిస్తున్నంతవరకూ అన్నాడీఎంకె బాగా ఆనందపడింది. ఆయన కారణంగానే రాష్ట్రంలో నాలుగుఓట్లు పడుతున్నాయనీ, పార్టీ పెరుగుతోందని, సిద్ధాంత వ్యాప్తి జరుగుతోందని బీజేపీ నాయకులు కూడా సంతోషించారు. కానీ, ఆ తరువాత అన్నాదురై, జయలలిత సహా అన్నాడీఎంకె నాయకులమీద ఈ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఘాటైన విమర్శలు చేయడంతో సార్వత్రిక ఎన్నికలకు ముందే పళనిపార్టీ ఆ పొత్తు తెంపేసుకుంది. బీజేపీతోనూ, ఎన్డీయేతోనూ తెగదెంపులు తమకు అత్యంత సంతోషకరమైన ఘట్టం అని ఈ నాయకులంతా అన్నారు. బీజేపీతో పొత్తు కారణంగా మైనారిటీ ఓట్లు తమకు దక్కకుండా పోతున్నాయని, ముప్పైతొమ్మిది ఎంపీ సీట్లూ తామే గెలుస్తామని చెప్పుకున్నారు. కానీ, ఈ తెగదెంపుల ఎత్తుగడ తర్వాత కూడా సార్వత్రిక ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకూ ఒక్కసీటు కూడా గిట్టుబాటు కాలేదు.

ఈ విడాకుల సందర్భంలోనే, చాలామందికి జయలలిత మరణానంతరం ఆమె పార్టీ రెండుగా చీలిన ఘట్టం గుర్తుకువచ్చింది. కన్నీరుమున్నీరవుతున్న శశికళ తలనిమిరి ప్రధాని మోదీ ఓదార్చడం, అనూహ్యంగా న్యాయస్థానం ఆదేశాలతో శశికళ జైలుకు పోవడం, పళని–పన్నీరు వైరాలు, న్యాయపోరాటాలు, తరువాత కరచాలనాలు, వెన్నుపోట్లు ఇత్యాది పరిణామాలు అన్నాడీఎంకెను ఎంతగా బలహీనపరిచాయో తెలియందేమీ కాదు. తెరవెనుక బీజేపీ ఉన్నదనీ, తమిళనాడులో ప్రత్యక్షంగా కాలూనడానికి వీలుగా అమ్మ పార్టీని అదే బలహీనపరచిందని చాలామంది నమ్మకం. అదేతరహాలో అన్నాడీఎంకెను మళ్ళీ చీల్చడానికి అన్నామలై పావులు కదుపుతున్నారన్న అనుమానాల నేపథ్యంలో వేరుపడిన ఈ రెండుపార్టీలు, ఇప్పుడు మళ్ళీ చేయీ చేయీ కలిపి పోరాడాలని నిర్ణయించుకున్నాయి. అన్నామలై స్థానంలోకి అన్నాడీఎంకె మాజీ నాయకుడైన నయనార్ నాగేంద్రన్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా వచ్చి మార్గాన్ని సుగమం చేశారు. అత్యంత బలంగా ఉన్న డీఎంకెను ఓడించడానికి ఉభయపక్షాలకు ఈ పొత్తు ముఖ్యం. మరీముఖ్యంగా, తమిళనాడులో కాలూనడం అంత సులభం కాదని ఈ పదేళ్ళకాలంలో తత్వం బోధపడిన బీజేపీకి అన్నాడీఎంకె ఊతం మరీ అవసరం. గత మూడు ఎన్నికల్లోనూ అంతగా లబ్ధిపొందని ఈ కూటమి కేవలం ఏడాదిలో ప్రజలను తన వైపు ఏమేరకు తిప్పుకోగలదో చూడాలి.

పచ్చళ్ళమ్మాయి–పెట్టుబడిదారీ భాష!

"ఇదే అదనుగా చోటామోటా వ్యాపారులంతా చెలరేగిపోతున్నారు. క్యూ వెంబడి రకరకాల వస్తువులు పట్టుకుని తిరుగుతున్నారు. కొనమని డిమాండ్ చేస్తున్నారు. కొననివాళ్లను తిడుతున్నారు. మరీ భీష్మించుకుంటే నిర్దాక్షిణ్యంగా క్యూలోంచి లాగిపడేస్తున్నారు. ఇంట్లోంచి బయటికొచ్చాక ఏదో ఒకటి కొనకుండా ఎలా ఉంటారండీ. అసలు అలాంటి వాళ్లు ఇంట్లోంచి బయటికి ఎందుకొచ్చారండీ" ఇవి నేను 2014లో రాసిన 'ఒంటిచెయ్యి' కథలోని మాటలు.

కొనుగోలు శక్తి లేనివారికి బయట తిరిగే అర్హత లేదనేది ఈ సన్నివేశంలో సారాంశం. మళ్లీ అలాంటి అంశమే నాకు అలేఖ్య చిట్టి పచ్చళ్ల వివాదంలో కనిపించింది. ధర ఎక్కువ అని ఒక కస్టమర్ అన్నందుకు ఆ పచ్చళ్లు అమ్మే అమ్మాయిల్లో ఒకామె ఓ ఆడియోలో అతణ్ణి దుర్భాషలాడింది. 'నువ్వెందుకూ పనికిరావు.. తొందరపడి ప్రేమ, పెళ్లి వంటి వాటి జోలికి వెళ్లకు, ముష్టి పచ్చళ్లే కొనలేని నువ్వు రేపు పెళ్లానికి బంగారం ఏమి కొనిపెడతావు' అంటూ అతణ్ణి దెప్పిపొడిచింది. ఆ ఆడియో వైరల్ అయిపోయింది. ఆడపిల్ల, పైగా పెళ్లి కాని యువతి అయ్యుండి, పవిత్ర భారత సమాజంలో ఇంతటి పచ్చిగా మాట్లాడుతావా.. అంటూ అందరూ ఆ అమ్మాయిని ట్రోల్ చేశారు. ఆమె నడిపే వెబ్‌సైటును, యూట్యూబ్ చానల్‌ను రిపోర్టు కొట్టారు.

ఇక్కడ ఆమె వాడిన భాష కన్నా ఆ మాటల్లోని అంతరార్థమే ఎక్కువ ఆందోళన కలిగించే విషయం. ఎందుకంటే ధర ఎక్కువ అని ప్రశ్నించిన వారికి ఆమె అనునయంగా నచ్చచెప్పే ప్రయత్నం చేయలేదు. ధర ఎందుకు ఎక్కువో వివరించే ప్రయత్నమూ చేయలేదు. అసలు ఆ ప్రశ్న అడగడమే తప్పు అన్నట్టు తిట్టింది. ఇంకోసారి ఇంకెవరైనా అలాంటి ప్రశ్న వేయడానికే భయపడిపోయి ఆత్మన్యూనతా భావానికి గురయ్యేలా ప్రవర్తించింది. సమాజంలో కొనుగోలు శక్తి లేని బక్క ప్రాణులకు తన పచ్చళ్లు తినే అర్హత లేదని తెలిసో తెలియకో ఆమె తేల్చేసింది.



నిత్యం ప్రతి చోటా ఖరీదైన షాపుల్లో తలవొంచుకుని అడిగినంత ఇచ్చి కొనుగోలు చేస్తున్న మనకు కేవలం పచ్చళ్లమ్మాయిని మాత్రమే ధర ఎక్కువ అని ప్రశ్నించే హక్కు ఉందా? నాకైతే ఆ పచ్చళ్లమ్మాయిలో ఈ పెట్టుబడిదారీ సమాజం తయారు చేసిన ఒక మరబొమ్మ మాత్రమే కనిపిస్తోంది.

నిజానికి ఈ పచ్చళ్ల అమ్మాయి మాట్లాడింది పెట్టుబడిదారీ సమాజపు భాష. మొన్న ఓ ఐస్‌క్రీం ప్రకటన చూశాను. దాని ధర మనం నిత్యం తినే సాధారణ ఐస్‌క్రీం కన్నా పది రెట్లు ఎక్కువ! పైగా బ్రాండెడ్. ప్రకటనలో ఒకమ్మాయి ఆ బ్రాండెడ్ ఐస్‌క్రీమ్‌ని కొనగానే ఉన్నట్టుండి సమాజం ఆమెను చూసే చూపు మారిపోతుంది. అప్పటిదాక సాధారణ స్త్రీలా ఉన్న ఆమె ఆ ఐస్‌క్రీమ్ కొన్న మరుక్షణమే మహారాణిలా కనిపిస్తుంది. పైగా ఇదే ప్రకటనలో సాధారణ ఐస్‌క్రీమ్ తింటున్న ఒకతను ఈ బ్రాండెడ్ ఐస్‌క్రీమ్ తింటున్న ఆమెను చూసి ఆత్మన్యూనతా భావానికి గురై సిగ్గుతో తన ఐస్‌క్రీమ్‌ని చేతులు వెనక్కి పెట్టుకుని దాచుకుంటాడు. ఈ బ్రాండెడ్ ఐస్‌క్రీమ్ ట్యాగ్‌లైన్ ఏంటో తెలుసా? 'ఎంజాయ్ ద రాయల్ ట్రీట్‌మెంట్'.

పెట్టుబడిదారీ సమాజంలో ఎవరెంత ఖరీదైన వస్తువును కొంటే వారు అంత గొప్ప. అంతే తప్ప 'దానికంత విలువ ఉందా? వస్తువేంటి? నాణ్యతేంటి?' వంటి ప్రశ్నలకు, లాజిక్కులకు తావుండదు. అలాంటి ప్రశ్నలు వేసేవారిని ఈ పచ్చళ్లమ్మాయి ఈసడించుకున్నట్టే మార్కెట్ కూడా ఈసడించుకుంటుంది. ఒక రకంగా అలాంటి వారితో ఈ సమాజానికి ఎలాంటి ఉపయోగమూ లేదని తేల్చేస్తుంది. వారు బతికుండటం కన్నా చనిపోవడమే మేలు అనేలా ప్రవర్తిస్తుంది. ఎలాగోలాగ డబ్బు సంపాదించి పోటీలో నిలబడి, ఎంతకు పడితే అంతకు వస్తువులు కొని అనుభవించడం ఒకటే పరమార్థంగా బోధిస్తుంది. దానికోసం నువ్వు ఏ దారులు తొక్కినా ప్రోత్సహిస్తుంది. అంతిమంగా డబ్బే జీవితం అని చెబుతుంది. అలా అని ఆ అందని పండులో ఏదైనా ప్రత్యేకత ఉంటుందా అంటే.. ఏమీ ఉండదు. కేవలం ప్రచారం ద్వారా దాని చుట్టూ అల్లిన 'బ్రాండు' అనే ఒక రూపరహితమైన మాయాపొర మాత్రమే ఉంటుంది. 'ధర' అనే ప్రశ్నే మన దగ్గర్నుంచి రాకుండా బ్రాండు పేరుతో ఏమీ లేని దానికి ప్రచారం కల్పించి, పోటీకి పెట్టి, ఊరించి కిమ్మనకుండా కొనేలా చేస్తుంది పెట్టుబడిదారి మార్కెట్. అది కొనలేకపోతే జీవితమే వృథా అనిపిస్తుంది.

మధ్యతరగతి ప్రజలు ఈ మాయలో పడి ఆదాయానికి, ఖర్చుకు మధ్య పొంతన కుదరక నిరంతరం నరకం చూస్తారు. వస్తువులు కొనకుండా ఉండలేక, కొని బతకలేక పూర్తిగా డబ్బుతో ముడిపడ్డ మానవ సంబంధాలన్నీ ధ్వంసమై, చావలేక, బతకలేక నలిగిపోతుంటారు. ఒక దశలో మనిషికున్న కొనుగోలు శక్తి మాత్రమే సమాజంలో అతని హోదాని, గౌరవాన్ని నిర్దేశిస్తుంది.

ఇక్కడ పచ్చళ్లమ్మాయి కాబట్టి ధర ఎక్కువని మన నోరు లేచింది కానీ, నిత్య జీవితంలో మనం ఈ ప్రశ్న ఎంతమందికి వేస్తున్నాం? ముఖ్యంగా మల్టీ నేషనల్ కంపెనీలు కేవలం హంగులు పొంగులతో వచ్చి మన దగ్గర దొరికే మంచినీళ్లను కూడా మనతోనే వందలు పెట్టి కొనిపించడం లేదూ! ప్రతి చోటా నిత్యం ఖరీదైన షాపుల్లో తలొంచుకుని అడిగినంత ఇచ్చి కొనుగోలు చేస్తున్న మనకు కేవలం పచ్చళ్ళమ్మాయివంటివారిని మాత్రమే 'ధర ఎక్కువ' అని ప్రశ్నించే హక్కు ఉందా? నాకైతే ఆ పచ్చళ్ళమ్మాయిలో ఈ పెట్టుబడిదారీ సమాజం తయారు చేసిన ఒక మరబొమ్మ మాత్రమే కనిపిస్తోంది.

○ డా. వేంపల్లె షరీఫ్

ఎవరు దేశభక్తుడు? ఎవరు దేశద్రోహి?



ఇటీవల ఒక సినిమా షూటింగ్ కోసం ఢిల్లీకి వెళ్లాను. రాత్రంతా షూటింగ్. పగలు విశ్రాంతి. బయటకు వెళ్దామంటే ఎర్రటి ఎండ. టీవీ పెడితే పార్లమెంట్‌లో వక్ఫ్ చట్టంపై చర్చ జరుగుతోంది. దాన్ని చూస్తుంటే నాకెందుకో ఉమర్ ఖలీద్ గుర్తుకొచ్చాడు. ఏసీ రూముల్లో నివసించే నేనే ఎండను తట్టుకోలేకపోతున్నానే, ఐదేళ్ల పాటు తీహార్ జైలులో ఈ ఎండను ఉమర్ ఎలా తట్టుకున్నాడా? అనిపించింది. నా ఆలోచనలు– ఖలీద్ తల్లిదండ్రుల వైపు మళ్లాయి. ఒకసారి వాళ్లని కలిసి ధైర్యం చెబితే బావుంటుంది కదా అనుకున్నాను. మా ఇద్దరికీ పరిచయం ఉన్నవారికి ఫోన్ చేశాను. ఉమర్ తల్లిదండ్రులతో వారు మాట్లాడి, నేను వాళ్లను కలిసేందుకు వస్తున్నానని చెప్పారు. మార్గమధ్యంలో వాళ్లు కలిసారు. ఉమర్‌ను వారందరూ వారానికొకరు తీహార్ జైల్లో కలుస్తూ ఉంటారు. "మీ పనులు మీకుంటాయి. ఇంత హడావుడి జీవితంలో ప్రతివారం ఉమర్‌ను కలవటానికి సమయం ఎలా కేటాయించగలుగుతున్నారు?" అని అడిగాను. "జైలు జీవితం ఎవరినైనా మార్చేయొచ్చు, అంత క్రూరంగా ఉంటుంది. అమీర్ అని మాకు తెలిసిన ఓ యువకుడున్నాడు. అతణ్ణి కూడా తప్పుడు అభియోగాలతో జైలుకు పంపారు. మొదటి మూడు నెలలు అమీర్ కుటుంబ సభ్యులు ప్రతి వారం వచ్చి తనను కలిసేవారు. కానీ వాళ్లది రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితి. దాంతో జైలుకు రావటం తగ్గించారు. వారు రాకపోవటంతో అమీర్‌లో ఆత్మవిశ్వాసం తగ్గింది. సునాయాసంగా బెయిల్ వచ్చేసే ఆ కేసులో– అమీర్ పదేళ్లు జైలులోనే గడిపాడు. జైలు అతణ్ణి ఎలా మార్చిందో మా కళ్లతో చూశాం. ఉమర్‌కు అలాంటి స్థితి రాకూడదని నిర్ణయించుకున్నాం. 'నీకు అండగా మేమున్నాం' అని చెప్పటానికి ప్రతి వారం మాలో ఒకరు వెళ్లి కలిసి వస్తూ ఉంటాం" అని ఉమర్ స్నేహితుడొకరు చెప్పారు. బెయిల్ రాకుండా, విచారణ లేకుండా జైళ్లల్లో మగ్గిపోతున్నవారు కొన్ని కోట్లమంది ఉన్నారు. వారి వేదన కేవలం వారి కుటుంబాలకు, స్నేహితులకు మాత్రమే తెలుస్తుంది. ఉమర్ స్నేహితుల దృష్టిలో అతనొక దేశభక్తుడు. దేశంలో జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నవాడు. అలాంటి వ్యక్తిని ప్రభుత్వం జైలులో ఉంచి మానసికంగా ఇబ్బంది పెడుతోంది కాబట్టి వారు అతనికి అండగా నిలవాలనుకున్నారు ఉమర్ స్నేహితులు. వారిని చూస్తుంటే గర్వంగా అనిపించింది.

మేము వెళ్లే సమయానికి ఉమర్ తండ్రి వక్ఫ్ బోర్డు సమావేశానికి వెళ్లారు. తల్లి ప్రేమతో మమ్మల్ని ఆహ్వానించింది. పైకి నవ్వుతూ మాకు ఆతిథ్యమిచ్చినా, ఆమె కన్నుల్లో ఎంతో బాధ గూడుకట్టుకు ఉంది. ఆమెను ఎలా ఓదార్చాలో నాకు తెలియలేదు. ఏవో సందర్భం లేని మాటలు మాట్లాడుతున్నాం. మధ్యలో ఎక్కడో ఉమర్ కేసు ప్రస్తావన వచ్చింది. "నా కుమారుడు త్వరలో విడుదలవుతాడు, కచ్చితంగా బయటకు వస్తాడు. మాకు న్యాయ వ్యవస్థపై ఇంకా విశ్వాసం ఉంది" అంది. మేము ఆమెను ఓదార్చటానికి వచ్చినట్లు అనిపించలేదు. ఆమె మమ్మల్ని ఓదారుస్తున్నట్లు అనిపించింది. నా కళ్లు చెమర్చాయి. కొడుకును అన్యాయంగా జైలులో పెట్టినవారికి శాపనార్థాలు పెట్టాల్సిందిపోయి, న్యాయవ్యవస్థపై నమ్మకంతో మాట్లాడుతోందంటే ఆమె ఆత్మవిశ్వాసాన్ని ఎలా వర్ణించాలి? ఇంతలో ఉమర్ తండ్రి వచ్చాడు. లోపలికి వెళ్లి మా అందరికీ చాయ్ కలిపి తీసుకువచ్చాడు. "మీ కుమారుడు ఒంటరి కాదు, మేమందరం ఉన్నాం," అన్నాను. ఆయన కళ్లలో ఒక వైపు విశ్వాసం, మరోవైపు ఆవేదన కనిపిస్తున్నాయి. "ఉమర్ తప్పు చేసి జైలుకు వెళ్లలేదు. ప్రజల కోసం పోరాడుతూ జైలుకు వెళ్లాడు. అయినా మనందరం తనతోనే ఉన్నాంగా," అన్నారాయన. ఆ తండ్రి ఆత్మవిశ్వాసానికి మనస్సులోనే సెల్యూట్ చేశాను. మాటలు సాగుతున్నాయి. "ఉమర్‌కు బెయిల్ వచ్చి విడుదలయితే, ప్రకాశ్ సార్ దగ్గరకు దక్షిణ భారతదేశానికి పంపేద్దాం. అక్కడైతే క్షేమంగా ఉంటాడు బాబా!" అని ఉమర్ స్నేహితుడొకరు అన్నారు. ఉమర్ తండ్రి అతని కళ్లలోకి సూటిగా చూసి "పోరాటం జరుగుతున్నది ఇక్కడ, ఢిల్లీలో. ఆ ప్రాంతాన్ని వదిలి ఎక్కడికి వెళ్లాలి? ఎందుకు వెళ్లాలి?" అన్నారు. ఆయన మాటలకు నాకు షాక్ కొట్టినట్లయింది. వారి దృష్టిలో పోరాటమనేది జీవితానికి పర్యాయపదం. ఒక వ్యక్తికి ఉన్న సహజమైన హక్కులతో, రాజ్యాంగం చట్టబద్ధంగా ప్రసాదించిన గౌరవంతో ఈ సమాజంలో జీవించాలంటే పోరాడాల్సిందే. జీవచ్ఛవాలుగా ఉండలేం కదా! వర్తమానంలో ఉమర్‌ను ఎన్ని రకాలుగానైనా అనుకోవచ్చు. చరిత్ర మాత్రం భవిష్యత్తులో ఉమర్‌ను, అతని తల్లితండ్రులను దేశ భక్తులుగా గుర్తిస్తుందనే నమ్మకం నాకుంది.

> ఆరోపణలపై విచారణ చేయకుండా, నిర్ధారణ చేయకుండా, ఒక వ్యక్తిని ఐదేళ్లు జైలులో ఉంచటం చట్టవిరుద్ధమని సహజన్యాయ సూత్రాలు చెబుతున్నాయి. కానీ ఉమర్ ఖలీద్‌కు తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకొనే అవకాశమే లేకుండా పోతోంది. "ఇరవై నిమిషాల సమయం ఇవ్వమనండి. ఉమర్ ఏ అపరాధమూ చేయలేదని నిరూపిస్తా" అంటాడు ఆయన తరపు న్యాయవాది. కానీ ఆ ఇరవై నిమిషాల సమయం సుప్రీంకోర్టుకు లభించటం లేదు.

ఇక్కడ మనం ఇంకొన్ని విషయాలు కూడా మాట్లాడుకోవాలి. అసలు దేశద్రోహం అంటే ఏమిటనే విషయం తెలియకపోతే ఎవరు దేశభక్తుడో ఎవరు దేశద్రోహో ఎలా తెలుస్తుంది? ఈ నిర్వచనాలు తెలుసుకోవటానికి ఎప్పటి చరిత్రనో తవ్వాల్సిన అవసరం లేదు. వందేళ్ల నాటి చరిత్రను గమనిస్తే చాలు. మన దేశాన్ని అహింస అనే సూత్రం ద్వారా ఏకతాటిపై ఉంచిన మహాత్ముడు మత సామరస్యమనే సిద్ధాంతాన్ని గాఢంగా నమ్మాడు. "దేశం అంటే భూభాగం కాదు. దానిలో నివసించే ప్రజలు. వారందరికీ తమకు నచ్చిన మతాన్ని అనుసరించే హక్కు ఉంది. జాతి, మతం, భాషలు వేరు కావచ్చు. కానీ అందరూ సోదరులే" అని ప్రచారం చేశాడు. ఈ భావజాలాన్ని వ్యతిరేకించిన గాడ్సే అనే మతతత్వ ఉన్మాది మహాత్ముడిని హత్య చేశాడు. ఈ మధ్యకాలంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత– గాంధీజీని దేశద్రోహిగా, గాడ్సేను దేశభక్తుడిగా చిత్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం బీజేపీ చేతిలో అధికారం ఉంది. తమ విధానాలను అడ్డుకున్నవారు దేశద్రోహులవుతున్నారు. తమ మతమౌఢ్యాన్ని సమ్మతించేవారు అనతి కాలంలోనే దేశభక్తులవుతున్నారు! ఉమర్ కూడా అంతే! అతను ఒకప్పుడు చురుకైన యువకుడు. భారత రాజ్యాంగ ఆత్మను అర్థం చేసుకున్నవాడు. దానిని నాశనం చేస్తున్న వారికి వ్యతిరేకంగా రోడ్డెక్కి పోరాడినవాడు. మతద్వేషాన్ని, మతమౌఢ్యాన్ని వ్యాప్తి చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలనుకున్నవారికి వ్యతిరేకంగా పోరాడినవాడు. "మతం వ్యక్తిగత అంశం. దానికి రాజకీయాల్లో స్థానం లేదు" అని ప్రతిపాదించిన గాంధీకి నిజమైన మానస పుత్రుడు. "సర్వాధికారానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఈ పోరాటం మన నుంచి ప్రారంభం కాలేదు, మనతో ఆగిపోదు" అని గర్జించిన భగత్‌సింగ్ వారసుడు.



మన దేశానికి సౌభ్రాతృత్వం అంతరాత్మ. దీన్ని నాశనం చేయటానికి ఉద్దేశించినదే పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ). దీనికి వ్యతిరేకంగా ఉమర్ పోరాడాడు. దీనిని వ్యతిరేకించేవారికి, సమర్థించేవారికి మధ్య జరిగిన పోరాటం హింసాత్మక రూపం దాల్చింది. ఈ పోరాటంలో ఎక్కువగా ప్రాణాలు కోల్పోయింది ముస్లింలే! ఈ హింసాత్మక ఘర్షణలను ప్రేరేపించే విధంగా ప్రసంగాలు చేసిన పాలక పార్టీ సభ్యులు స్వేచ్ఛగానే తిరుగుతున్నారు. రాజకీయాలు చేస్తున్నారు. కానీ ఉమర్‌ను మాత్రం ఉగ్రవాద నిరోధక చట్టం (యూఏపీఏ) కింద ప్రభుత్వం అరెస్ట్ చేసింది. కింది కోర్టులన్నీ ఉమర్‌కు బెయిల్ ఇవ్వటానికి నిరాకరించాయి. సుప్రీంకోర్టులో బెయిల్ పిటిషన్ పెండింగ్‌లో ఉంది. ఆరోపణలపై విచారణ చేయకుండా, నిర్ధారణ చేయకుండా, ఒక వ్యక్తిని ఐదేళ్లు జైలులో ఉంచటం చట్టవిరుద్ధమని సహజన్యాయ సూత్రాలు చెబుతున్నాయి. కానీ ఉమర్‌కు తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకొనే అవకాశమే లేకపోతోంది. "ఇరవై నిమిషాలు సమయం ఇవ్వమనండి. ఉమర్ ఏ అపరాధమూ చేయలేదని నిరూపిస్తా" అంటాడు ఆయన తరపు న్యాయవాది. కానీ ఆ ఇరవై నిమిషాల సమయం సుప్రీంకోర్టుకు లభించటం లేదు. చచ్చిన చేపలే ప్రవాహానికి కొట్టుకుపోతాయి. బతికిన చేపే ప్రవాహానికి ఎదురీదుతుంది. ఒడ్డుకు చేరుతుంది. నా దృష్టిలో ఉమర్ ప్రస్తుతం ప్రవాహానికి ఎదురీదుతున్న చేప. ఎప్పటికైనా తప్పకుండా విజయం సాధిస్తాడు.

■ ప్రకాశ్ రాజ్
సినీనటుడు, సామాజిక ఉద్యమకారుడు

శాంతిచర్చల వెనుక వ్యూహం!

మావోయిస్టుల శాంతి చర్చల ప్రతిపాదన కొత్తది కాదు. పరిస్థితులు దెబ్బతిన్న ప్రతీసారి, వారు చర్చల జపంతో ముందుకు వస్తారు. మావోయిస్టులు ఈ ప్రతిపాదనను కేవలం వ్యూహాత్మకంగా ఉపయోగిస్తున్నారు. గత అనుభవాల దృష్ట్యా పరిశీలిస్తే, ప్రభుత్వాలు జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

ఇటీవలి కాలంలో వరుస ఎన్‌కౌంటర్లలో అనేకమంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోవడం, వారి కంచుకోటలు బీటలు వారడం జరుగుతోంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా నాయకత్వంలో నక్సలిజాన్ని అణచివేసేందుకు తీవ్రమైన చర్యలు చేపడుతున్న నేపథ్యంలో, మావోయిస్టులు ఈ ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. ఇది నిజమైన శాంతి కాంక్ష కంటే, విధిలేని పరిస్థితుల్లో వెసులుబాటు కోసం చేయాల్సి వచ్చిన వ్యూహాత్మక చర్య.

2004లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర రెడ్డి ఉన్న సమయంలో, నక్సలైట్లతో శాంతి చర్చలు జరిగాయి. ఆ సమయంలో వారు హింసను తగ్గిస్తామని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించి, చర్చలకు అవకాశం కల్పించింది. కానీ, ఒకవైపు ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూనే, మరోవైపు మావోయిస్టులు భారీగా రిక్రూట్‌మెంట్ చేపట్టారు. ఆయుధాల సరఫరా పెంచుకున్నారు, నిధులు సమీకరించుకున్నారు. చర్చలు విఫలమైన తర్వాత, వారు మరింత బలంగా హింసాత్మక కార్యకలాపాలకు పాల్పడ్డారు. వైఎస్ఆర్ హయాంలో జరిగినట్లుగానే, ఇప్పుడు కూడా రిక్రూట్‌మెంట్, ఆయుధాల సేకరణ, నిధుల సమీకరణ వంటి కార్యకలాపాలకు పాల్పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వారి ప్రతిపాదన మేరకు నక్సల్ ఏరివేత కార్యక్రమాన్ని పూర్తిగా నిలిపివేయడం ప్రభుత్వాలకు దీర్ఘ కాలంలో నష్టం కలిగించవచ్చు.

అందువల్ల చర్చలు జరిగినా, మరోపక్క మావోయిస్టుల కార్యకలాపాలపై గట్టి నిఘా ఉంచాలి. గతంలో మాదిరిగా వారికి వ్యూహాత్మక వెసులుబాటు దొరకకుండా చూడాలి. నక్సల్ ఏరివేత కార్యక్రమాన్ని ఆపకుండా చర్యలు, చర్చలూ కొనసాగించాలి.

– శ్రీనివాస్ గౌడ్ ముద్దం
సామాజిక విశ్లేషకులు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

దొంగే... దొంగ దొంగ అన్నట్లు...!

నోటికొచ్చినట్టు అబద్ధాలాడటం జగన్ ముఠాకు వెన్నతో పెట్టిన విద్య. రాష్ట్ర ప్రజలు నిజాలు గ్రహించి అబద్ధపు రాజును మూలన కూర్చోబెట్టినా ఆయనలో, ఆయన ముఠాలో మార్పేమీ కనబడటం లేదు. అబద్ధాలు చెప్పి ప్రజలను రెచ్చగొట్టి మరోసారి రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తున్నారు. నిత్యం రోత రాతలు రాస్తూ కూటమి ప్రభుత్వంపై జగన్ రోత పత్రిక విషం కక్కుతున్నది. టీటీడీ పవిత్రతను తాము కాపాడినట్లు, కూటమి ప్రభుత్వం టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నట్లు జగన్ ముఠా ఆరోపణలు చేస్తోంది.

గడచిన మూడు నెలల్లో గోశాలలో వంద గోవులు మృత్యువాత పడ్డాయని, దీనిపై విచారణ జరపాలని, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అసత్య ఆరోపణలు చేశారు. తమ పాలనలో దాతల సహకారంతో 500 గోవులను గోశాలకు తీసుకొచ్చి, వాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని తెలిపారు. వాటికి ఆహారం సరిగ్గా లేక గోవులతో పాటు, లేగ దూడలు మృతి చెందాయని ఆరోపిస్తున్నారు. టీటీడీ గోశాలలో గోవులు మరణించినట్లు జగన్ పత్రికలో తప్పుడు రాతలు రాయిస్తూ ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. అనారోగ్యం, వయోభారం వంటి కారణాలతో ఒకటి, రెండు గోవులు చనిపోతే దానిని రాజకీయ ప్రచారానికి వాడుకోవడం వారి రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనం. ఎక్కడో చనిపోయిన గోవుల ఫొటోలను టీటీడీ గోశాలకు చెందినవిగా చిత్రీకరించి ప్రజల కళ్ళకు గంతలు కట్టాలని చూస్తున్నారు. ఇదే కరుణాకర్‌రెడ్డి, ఒకప్పుడు అదో నల్లరాయి దాని మీదకు చెప్పు విసిరితే ఏమవుతుందంటూ వెంకటేశ్వరస్వామిని దూషించారు. ఇప్పుడదే పెద్ద మనిషి టీటీడీపై సవతి తల్లి ప్రేమ ఒలకబోస్తున్నారు.

గోశాలపై టీటీడీ ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు గోవుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను క్రమం తప్పకుండా సమీక్షిస్తోంది. 260 మందికి పైగా ఉద్యోగులు నిత్యం గోవుల సంరక్షణను చూసుకుంటున్నారు. అయినా టీటీడీ గోసంరక్షణను పట్టించుకోవడం లేదని వైసీపీ నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. 2,668 గోవులకు జియో ట్యాగ్ చేసి, ప్రతిరోజూ పర్యవేక్షిస్తుంటే, ఆ ట్యాగ్ తీసేశారంటూ విష ప్రచారం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంతో పోల్చుకుంటే ఇప్పుడు గోశాలలో టీటీడీ అధికారులు అధునాతన సదుపాయాలు ఏర్పాటు చేశారు. గోశాలను ప్రతిరోజూ శుభ్రపరచి, బ్లీచింగ్ చేస్తున్నారు. గోశాలను సందర్శించిన భక్తులు కూడా పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కానీ గోశాలలో పరిశుభ్రత లేదని, జనన, మరణాల రిజిస్టరులో నమోదు చేయడం లేదని టీటీడీపై వైసీపీ నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు.

మార్చి, 2021 నుంచి మార్చి, 2024 వరకు గోశాలలో అనేక అక్రమాలు జరిగాయి. నాటి పాలకులు చనిపోయిన గోవుల లెక్కలు దాచారు. వాటికి అపరిశుభ్రమైన ఆహారం అందించారు. గడువు తీరిన, లేబుల్ లేని, క్వాలిటీ చెక్ చేయని మందులను ఆవులకు ఇచ్చారు. చనిపోయిన గోవులను సంఖ్యను లెక్కల్లో చూపలేదు. అధికారుల నిర్లక్ష్యం వల్ల రెండుసార్లు గోశాలలో అగ్ని ప్రమాదం జరిగింది. అయితే ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు 43, పోయిన ఏడాది 179 గోవులు చనిపోయాయని కరుణాకర్ రెడ్డి చేసిన ఆరోపణలు ఆయన పాలకమండలి అధ్యక్షులుగా ఉన్న సమయంలో జరిగినవే. అంతేకాక అప్పట్లో దళారులను ఆశ్రయించి గదులు, దర్శన టికెట్లను భక్తులు ఆన్‌లైన్‌లో పొందేవారు. ఒక బ్రోకర్ 50సార్లు సేవ టికెట్లు పొంది, ఇతరులకు విక్రయించారు. తిరుపతి కొండపై అన్యమత ప్రచారాన్ని ప్రోత్సహించిందీ, ఏడు కొండలను ఐదు కొండలుగా చిత్రించిందీ నాస్తికుడయిన కరుణాకర్ రెడ్డే.

గత అయిదేళ్లు జగన్ పాలనలో తిరుమల, తిరుపతిలో జరిగిన ఘోరాతి ఘోరాలు, పాపాలు హిందూ సమాజాన్ని కలవరపెట్టాయి. అంతేకాక అంతర్వేది రథం దగ్ధమైన ఘటన నుంచి, రామతీర్థంలో రాముడి విగ్రహం తల తీసేసిన ఘటన వరకూ వారు పాల్పడిన పాపాలకు ఏం సమాధానం చెబుతారు? నేడు 'దొంగే... దొంగా, దొంగా' అని అరిచినట్లుగా ఉంది నేడు జగన్ ముఠా వ్యవహారం. ఓ పక్క తిరుపతి పవిత్రతను కాపాడే ప్రయత్నాలు జరుగుతుంటే తట్టుకోలేక ప్రజల దృష్టిని మరల్చేందుకు గోశాలలో గోవుల చనిపోయాయంటూ వారు దుష్ప్రచారం చేస్తున్నారు.

> జగన్ పార్టీ ప్రబుద్ధులు టీటీడీలో చేయని అక్రమాలు లేవు. గడచిన అయిదేళ్లలో స్వామివారి లడ్డూ ధరల నుంచి కొండ మీది గదుల అద్దె వరకు అన్నింటినీ విపరీతంగా పెంచి సామాన్య భక్తులను నిలువుదోపిడీ చేశారు. వైసీపీని ప్రజలు తరిమినా, పశ్చాత్తాపం లేకుండా కూటమి ప్రభుత్వాన్ని అబద్ధాలతో ఆ పార్టీ ఆడిపోసుకుంటున్నది.



జగన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి, ధర్మారెడ్డిల ఏలుబడిలో తిరుమల పుణ్యక్షేత్ర పవిత్రత మంటగలిసింది. జగన్ హయాంలో స్వామివారి ప్రసాదాలు, లడ్డూ, అన్న ప్రసాదాల్లో నాణ్యతపై 2023 జూన్, జూలై నెలల్లో కేంద్ర హోంశాఖ నిపుణుల బృందం తిరుమలలో అధ్యయనం చేసి ఓ నివేదికను రూపొందించింది. వెంగమాంబ అన్నదాన సత్రంలో వడ్డిస్తున్న ఆహారంలో శుచి, శుభ్రత, నాణ్యత లేవని, నిబంధనలను గాలికొదిలేస్తున్నారని నిపుణుల బృందం గుర్తించింది. ఆహార పదార్థాల నాణ్యతను నిర్ధారించాల్సిన ల్యాబ్‌లో పరీక్షా పరికరాలే లేవని ఆ బృందం తేల్చింది. తాము చేసిన పాపాలను కప్పిపుచ్చుకునేందుకు జగన్ ముఠా అబద్ధాలు చెబుతున్నది. అనవసరమైన పనులతో కమీషన్ల కోసం శ్రీనివాసుడి సొమ్ములు దోచిపెట్టడం వరకు కొండ మీద వారు చేసిన అక్రమాలకు అంతేలేదు. అవన్నీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పరిశీలనలో బట్టబయలయ్యాయి. జగన్ ఏలుబడి చివరిలో టీటీడీ నిధులతో కమీషన్ల కోసం రూ.1400 కోట్ల విలువైన పనులకు తిరుమలలో టెండర్లు పిలిచారు.

కోనేటిరాయడి దివ్యధామాన్ని పక్కా వ్యాపార కేంద్రంగా, స్వార్థ రాజకీయాలకు కూడలిగా మార్చింది జగన్‌రెడ్డి కాదా? స్వలాభం కోసం అయిదేళ్లు ఆంధ్రప్రదేశ్‌ను ఛిద్రం చేయడమేగాక, టీటీడీ ప్రతిష్ఠను మంటకలిపింది వారు కాదా? వ్యాపార, ఆర్థిక, రాజకీయ అవసరాలకు తిరుమలను వాడుకున్న వైసీపీవారు క్షమార్హం కాని ఘోరాపరాధాలకు పాల్పడింది వాస్తవం కాదా? శ్రీనివాసుడి పట్ల తరగని భక్తిప్రపత్తులతో ఆబాలగోపాలం సమర్పించిన కానుకల సొమ్మును జగన్‌రెడ్డి తన వందిమాగధుల కోసం విచ్చలవిడిగా ఖర్చుపెట్టింది నిజం కాదా?

అబద్ధాల మెట్లపై నుంచి అధికార పీఠానికి ఎగబాకిన భ్రష్ట చరిత్ర జగన్‌రెడ్డిది. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి పింక్ డైమండ్‌ను మాయం చేశారని, వకుళమాత పోటులో తవ్వకాలు జరిపి నగలను కొట్టేశారని, 2019 ఎన్నికలకు ముందు కూడా జగన్ ముఠా విస్తృతంగా దుష్ప్రచారం చేసి రాజకీయ లబ్ధి పొందింది. పదవుల్లోకి వచ్చాక తిరుమల పవిత్రధామాన్ని కాసులవేటకు వేదికగా మార్చుకున్నది. మందీ మార్బలాన్ని వెంటేసుకుని ఎప్పుడంటే అప్పుడు దర్శనానికి వెళ్తూ సామాన్య భక్తులకు నరకం చూపించారు వైసీపీ నేతలు. 'గోవిందా గోవిందా' అంటూ భక్తకోటి శరణు ఘోషతో మార్మోగాల్సిన పుణ్యక్షేత్రంలో నిత్యం రాజకీయ విమర్శలకు దిగారు. టీటీడీ పాలకమండలిలో నేరచరితులకు పెద్దపీట వేసి శ్రీవారి భక్తుల మనోభావాలను గాయపరచారు. టీటీడీలో జగన్ పార్టీ ప్రబుద్ధులు చేయని అక్రమాలు లేవు. గడచిన అయిదేళ్లలో స్వామివారి లడ్డూ ధరల నుంచి కొండ మీది గదుల అద్దె వరకు అన్నింటినీ విపరీతంగా పెంచి సామాన్య భక్తులను నిలువుదోపిడీ చేశారు. జగన్ జమానాలో ఊరూరికీ పాకిన గంజాయి మహమ్మారి ఆఖరికి తిరుమలకూ చేరింది. ఈ విధంగా శ్రీనివాసుడి సన్నిధిలో పాపిష్టి పనులకు తెగబడిన జగన్‌రెడ్డి గ్యాంగ్ తామేదో పవిత్రులమయినట్లు జగన్నాటకాలు ఆడుతున్నది.

జగన్ ఏలుబడిలో అపవిత్రమైన తిరుమలకు మళ్ళీ పూర్వ వైభవం కల్పించేలా టీటీడీని సంపూర్ణంగా సంస్కరించేందుకు చంద్రబాబు నాయుడి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. వైసీపీని ప్రజలు తన్ని తరిమినా, పశ్చాత్తాపం లేకుండా కూటమి ప్రభుత్వాన్ని అబద్ధాలతో ఆ పార్టీ ఆడిపోసుకుంటున్నది.

• నన్నూరి నర్సిరెడ్డి
టీటీడీ ట్రస్ట్ బోర్డు సభ్యులు



నేటి చాటువులు

అగ్ని సాక్షి గాను అవినీతి భూతమ్ము
న్యాయమూర్తి యింట నాట్యమాడి
దగ్ధమైన నోట్ల దరిచేరి నవ్వేను
ఢిల్లి కోర్టు గుండె జల్లుమనగ

ఉద్యమాల జాడ ఉస్మానియయెదపై
కఠినమైన ఆంక్ష కాలుదువ్వి
చెరిపివేసె నకట నిరసించు హక్కును
పోరుబాట గుండె భోరుమనియె

చిన్నగ ధనలక్ష్మి శిఖరమ్ము నెక్కించి
లోయలోకి నెట్టి వేయునపుడె
పీకమీద కత్తి 'బెట్టింగు యాప'న్న
అదును చూసి జనుల హత్యజేయు

'హెచ్చిసీయు' లోన పచ్చని అడవమ్మ
భూమి లెన్నొ లెస్స బుక్క నెంచి
చిదిమి వేయ జూసె జీవన శ్వాసను
నెమలి పిట్ట కూడ కుమిలి యేడ్చె

ద్రోహచింతనతొ మతోన్మాద తంత్రమ్ము,
వక్రశాసనమ్ము వక్ఫు బిల్లు
మందిబలము చూసి మనువాద కత్తితో
సంవిధాన స్ఫూర్తి చంపివేసె

రైలు, బస్సు, ఆటొ, రాస్తాలో నిరతమ్ము
కామసర్పవితతి కాటు వేయ
అత్యాచార ఘటన అసలు జరుగనట్టి
స్థలములేనె లేదు ధరణి లోన

దగ్ధమయ్యె ప్రబల దండకారణ్యము
రాజ్యహింస అగ్ని రగిలి రగిలి
హత్య కాండ చూసి అమిత సంతోషము
మరణములు గుణించి మంత్రి మురిసె

– సంఘమిత్ర

● పురస్కారం



కందుకూరి జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం తెలుగు నాటక రంగ దినోత్సవం ఘనంగా జరిగింది. నాటక రంగంలో ప్రతిభ కనబరిచిన ఎన్టీఆర్ జిల్లాకు చెందినవారిలో అగురు త్రినాథ్, బొర్రా నరేన్, హెచ్‌వీఆర్ఎస్ ప్రసాద్, శ్యామనపూడి వెంకటేశ్వరరావు, వీర్ల వరప్రసాదరావు (పై ఫొటోల్లో కుడి నుంచి ఎడమకు) కందుకూరి విశిష్ట సేవా పురస్కారాలను అందుకున్నారు. - విజయవాడ కల్చరల్



వినగడపలో రాలిన మామిడిని ఏరుతున్న కూలీలు



ఈదురు గాలులకు రెడ్డిగూడెంలో చీలిపోయిన మామిడి చెట్టు

● అమ్మకాలు జరగలేదు.. కొన్నదెవరో తెలియదు.. డబ్బు మాత్రం వచ్చింది..!

జీనీయస్‌

డ్వాక్వా పేరుతో వావ్ జీనీ యాప్ ద్వారా వస్తువుల విక్రయాలు

అసలు ఆ వస్తువులు డ్వాక్వా సంఘాలవే కాదు

వస్తువులను అమ్మలేదు.. వాటిని ఎవరు కొన్నారో కూడా తెలియదు.. కానీ ఆ వస్తువులు అమ్మారని కార్పొరేషన్ యూసీడీ విభాగంలో పనిచేసే టౌన్‌లెవల్ ఫెడరేషన్ (టీఎల్ఎఫ్) బ్యాంకు ఖాతాలో పెద్ద మొత్తంలో డబ్బు జమైంది. ఇప్పుడు ఈ డబ్బు వ్యవహారం కార్పొరేషన్‌లో చర్చనీయాంశంగా మారింది. టీఎల్ఎఫ్ ఖాతాలో పడిన ఈ డబ్బును తమకు బదలాయించాలని యూసీడీ విభాగం అధికారులు ఒత్తిడి తెస్తుండటం, అలా చేస్తే తాము జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని టీఎల్ఎఫ్ సభ్యులు చెబుతుండటం గందరగోళానికి దారితీసింది. ఈ వ్యవహారం మెప్మా ఎండీకి ఫిర్యాదు చేసే వరకు వెళ్లడంతో డ్వాక్వా సంఘాల పేరుతో ఆ వస్తువుల అమ్మకాల వెనుక పెద్ద కథే నడిచిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

- ప్రభుత్వ మెప్పు, రికార్డుల కోసం బయటి వస్తువుల అమ్మకాలు
- ముంబయి నుంచి ఓ టీఎల్ఎఫ్ ఖాతాలో భారీగా నగదు జమ
- వేరే ఖాతాలకు బదలాయించాలని యూసీడీ అధికారుల ఆదేశం
- జీఎస్టీ భారం పడుతుందని డ్రా చేయని టీఎల్ఎఫ్
- మెప్మా ఎండీని కలిసి ఫిర్యాదు.. కార్పొరేషన్‌లో చర్చ



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఇటీవల మెప్మా ఆధ్వర్యంలో 'వావ్ జీనీ' యాప్‌ను తీసుకొచ్చారు. దీనిద్వారా రాష్ట్రవ్యాప్తంగా భారీగా విక్రయాలు జరిపి ఒకేరోజు గిన్నిస్‌బుక్ రికార్డు సాధించాలని ఆ సంస్థ ఉన్నతాధికారులు ప్లాన్ వేశారు. ప్రభుత్వం దగ్గర మెప్పు పొందే క్రమంలో వీరు కొన్ని పొరపాట్లు చేశారు. పట్టణ ప్రాంతాల్లో పొదుపు సంఘాలు (డ్వాక్వా గ్రూపులు) తయారుచేసిన ఉత్పత్తుల కంటే కూడా బయట నుంచి ఎక్కువగా కొనుగోలు చేసిన వాటిని ఈ యాప్ ద్వారా విక్రయించారన్న ఆరోపణలు ఉన్నాయి. లెదర్ బ్యాగులు, కర్చీఫ్‌లు, రాగి ప్లేట్ల వంటి వాటిని నగరంలోని డ్వాక్వా సంఘాల పేరుతో విక్రయించారు. వాస్తవానికి వీటిని డ్వాక్వా సంఘాలు తయారు చేయలేదని సమాచారం. ఈ సంఘాలే ఉత్పత్తి చేసినట్టుగా బయట నుంచి వీటిని కొని, 'వావ్ జీనీ' యాప్ ద్వారా విక్రయించినట్టు ఆరోపణలు వస్తున్నాయి.

డబ్బు బదలాయింపులో వివాదం

ముంబయి కంపెనీ నుంచి టీఎల్ఎఫ్ బ్యాంకు ఖాతాలో పడిన డబ్బును కార్పొరేషన్‌లోని యూసీడీ విభాగం అధికారులు.. ఆర్టీజీఎస్ ద్వారా వేర్వేరు ఖాతాలకు బదలాయించాలని ఆదేశించారు. ఆ డబ్బుకు అదనంగా 18 శాతం జీఎస్టీ కలిపి చెల్లించాల్సిందిగా యూసీడీ విభాగం అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో సొంత డబ్బు జీఎస్టీ కట్టాల్సి ఉండటంతో కంగారుపడిన టీఎల్ఎఫ్ సభ్యులు యూసీడీని మరోమారు సంప్రదించారు. దీంతో అధికారులు.. జీఎస్టీ 18 శాతం మినహాయించుకుని చెల్లించాలని ఆదేశించారు. యూసీడీ విభాగం నుంచి రెండుసార్లు వేర్వేరుగా ఆదేశాలు రావడంతో అనుమానం వచ్చిన టీఎల్ఎఫ్ సభ్యులు ఆడిటర్‌ను సంప్రదించారు. ఆ లావాదేవీలకు కచ్చితంగా కొటేషన్స్ ఇన్వాయిస్ బిల్స్‌ను ఆడిటింగ్ సమయంలో మిగతా 6లో..

తమకు తెలియదంటున్న టీఎల్ఎఫ్‌లు

డ్వాక్వా సంఘాలన్నింటిపై పర్యవేక్షణకు పట్టణ స్థాయి సమాఖ్య (టౌన్ లెవల్ ఫెడరేషన్ - టీఎల్ఎఫ్)లు ఉంటాయి. నగరంలో మొత్తం ఆరు టీఎల్ఎఫ్‌లు ఉన్నాయి. వీటిలో ఉజ్వల టీఎల్ఎఫ్‌కు చెందిన బ్యాంకు ఖాతాలో రెండు విడతలుగా రూ.18,90,476 డబ్బు ముంబయి నుంచి జమ అయ్యింది. మార్చి 1న రూ.1,33,381, మార్చి 14న రూ.17,57,095 జమ అయ్యాయి. అయితే, అసలు ఆ వస్తువులను యాప్ ద్వారా విక్రయించినట్టుగా తమకు తెలియదని టీఎల్ఎఫ్ సభ్యులు చెబుతున్నారు.

నేలరాలిన ఆశలు

ఈదురుగాలులు, గాలివాన సృష్టిస్తున్న బీభత్సం మామిడి రైతులపై పెను ప్రభావాన్ని చూపిస్తోంది. ఈనెలలో 15 రోజుల్లో సంభవించిన ఈదురుగాలులకు మామిడి కాయలు రాలిపోయి తోటలు బోసిపోతున్నాయి.

ఈదురు గాలులకు మామిడి రైతులు కుదేలు



గణపవరంలో రోడ్డు పక్కన సంచులతో మామిడి కాయలు

చెట్ల నుంచి రాలిపోతున్న కాయలు

- కొనేవారు లేక కాయల్ని పారబోస్తున్న రైతులు
- ఈనెలలో ఇప్పటికి నాలుగుసార్లు బీభత్సం
- తిరువూరు, మైలవరంలో భారీగా నష్టం

తిరువూరు/విస్సన్నపేట/గంపలగూడెం/మైలవరం రూరల్/రెడ్డిగూడెం/జి.కొండూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఈదురు గాలులు మామిడి రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. ఈనెలలో 15 రోజుల వ్యవధిలో నాలుగు సార్లు ఈదురు గాలులు సృష్టించిన బీభత్సంతో 80 శాతానికి పైగా మామిడి కాయలు నేలరాలాయి. పగలు భారీ ఎండ, సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి గాలులు వీస్తుండటంతో రైతులకు కంటి మీద కునుకు ఉండట్లేదు. ఇప్పటికే మూడుసార్లు వీచిన గాలులకు 60 శాతం మామిడి కాయలు నేల రాలిపోయాయి. మంగళవారం అర్ధరాత్రి మారోసారి గాలులు బీభత్సం సృష్టించడంతో మరో 20 శాతం కాయలు నేలరాలాయి. కోతలు కోసినట్టుగా తోటలు ఖాళీగా మారిపోయాయి.

తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో..

తిరువూరు నియోజకవర్గంలోని విస్సన్నపేట, తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు, మైలవరం నియోజకవర్గంలోని రెడ్డిగూడెం, జి.కొండూరు, మైలవరం, విజయవాడ రూరల్ మండలంలో మామిడి తోటల్లో ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. ఈ ప్రాంతాల్లో వరి తర్వాత రైతులు రెండో ప్రధాన పంటగా మామిడిని సాగు చేస్తారు. వరుసగా మూడేళ్ల నుంచి నష్టాలు చవిచూస్తున్న రైతుల్ని ఈ ఈదురు గాలులు కోలుకోలేని దెబ్బతీశాయి. పంట చేతికొచ్చే మిగతా 6లో..



వరి, మొక్కజొన్నకు నష్టం

గాలివానతో కల్లాల్లో తడిచిపోయిన పంట

- రోడ్ల పక్కన ఆరబెట్టుకున్న పంట కూడా నాశనం
- జగ్గయ్యపేట, వత్సవాయి రైతుల ఆవేదన

6లో

హ్యాపీనెస్ట్!

ఎన్నాళ్లకెన్నాళ్లకు.. లబ్ధిదారుల హ్యాపీనెస్ట్ కలలు తీరబోతున్నాయ్. రాజధాని అమరావతిలో జీ ప్లస్ 18 టవర్స్ నిర్మాణ పనులకు కాంట్రాక్టు సంస్థ సిద్ధమైంది. బుధవారం నేలపాడులో నిర్మాణ ప్రాంతానికి ఎన్‌సీసీ లిమిటెడ్ భారీ ఎత్తున యంత్ర సామగ్రిని దించింది. భారీ క్రేన్లు, భారీ ఎర్త్‌హోల్ డ్రిల్లింగ్ మెషీన్లు, పైల్ మెషీన్లు వంటివాటిని తెప్పించింది. వారం రోజుల్లో పనులకు శ్రీకారం చుట్టడానికి ఏర్పాట్లు చేసింది.

వారంలో హ్యాపీనెస్ట్ జీ ప్లస్ 18 టవర్స్ నిర్మాణ పనులకు శ్రీకారం

- సైట్ ఏరియాలో భారీ యంత్రాలను దించిన కాంట్రాక్టు సంస్థ
- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పనులు
- రెరాను ఆశ్రయించిన బాధితులు
- ఇన్నాళ్లకు నెరవేరుతున్న కల



సైట్ ఏరియాలో భారీ యంత్రాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాజధాని అమరావతిలో సొంతింటి కోసం దరఖాస్తు చేసుకున్న 1200 మంది లబ్ధిదారుల కల ఇన్నాళ్లకు నెరవేరబోతుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో హ్యాపీనెస్ట్ ప్రాజెక్టుకు మంగళం పాడటంతో లబ్ధిదారులు రెరాను ఆశ్రయించిన సంగతి తెలిసిందే. గత ఐదేళ్లు లబ్ధిదారులు ఎన్నో ఇబ్బందులు చవి చూశారు. ఇక ఆశలు వదులుకోవటమే అనుకున్న తరుణంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో హ్యాపీనెస్ట్ బాధితుల మోమున సంతోషం వెల్లివిరిసింది. పనులు ఎప్పుడు మొదలవుతాయా అని గత తొమ్మిది నెలలుగా ఎదురుచూస్తున్నారు.

సీఆర్‌డీఏ సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టు

హ్యాపీనెస్ట్ అనేది సీఆర్‌డీఏ సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టు. సీఆర్‌డీఏ చేపడుతున్న మొట్ట మొదటి భారీ హౌసింగ్ టౌన్‌షిప్ ఇది. నేలపాడులో మొత్తం 12 టవర్లను హ్యాపీనెస్ట్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించనున్నారు. ఒక్కో టవర్ జీ ప్లస్ 18 విధానంలో నిర్మాణం చేపడతారు. వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లు పనులు చేపట్టని పాపానికి అంచనా వ్యయం దాదాపుగా రూ.200 కోట్లు పెరిగింది. రూ.818 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలవగా.. ఎన్‌సీసీ, ఎల్‌అండ్‌టీలు ఈ ప్రాజెక్టు కోసం పోటీలు పడ్డాయి. ఎల్‌అండ్‌టీ సంస్థ కంటే ఎన్‌సీసీ సంస్థ 4.68 శాతం ఎక్సెస్ రేటుతో రూ.856.31 కోట్లకు కోట్ చేసి ఎల్-1గా నిలిచి హ్యాపీనెస్ట్ కాంట్రాక్టును దక్కించుకుంది. కేవలం జీ ప్లస్ 18 టవర్ల నిర్మాణమే కాకుండా అత్యద్భుతమైన ఆర్కిటెక్చర్ డిజైన్లతో వీటిని నిర్మించాల్సి ఉంటుంది. షేర్ వాల్ టెక్నాలజీలో నిర్మించాల్సి ఉంటుంది. అల్యూమినియం ఫ్రేమ్ వర్క్, పోడియం, ఆర్కిటెక్చరల్ ఫినిషింగ్, ఇంటర్నల్ అండ్ ఎక్స్‌టర్నల్ ఎలక్ట్రికల్, ప్లంబింగ్, శానిటరీ ఎక్విప్‌మెంట్, ఫైర్ ఫైటింగ్, లిఫ్ట్, డీజీ సెట్స్, సెక్యూరిటీ సిస్టమ్స్, ఎక్స్‌టర్నల్ డెవలప్‌మెంట్, ల్యాండ్ స్కేప్ వంటివి చేపట్టాల్సి ఉంది. మూడేళ్లలో ఈ పనులు పూర్తి చేయాల్సి ఉంది. అత్యాధునిక వసతులతో ట్రిబుల్, డబుల్ బెడ్ రూమ్‌లతో ఉంటాయి. ఇందులో రెస్టారెంట్స్, ఫంక్షన్ హాల్స్, టెన్నిస్ కోర్టులు, స్విమ్మింగ్ పూల్స్, జిమ్స్, బిలియర్డ్స్ కోర్టులు, స్పా, బ్యూటీపార్లర్ వంటి వసతులు ఉంటాయి.

అరాచకవాది

వన్‌టౌన్‌లో పెరిగిపోతున్న న్యాయవాది అరాచకాలు

- సన్నిహితురాలితో కలిసి ఆమె భర్త హత్య
- చివరికి ఆమెతోనే గొడవ.. కారుతో ఢీ
- ఫీజు కోసం కక్షిదారులను బంధించి దాడి
- తోటి న్యాయవాదిపైనా బెదిరింపు ధోరణి
- పంజా సెంటర్, వించిపేటలో రౌడీయిజం
- అన్వర్‌పై రౌడీషీట్ తెరిచిన పోలీసులు



అన్వర్ షేక్

అతనో న్యాయవాది. కానీ, అతను ఏం కోరుకుంటే అది దక్కి తీరాలి. అనుకున్నది జరిగి తీరాలి. లేకపోతే అరాచకశక్తిగా మారిపోతాడు. తనను కాదనుకున్న వారు తిరిగి కాళ్లు పట్టుకునేలా చేయడానికి కారుతో ఢీ కొట్టడానికైనా వెనుకాడడు. అవసరమైతే న్యాయస్థానాల ప్రాంగణంలోనే బెదిరిస్తాడు. మాట వినకపోతే బంధించి దాడి చేస్తాడు. అతడే వన్‌టౌన్‌కు చెందిన అన్వర్ షేక్. పేరుకు తగ్గట్టుగానే పంజా సెంటర్, వించిపేటను 'షేక్' చేస్తున్న ఇతని పేరును పోలీసులు రౌడీషీట్ జాబితాలో చేర్చారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వన్‌టౌన్‌లోని మహంతిపురానికి చెందిన అస్లాం, కుమ్మరిపాలెం సెంటర్‌కు చెందిన అన్వర్ స్నేహితులు. అస్లాం రెండో భార్య నసీమాను అన్వర్ ట్రాప్ చేశాడు. ఇద్దరూ కలిసి అస్లాంపై దాడి చేసి, ఊపిరాడకుండా చేసి చంపేశారు. గుండెపోటుగా చిత్రీకరించారు. అస్లాంది హత్య అని అతడి కుటుంబ సభ్యులు, స్థానికులు పోరాడినా.. నాడు వైసీపీ నేతల అండదండలు, మంత్రిగా ఉన్న ఓ నాయకుడి సహకారంతో పోలీసులు కేసును పట్టించుకోలేదు. తర్వాత అన్వర్‌ను నసీమా దూరం పెట్టడంతో అస్లాం హత్యకు సంబంధించిన కుట్రను తెలియజేసే సెల్ఫీ వీడియో విడుదల చేశాడు. ఈ వీడియో పోలీసుల చేతుల్లో పడటంతో అన్వర్, నసీమాను అరెస్టు చేశారు. వాస్తవానికి ఈ కేసులో నసీమాను ఇరికించడానికి అన్వర్ ఈ వీడియో విడుదల చేశాడు. ఇక్కడ అతి తెలివి ఉపయోగించడంతో అన్వర్ దొరికిపోయాడు. జైలు నుంచి బయటకు వచ్చాక అన్వర్ కొత్త అవతారమెత్తాడు. నల్లకోటు ధరించి న్యాయవాదిగా మారాడు. ప్రముఖ న్యాయవాదిలా మిగతా 6లో..



చంద్రబాబు స్ఫూర్తితో పాడిరైతులకు సేవ

- కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు
- కామధేనులో ఘనంగా శ్రీసీతారామలక్ష్మణ సమేత దాసాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం
- పర్యవేక్షించిన చిన జీయర్‌స్వామి

6లో

కోగంటి బాబు, పొనకల్ల నవ్యశ్రీ, నర్రా వాసు 6లో

ముగ్గురు ఏఎంసీ చైర్మన్ల నియామకం

- కంచికచర్లకు బాబు, మైలవరానికి నవ్యశ్రీ, గొల్లపూడికి నర్రా వాసు

అమరావతిపై అనుమానాలొద్దు

- కొందరు లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారు
- ఇచ్చిన మాట ప్రకారం మూడేళ్లలో పూర్తి
- మీడియాతో మంత్రి నారాయణ

6లో



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

'పనిచేసే చోట లైంగిక వేధింపులా' పుస్తకావిష్కరణ

బెంజిసర్కిల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టు న్యాయవాది దార్ల అనుపమ రచించిన 'పనిచేసే చోట లైంగిక వేధింపులా' పుస్తకాన్ని బుధవారం రాజభవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పుస్తకాన్ని ప్రతిఒక్క మహిళ చదవాల్సిన ఆవశ్యత ఉందన్నారు. రచయిత అనుపమ మాట్లాడుతూ, పనిచేసే చోట మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులపై స్పష్టమైన నిర్దిష్ట సమాచారంతో ప్రతి మహిళను ఆలోచింపచేసే విధంగా ఈ పుస్తకం ఉంటుందన్నారు. మహిళా కార్మికుల హక్కులు, చట్టాలను ఈ పుస్తకంలో వివరించినట్టు పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా మార్పు ట్రస్ట్ డైరెక్టర్ రావూరి సూయాజ్, సైకాలజిస్ట్ డి.కల్యాణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డిపాజిట్‌దారుల వివరాలు తీసుకుంటున్న బ్యాంక్ సిబ్బంది

దుర్గా కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో డిపాజిట్ల చెల్లింపునకు చర్యలు

వన్‌టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్ ఆర్‌ఆర్ అప్పారావువీధిలో ఉన్న దుర్గా కో-ఆపరేటివ్ అర్బన్‌బ్యాంక్‌లో డిపాజిట్‌దారులకు డబ్బులు చెల్లించేందుకు సంబంధిత అధికారులు బుధవారం నుంచి చర్యలు ప్రారంభించారు. బ్యాంక్‌లో అవినీతి అక్రమాలు జరిగాయనే కారణంతో 2024 నవంబరు 8న ఆర్‌బీఐ బ్యాంక్ లైసెన్స్‌ను రద్దుచేసి, లిక్విడేటర్‌ను నియమించేందుకు ఆదేశించింది. బ్యాంక్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారం తమ పరిధిలో లేదని, ఆర్‌బీఐ ఉన్నతాధికారుల పరిధిలో ఉందని కోర్టు ఆదేశించింది. నాటి నుంచి లిక్విడేటర్ బ్యాంక్‌లో బాధ్యతలు తీసుకోలేదు. సుమారు 20 రోజుల క్రితం లిక్విడేటర్‌గా ఎస్.శ్రీనివాసరెడ్డి బాధ్యతలు చేపట్టారు. డిపాజిట్టు ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ (డిఐసిజిసి) స్కీమ్ ద్వారా డిపాజిట్టుదారులకు ఒక్కొక్కరికి సుమారు రూ.5లక్షల వరకు తిరిగి చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్‌బీఐ ఆదేశించింది. ఆ మేరకు బుధవారం (ఏప్రిల్ 16) నుంచి మే నెల 15వ తేదీలోపు డిపాజిట్టుదారులు అంగీకార పత్రం, ఆధార్‌కార్డు, పాన్ కార్డు, డిపాజిట్టు పత్రం, దుర్గాబ్యాంక్ పాస్‌బుక్, ఆధార్‌తో అనుసంధానించిన ఇతర బ్యాంక్ పాస్‌పుస్తకం బ్యాంక్‌లో అందజేయాలని ఆర్‌బీఐ ఆదేశించడంతో బుధవారం నుంచి డిపాజిట్టుదారులు బ్యాంక్‌కు వెళ్లి పత్రాలు, పాస్‌బుక్‌లను అందజేస్తున్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రవినాయుడు

'ఖేలో ఇండియా'లో క్రీడాకారులు రాణించాలి

» శాప్ చైర్మన్ రవినాయుడు

విజయవాడ(స్పోర్ట్స్) ఏప్రిల్, 16 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులు రాణించడంతో పాటు అత్యధిక పతకాలు సాధించి రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేయాలని శాప్ చైర్మన్ రవినాయుడు పేర్కొన్నారు. బీహార్ రాష్ట్రంలో మే 2 నుంచి 15వరకు జరగనున్న 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'లో ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహించే కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్ జట్ల ఎంపిక ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో బుధవారం జరిగింది. కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ, క్రీడాకారుల ప్రతిభ, ప్రదర్శనల పైనే వారి భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు కల్పిస్తున్న పథకాలు, పాలసీలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు సెపక్ తక్రా అండర్ 18 బాలికల ఎంపిక

ఖేలో ఇండియా యూత్ గేమ్స్ పోటీలకు నేడు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్టు శాప్ వైస్‌చైర్మన్-ఎండీ పీఎస్ గిరీశా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెపక్‌తక్రాలో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు అండర్-18 బాలికల కోసం రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ గురువారం ఎంపికలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దీనికి 1 జనవరి 2007 తర్వాత జన్మించిన క్రీడాకారులు అర్హులని తెలిపారు. ఎంపికలు 17 ఉదయం 9 గంటలకు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతాయని, పాల్గొనదలచిన వారు జనన ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని కోరారు.

తిరువూరు వైసీపీ వర్గపోరుకు తెర!

» నేడు కౌన్సిల్‌లో తేలనున్న చైర్‌పర్సన్ రాజీనామా అంశం

తిరువూరు : స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి రాజీనామాను గురువారం జరగనున్న కౌన్సిల్ సమావేశంలో ఆమోదించే అవకాశం ఉంది. గతనెల 3న కౌన్సిల్ సమావేశం అనంతరం చైర్‌పర్సన్ తన రాజీనామా పత్రాన్ని కమిషన్‌కు అందజేసిన విషయం తెలిసిందే. ప్రస్తుత సమావేశంలో రాజీనామాను కౌన్సిల్ సభ్యులు ఆమోదిస్తే స్థానిక వైసీపీ నేతల వర్గపోరుకు తెరపడనుంది.

వరి, మొక్కజొన్నకు నష్టం

జగ్గయ్యపేట రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఈదురు గాలులు, అకాల వర్షంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా వరి, మొక్కజొన్న పంటలు కొంతభాగం కోతకు రాగా కోసిన పంటను ఆరబెట్టేందుకు కల్లాలకు తరలించారు. మంగళవారం అర్ధరాత్రి ఒక్కసారిగా విరుచుకుపడిన ఉరుములు, మెరుపులతో కూడిన గాలివానతో ఆరబెట్టిన పంటలు తడిసి ముద్దయ్యాయి. కోతకు వచ్చిన పంటలు నేలవాలాయి. ఆరిన గింజలతో సిద్ధం చేసిన బస్తాలు కూడా తడిచిపోయాయి. జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల్లోని రైతులు ఆటోనగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతాల్లోని రోడ్లపై మొక్కజొన్న ఆరబోసుకుంటున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట ఇంటికి వచ్చే తరుణంలో తడిసి రంగు మారటంతో పాటు ముక్కు వాసన వస్తోందన్నారు. ఇప్పటికే సరైన ధర లేక ఇబ్బందులు పడుతుండగా, అకాల వర్షం కోలుకోలేని దెబ్బతీసిందన్నారు. మిషన్ కోతకు రూ.3,500, కల్లానికి తరలించేందుకు ట్రాక్టర్ ట్రిప్పునకు రూ.500, ధాన్యాన్ని మూడు రోజులు ఆరబెట్టేందుకు కూలీలకు రూ.4 వేలు ఖర్చైందని చెబుతున్నారు. ఆయా గ్రామాల్లో కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యంలోకి నీరు చేరటంతో మళ్లీ రోడ్లపై ఆరబెట్టేందుకు ట్రక్కుకు రూ.800 ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు. మండలంలోని తడిసిన పంటను అధికారులు పరిశీలించారు.

చంద్రబాబు స్ఫూర్తితో పాడిరైతులకు సేవ

» కృష్ణా మిల్క్‌యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నాయకుడిగా ప్రజలకు సేవలందించడంలో క్యారెక్టర్, క్రెడిబిలిటీ, క్రియేటివిటీ ముఖ్యమన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్ఫూర్తితోనే పాడిరైతులకు సేవలందిస్తున్నానని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. వీరవల్లిలోని ప్రాజెక్ట్ కామధేను(పాలఫ్యాక్టరీ)లో బుధవారం శ్రీసీతారామలక్ష్మణ సమేత దాసాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం, కలశాభిషేక కుంభసంప్రోక్షణ కార్యక్రమాలను శ్రీత్రిదండి చిన్న జీయర్‌స్వామి పర్యవేక్షణలో చైర్మన్ దంపతులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. '34 ఏళ్లుగా చంద్రబాబునాయుడుతో రాజకీయంగా ప్రయాణిస్తున్నా. అధికారంలో ఉన్నా, లేకున్నా ఆయన స్ఫూర్తితోనే రైతులకు సేవలందిస్తున్నా. ఆయన మనసెరిగే సమైక్యాంధ్ర ఉద్యమం, రైతు ఉద్యమాలు చేశా. ఆయన చేతు మీదుగానే కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ పదవి తీసుకున్నా. రాజకీయ ప్రయాణం వదలి యూనియన్ అభివృద్ధికి పని చేయాలనే ఆయన మాటలనే వేదంగా భావించి యూనియన్‌ను అభివృద్ధి చేశా. పాడిరైతు సంక్షేమమే ధ్యేయంగా పాలకవర్గంతో కలిసి ప్రయాణం చేశా. కరోనా, బుడమేరు వరద లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ పాల సేకరణ ధర పెంచుతూ, 3 విడతలుగా బోనస్‌లను చెల్లిస్తూ టర్నోవర్‌ను రూ.1300 కోట్లకు పెంచాం. ఇది పాడిరైతులందరి సహకారంతోనే సాధ్యమైంది.' అని చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. తదనంతరం దేవస్థాన



దాసాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిపిస్తున్న త్రిదండి చినజీయర్ స్వామి, చిత్రంలో చలసాని ఆంజనేయులు, గోకరాజు గంగరాజు తదితరులు ఉన్నారు

నిర్మాణ స్థపతికి, అత్యధిక బోనస్ సాధించిన పాల సంఘాలకు బోనస్ చెక్కులను చిన్నజీయర్‌స్వామి చేతుల మీదుగా పంపిణీ చేశారు. లైలా గ్రూప్ చైర్మన్ గోకరాజు గంగరాజు, గజల్ శ్రీనివాస్, గొట్టిపాటి శివరామకృష్ణ ప్రసాద్, నూతక్కి వేణు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి బాలవర్ధనరావు, డాక్టర్ దుట్టా రామచంద్రరావు, పాలకవర్గ సభ్యులు, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

దేశానికి అన్నపూర్ణగా ఏపీని నిలపాలి

» త్రిదండి చినజీయర్‌స్వామి



మేలుజాతి వంగడాలతో సారవంతమైన పంటలతో దేశానికి అన్నపూర్ణగా నిలచిన ఆంధ్రప్రదేశ్ కొంత కాలంగా దిగజారుతోంది. రైతన్నలందరూ కలిసికట్టుగా నేల సారం తగ్గకుండా మేలు జాతి పంటలతో మొదటి స్థానం సాధించాలి.' అని త్రిదండి చినజీయర్ స్వామి సూచించారు. అధిక దిగుబడుల కోసం ఎరువులు అధిక మోతాదులో వినియోగించకుండా సారవంతమైన విత్తులతో మంచి పంట పండించాలని సూచించారు. పాడిరైతులకు అత్యధిక ధర చెల్లిస్తూ చలసాని ఆంజనేయులు సారథ్యంలోని కృష్ణా మిల్క్ యూనియన్ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని ఆయన అన్నారు. విదేశాల్లో స్థిరపడిన వారు తప్పనిసరిగా మూలాలను చేసుకోవాలని, ప్రతి సంవత్సరం క్షేత్రస్థాయిలో పాడి-పంటలను పరిశీలించాలని సూచించారు.

ఏఎంసీ చైర్మన్ల నియామకం

» కంచికచర్లకు బాబు, మైలవరం నవ్యశ్రీ, గొల్లపూడికి నర్రా వాసు

కంచికచర్ల / మైలవరం రూరల్ / గొల్లపూడి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా టీడీపీ సీనియర్ నేత కోగంటి వెంకట సత్యనారాయణ (బాబు) నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. మండలంలోని పరిటాల గ్రామానికి చెందిన బాబు పదేళ్ల నుంచి మండల అధ్యక్షునిగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఎంపీటీసీ సభ్యునిగా ఉన్న ఆయన ఒక దఫా జడ్‌పీటీసీ సభ్యునిగా కూడా పనిచేశారు. బాబును ఏఎంసీ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించటం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వెలిబుచ్చారు.

- మైలవరం, గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్‌ల పేర్లను టీడీపీ అధిష్ఠానం బుధవారం ప్రకటించింది. గొల్లపూడి టీడీపీకి, మైలవరం జనసేనకు కేటాయించారు. మైలవరం ఏఎంసీని బీసీ మహిళ, జనసేన మండల అధ్యక్షుడు శీలం బ్రహ్మయ్యసతీమణి పోనకల్ల నవ్యశ్రీ పేరును ఖరారు చేశారు. గొల్లపూడి ఏఎంసీ చైర్మన్ పదవిని గ్రామ పార్టీ అధ్యక్షుడు నర్రా వాసు పేరును అధిష్ఠానం ప్రకటించింది. గత తొమ్మిదేళ్లుగా నర్రా వాసు గొల్లపూడి గ్రామ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఏఎంసీ పదవి ఇవ్వడంతో పార్టీశ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

అమరావతిపై అనుమానాలొద్దు

» మంత్రి నారాయణ

అమరావతి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అమరావతిపై కొంతమంది లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని, రాజధాని కోసం భూములిచ్చిన రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, అనుమానాలు వద్దని మంత్రి నారాయణ భరోసా ఇచ్చారు. రైతుల త్యాగంతోనే అమరావతి నిర్మాణం చేస్తున్నామని, ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రస్తుతం ఉన్న మాస్టర్ ప్లాన్‌తో మూడేళ్లలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అమరావతిపై దూరదృష్టితో సీఎం చంద్రబాబు ఉన్నారన్నారు. అమరావతిలో ఎయిర్ పోర్టు నిర్మాణం, 30 వేల ఎకరాల భూ సమీకరణపై రైతులకు మంత్రి మరోసారి స్పష్టత ఇచ్చారు. అమరావతి నిర్మాణం అంటే కేవలం మౌలిక వసతుల కల్పన మాత్రమే కాదని, జనాభా రావాలన్నా, యువతకు ఉద్యోగాలు కావాలన్నా స్మార్ట్ ఇండస్ట్రీస్ ఏర్పాటు చేయాలన్నారు. స్మార్ట్ ఇండస్ట్రీస్ రావాలంటే కొంత భూమి అవసరం ఉంటుందని చెప్పారు. పరిశ్రమలు వస్తేనే రైతుల భూముల ధరలు పెరుగుతాయన్నారు. అమరావతిలో కాలుష్య భరితమైన పరిశ్రమలు కాకుండా స్మార్ట్ ఇండస్ట్రీలు ఏర్పాటుచేసి పెద్దఎత్తున ఉద్యోగాలు కల్పించాలని సీఎం చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారని మంత్రి తెలిపారు. విదేశీ పెట్టుబడిదారులు అమరావతికి వచ్చేందుకు ఫ్లైట్ కనెక్టివిటీ ఉండేలా ఎయిర్‌పోర్టు నిర్మాణం చేయాలని సీఎం నిర్ణయించినట్లు తెలిపారు. అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుకు 5 వేల ఎకరాల భూమి అవసరమని, ఈ మేరకు భూమిని పరిశీలించాలని ఆదేశించారని తెలిపారు. అయితే భూసేకరణ చేయాలా, భూసమీకరణ చేయాలా అనే దానిపై త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. భూ సమీకరణ ద్వారా అయితే రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుందని అందుకే రైతులు ఈ పద్ధతికి మొగ్గు చూపుతున్నారన్నారు. భూసమీకరణలో విమానాశ్రయానికి 5 వేల ఎకరాలు కావాలంటే ఎక్కువ భూమి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు లేఅవుట్లు వేసి డ్రెయిన్‌లు కట్టాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే అమరావతి నిర్మాణానికి సంబంధించి రూ.41 వేల కోట్ల విలువైన టెండర్లు పూర్తిచేశామని, పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. రాజధానిలో మొత్తం రూ.64 వేల కోట్ల పనులకు పరిపాలనా ఆమోదం లభించిందని, చాలా వరకూ టెండర్లు పూర్తయి పనులు కూడా ప్రారంభమయ్యాయని చెప్పారు. ఇంకా కొన్ని టెండర్లు పిలవాల్సి ఉందని ఈ నెలాఖరు నాటికి పూర్తి చేస్తామన్నారు. భవిష్యత్‌లో అమరావతి, గుంటూరు, తాడేపల్లి, మంగళగిరి, విజయవాడ అన్నీ కలిపి ఒక మెగా సిటీగా సీఎం మాస్టర్ ప్లాన్ రూపొందించారన్నారు. కోటి మంది జనాభా ఇక్కడ ఉండాలనే దూరదృష్టితో సీఎం విజన్ ఇచ్చారన్నారు. రైతులకిచ్చిన మాట ప్రకారం అన్ని హామీలు నెరవేరుస్తామని చెప్పారు. అమరావతిలో నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, ఏడాదిలోగా అధికారుల నివాస భవనాలు పూర్తి చేస్తామని, ఏడాదిన్నరలోగా 360 కిలోమీటర్ల ట్రంక్ రోడ్లు, రెండున్నరేళ్లలో రైతుల రిటర్నబుల్ ప్లాట్లలోని లేఅవుట్ రోడ్లు, మూడేళ్లలో ఐకానిక్ భవనాల నిర్మాణాలు పూర్తి చేస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

బంగారం చోరీ కేసు దర్యాప్తు వేగవంతం

» పోలీసుల అదుపులో ముగ్గురు!



మహామండపం నాలుగో అంతస్తులో సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్న సీఐ గురు ప్రకాశ్

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు ఆదేశాల మేరకు దుర్గగుడి ఘాట్ రోడ్డులో చోరీ కేసు దర్యాప్తును వన్‌టౌన్ సీఐ గురుప్రకాశ్ వేగవంతం చేశారు. హైదరాబాద్‌లోని బృందావన్ కాలనీకి చెందిన బిల్డర్ ఆచంట దుర్గారావు కుటుంబసభ్యులతో కలిసి కారులో మంగళవారం దుర్గమ్మ దర్శనానికి వచ్చారు. కారును ఘాట్ రోడ్డు ఓం టర్నింగ్ వద్ద పార్కింగ్ చేశారు. దర్శనం అనంతరం వచ్చి చూడగా కారులో భద్రపరిచిన 241 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.10 వేల నగదు చోరీ జరగడంపై బాధితుడు వన్‌టౌన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా సీఐ గురుప్రకాశ్ సిబ్బందితో కలిసి బుధవారం మహామండపంలో ఉన్న సీసీ కెమెరా రూమ్‌లో సీసీ ఫుటేజ్‌ను పరిశీలించారు. బాధితుడు కారు దిగి డోర్ లాక్ చేయకుండానే అమ్మవారి దర్శనానికి వెళ్లినట్టు తెలుస్తోంది. క్లూస్ టీమ్ సిబ్బంది కారుపై ఆరు రకాల ఫింగర్ ప్రింట్‌ల నమూనాలను సేకరించారు. ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే పాత నేరస్థుల్లో కొందరిపై పోలీసులు నిఘా పెట్టినట్టు తెలిసింది. త్వరలో నిందితులను పట్టుకునే అవకాశం ఉందని పోలీసు అధికారులు తెలిపారు.

ప్రియుడితో ఏకాంతానికి అడ్డు వస్తుందని కుమార్తెపై తల్లి దాష్టీకం!



గాయాలతో ఉన్న బాలిక

కంచికచర్ల రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని కన్న కూతురిపైనే ప్రియుడితో కలిసి కర్కశంగా ప్రవర్తించింది ఓ తల్లి. బాలికను చిత్రహింసలకు గురిచేసిన ఇద్దరినీ కంచికచర్ల పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. నందిగామ మండలం అంబారుపేటకు చెందిన శోభనబాబు, సునీత దంపతులు. వారికి ముగ్గురు సంతానం. సునీత ప్రవర్తనపై అనుమానం వచ్చి భర్త నిలదీయడంతో ఆమె తన ఎనిమిదేళ్ల కుమార్తెతో కలిసి గండేపల్లిలోని సొంతింటిలో ఉంటోంది. సునీతకు అదే గ్రామానికి చెందిన కాళిదాసుతో వివాహేతర సంబంధం ఉంది. ఈ నేపథ్యంలో ప్రియుడితో కలిసేందుకు పాప అడ్డుగా ఉంటోందని తరచూ పాపను హింసించేది. ఈ క్రమంలో 20 రోజుల క్రితం చిన్నారికి వాతలు పెట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న చిన్నారి మేనత్త మైసమ్మ పాపను తీసుకొని పోలీసులకు ఫిర్యాదు చేసింది. బుధవారం సునీత, కాళిదాసులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ భువనగిరి రాజు తెలిపారు.

రెవెన్యూ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ వెల్లడి



కలెక్టరేట్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రెవెన్యూ సేవలకు సంబంధించిన దరఖాస్తుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటూ.. అంశాలపై స్పష్టమైన అవగాహనతో సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషిచేస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. రాష్ట్ర భూ పరిపాలన చీఫ్ కమిషనర్ (సీసీఎల్ఏ), ఎన్టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్రమబద్ధీకరణ పథకానికి సంబంధించి జీవో నెం.30 కింద అందిన దరఖాస్తులు, ఇళ్లలేని పేదలకు ఇళ్ల నిర్మాణం, ఇటీవల కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి ఆదేశాల అమలు కార్యాచరణ, భూ బదలాయింపులు, 22 ఏ జాబితాలోని ప్రైవేట్ భూములు, అసైన్‌మెంట్, ఆర్ఓఆర్-వెబ్‌ల్యాండ్ సమస్యలు, రీ సర్వే తదితర అంశాలపై సీసీఎల్ఏ అధికారులకు మార్గనిర్దేశనం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ, ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఇచ్చే మార్గదర్శకాలు, సీసీఎల్ఏ సూచనలకు అనుగుణంగా రెవెన్యూ సేవలకు చర్యలు తీసుకొంటున్నామని, క్షేత్రస్థాయి సిబ్బందికి ఆయా అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు.

ఇక అంతా సక్రమమే..

» వైసీపీ హయాంలో ప్రభుత్వ భూములు కబ్జా

» గన్నవరంలో అక్రమ మైనింగ్‌ను సాగనివ్వం

» ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హెచ్చరిక



హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : 'గన్నవరం నియోజకవర్గంలో ఇక మీదట అక్రమ మైనింగ్ ఉండదు. అంతా సక్రమంగానే ఉంటుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో గన్నవరంలో మైనింగ్ మాఫియా అడ్డగోలుగా అక్రమ తవ్వకాలు జరిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు విజిలెన్స్ విచారణ జరిపేందుకు వీలుగా ప్రస్తుతం మైనింగ్‌కు అనుమతులు ఇవ్వడం లేదు. అనుమతులు ఇచ్చాక అక్రమ మైనింగ్‌ను ఉపేక్షించం. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.' అని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు. అంపాపురంలో పంచాయతీ భవనాన్ని బుధవారం ప్రారంభించిన ఆయన మీడియాతో మాట్లాడారు. కక్షసాధింపు చర్యలు తనకు తెలియదన్నారు. నియోజకవర్గ అభివృద్ధే ముఖ్యమన్నారు. ట్రిపుల్‌ఐటీ గచ్చిబౌలిని గన్నవరం తీసుకొచ్చేందుకు అందరితో మాట్లాడి ఒప్పిస్తే మేధా టవర్స్‌లో ఖాళీగా ఉన్న 37వేల చదరపు అడుగుల్లో తాత్కాలికంగా ఏర్పాటు చేసేందుకు అనుమతి వచ్చిందన్నారు. గతపాలకుల దుర్మార్గం వల్ల ప్రభుత్వ భూములన్నీ ఆక్రమణలకు గురయ్యాయన్నారు. ఉమామహేశ్వరపురంలోని శ్మశానవాటిక భూమిని ఆక్రమించారని అక్కడి నాయకులు ఫిర్యాదు చేశారని, రెండు రోజుల్లో ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించామన్నారు. ప్రభుత్వ ఆస్తుల వ్యవహారంలో గతంలో తప్పుచేసిన అధికారులను వదిలిపెట్టబోమన్నారు. గతంలో అక్రమ మైనింగ్ జరిగిన మాట వాస్తవమేనని, విజిలెన్స్ ఎంక్వయిరీ జరిగిందని, సిట్ ఎంక్వయిరీ జరుగుతోందని దానిపై తనకు స్పష్టత లేదని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ పాలసీ తీసుకున్న తరువాత గ్రావెల్ అందుబాటులోకి వస్తుందన్నారు. మల్లవల్లి పారిశ్రామికవాడను రాష్ట్రంలో మొదటిస్థానంలో ఉంచేందుకు కృషి చేస్తానన్నారు. కమీషన్లు అక్కర్లేదని నియోజకవర్గంలోని యువతకు ఉపాధి ఉద్యోగావకాశాలు మాత్రమే కావాలని పారిశ్రామికవేత్తలను కోరానన్నారు. జర్నలిస్టుల స్థలాల కోసం అసెంబ్లీ వేదికగా ప్రశ్నించానన్నారు. సున్నలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను తొలగించామన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఆలోచించుకోవాలని, గోడలు కట్టినా గోడకు కొట్టిన సున్నంలా వృథా అవుతుందని హెచ్చరించారు.

జీనీయస్

(5వ పేజీ తరువాయి)

సమర్పించాల్సి ఉంటుందని సదరు ఆడిటర్ స్పష్టం చేశారు. దీంతో టీఎల్ఎఫ్ సభ్యులు ఈ నగదును యూసీడీ చెప్పినట్టుగా వేరే ఖాతాలకు బదలాయించలేదు. అయితే, చెక్కులైనా ఇవ్వాలని ఉజ్వల టీఎల్ఎఫ్ సభ్యులపై యూసీడీ విభాగ అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. చెక్కులు కూడా ఇవ్వబోమని, జీఎస్టీ సంగతి తేల్చాలని, లేకపోతే రూ.లక్షన్నరకు పైగా తాము సొంత డబ్బు చెల్లించాల్సి ఉంటుందని ఉజ్వల టీఎల్ఎఫ్ సభ్యులు వాపోయారు. దీంతో యూసీడీ అధికారులు చెక్కులు ఇవ్వకపోతే టీఎల్ఎఫ్‌ను రద్దు చేస్తామని బెదిరించారు. చేసేదేమీ లేక సదరు టీఎల్ఎఫ్ సభ్యులంతా బుధవారం మెప్మా ఎండీని కలిసి ఫిర్యాదు చేశారు.

డబ్బు జమ చేసేది ఎవరికి?

ఉజ్వల టీఎల్ఎఫ్ ఖాతాలో పడిన డబ్బును ఆర్టీజీఎస్ ద్వారా కానీ, చెక్కుల ద్వారా కానీ ఇవ్వాలని ఒత్తిడి చేయటం వెనుక అనేక ఆరోపణలు వస్తున్నాయి. అసలు ఎవరికి చెల్లిస్తున్నామన్నది కూడా రహస్యంగా ఉంచుతూ ఆర్‌టీజీఎస్ పేమెంట్లు కానీ, ఖాళీ చెక్కులు కానీ ఇవ్వమంటున్న యూసీడీ అధికారుల తీరుపై అనుమానాలు కలుగుతున్నాయి.

పింఛన్ సమస్యలపై ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

కృష్ణలంక : పింఛన్ సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసి విశ్రాంత ఉద్యోగులు భవిష్యత్తు ఆందోళనలకు సిద్ధంగా వుండాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానాల గంగాధరరావు అన్నారు సంఘ రాష్ట్ర కమిటీ సమావేశం కృష్ణలంకలోని భ్రమరాంబపురం సీపీఎం కార్యాలయంలో బుధవారం జరిగింది. హయ్యర్ పెన్షన్ కోసం ఆన్‌లైన్ నమోదులో సరైన అవగాహన లేక నమోదు చేయించుకోలేని వారికి మరొక అవకాశం కల్పించాలన్నారు. నమోదు చేసుకున్న చాలా మందిని తిరస్కరించారని, ఇలాంటి సమస్యలపై ఈనెల 25న అన్ని జిల్లాల్లోని ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయాల వద్ద నిరసనలు చేపట్టి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

అరాచకవాది

(5వ పేజీ తరువాయి)

రెండు సంచుల్లో చట్టాలకు సంబంధించిన పుస్తకాలను తీసుకుని నిత్యం కోర్టుకు వెళ్లడం మొదలుపెట్టాడు. అస్లాం హత్యకు సంబంధించి కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసు కోర్టు విచారణలో ఉంది.

న్యాయవాదికి బెదిరింపులు

అస్లాం హత్యకేసులో ఆయన భార్య ఫాతిమా మొదటి నుంచి పోరాడుతోంది. ఈ కేసును వాదిస్తున్న న్యాయవాదిపై అన్వర్ న్యాయస్థానాల ప్రాంగణంలోనే బెదిరింపులకు దిగాడు. విచారణలో భాగంగా నసీమాను ఆ న్యాయవాది విచారణ చేశారు. ప్రశ్నలు సంధించారు. విషయం తెలుసుకున్న అన్వర్ ఏకంగా న్యాయవాది వద్దకు వెళ్లి బెదిరించాడు. ఆయన అంతుచూస్తానని హెచ్చరించాడు. న్యాయవాది ఇచ్చిన ఫిర్యాదుతో సూర్యారావుపేట పోలీసులు అన్వర్‌పై కేసు నమోదు చేశారు.

రూ.50 వేల కోసం బంధించి..

విశాఖపట్నానికి చెందిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు.. ఎయిర్ హోస్టస్ ఉద్యోగాల పేరుతో పలువురు నిరుద్యోగులను మోసం చేశారు. బాధితులంతా సత్యనారాయణపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు విశాఖలో ఉన్న అక్కాచెల్లెళ్లను విచారణకు పిలిపించారు. పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపుతారన్న భయంతో బెయిల్ కోసం వారు అన్వర్‌ను సంప్రదించారు. తర్వాత నిర్ణయం మార్చుకుని మరో న్యాయవాది వద్దకు వెళ్లారు. ఆ అక్కాచెల్లెళ్లకు అన్వర్ ఎలాంటి సాయం చేయలేదు. కోర్టులో ఎలాంటి పిటిషన్ దాఖలు చేయలేదు. వారు తనను సంప్రదించినందుకు ఫీజుగా రూ.50 వేలు డిమాండ్ చేశాడు. దీనికి అక్కాచెల్లెళ్లు ఇద్దరూ ఎదురుతిరిగారు. దీంతో తన బలాన్ని ఉపయోగించుకుని వారిని బంధించి దాడి చేశాడు. వారి ఫోన్ల నుంచి పేమెంట్ యాప్ ద్వారా రూ.50 వేలు తన ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. దీనిపై వారు సత్యనారాయణపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యాయవాదిపై కేసు ఎలా నమోదు చేస్తారని ఇతర న్యాయవాదులను రెచ్చగొట్టాడు. అన్వర్‌ను అరెస్టు చేసినందుకు వాళ్లంతా పోలీస్‌స్టేషన్ ముందు బైఠాయించి నానా హంగామా సృష్టించారు.

కారుతో బీభత్సం

తనకు దక్కనిది మరొకరికి దక్కకూడదన్న సిద్ధాంతం అన్వర్‌ది. నసీమా సోదరి కుమార్తె, అల్లుడు హైదరాబాద్‌లో ఉంటారు. రంజాన్ షాపింగ్ కోసం హైదరాబాద్ వెళ్లిన నసీమా వారితో కలిసి విజయవాడకు వచ్చింది. కారులో నసీమా, ఆమె సోదరి కుమార్తె, అల్లుడు ఉన్నారు. మహంతిపురంలో కారును చూడగానే అన్వర్‌కు పూనకాలు వచ్చాయి. ఒక్కసారిగా అతడు తన కారుతో నసీమా ఉన్న కారును ఢీకొట్టాడు. ఈ క్రమంలో అక్కడున్న ద్విచక్ర వాహనాలను తుక్కుతుక్కు చేశాడు. దీనిపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

కేసుల జాబితా

క్రైం నెంబరు 187/2015తో ఐపీసీ 506, 323, 324, 509 కింద భవానీపురంలో ఓ కేసు నమోదైంది. అలాగే, క్రైం నెంబరు 51/2022తో సీఆర్సీ 174గా ఉన్న కేసును ఐపీసీ 302, 202 కింద కొత్తపేట పోలీసులు మార్పు చేశారు. క్రైం నెంబరు 84/2022తో ఐపీసీ 153 కింద కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. క్రైం నెంబరు 203/2023తో ఐపీసీ 341, 506 రెడ్‌విత్ 34 కింద సూర్యారావుపేట పీఎస్‌లో కేసు నమోదైంది. క్రైం నెంబరు 88/2025తో బీఎన్ఎస్ 140(2), 127(2), 115(2), 308(2) రెడ్‌విత్ 3(5) కింద సత్యనారాయణపురం పోలీసులు కేసు నమోదు చేశారు. క్రైం నెంబరు 126/2025తో బీఎన్ఎస్ 281, 324(3) కింద కొత్తపేట స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

నేలరాలిన ఆశలు

(5వ పేజీ తరువాయి)

సమయంలో కాయలన్నీ నేలరాలిపోయాయి. మైలవరం మండలం గణపవరం గ్రామంలో రాలిన మామిడి కాయలు కొనే నాథుడు లేక రోడ్ల పక్కన పడేస్తున్నారు.

దిక్కుతోచని స్థితిలో ఉన్నాం..

- పగడాల సత్యనారాయణ, నాగులూరు

ఈ ఏడాది పెట్టుబడి అధికంగా పెట్టాం. ప్రతికూల వాతావరణం వల్ల కాపు తగ్గింది. మే నెలలో రావాల్సిన గాలి, దుమ్ము ఈనెల మొదటి వారంలోనే రావడంతో కోత కోయకుండానే కాయలు రాలిపోయాయి. ఉన్న కాయలు కోసినా కోత ఖర్చులు వచ్చేలా లేవు. ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

సర్వోత్తమ గ్రంథాలయంలో 22న కళాశాల విద్యార్థులకు పోటీలు

బెంజిసర్కిల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పుస్తక దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 22న బెంజిసర్కిల్‌లోని సర్వోత్తమ గ్రంథాలయంలో నగరంలోని కళాశాల విద్యార్థులకు బుక్ హంట్(పుస్తకాల వేట), క్విజ్ పోటీలు జరగనున్నాయి. ఈపోటీల్లో పాల్గొనే విద్యార్థినీ, విద్యార్థులు ఈనెల 20లోగా సర్వోత్తమ గ్రంథాలయంలో తమ పేర్లను నమోదుచేసుకోవాలని, లేదా సెల్ నెంబరు 7995313148కు వివరాలను వాట్సప్ ద్వారా తెలియజేయాలని సర్వోత్తమ గ్రంథాలయ సంఘం కార్యదర్శి డాక్టర్ రావి శారద ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో విజేతలకు 23న గ్రంథాలయంలో జరిగే కార్యక్రమంలో బహుమతులను అందజేస్తామని పేర్కొన్నారు.

ధీరజ్ శ్రీకృష్ణకు గవర్నర్ అభినందనలు



విజయవాడ(స్పోర్ట్స్), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ బుధవారం రాజ్‌భవన్‌లో ధీరజ్ శ్రీకృష్ణను ప్రత్యేకంగా అభినందించినట్లు యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి తెలిపారు. విజయవాడకు చెందిన ధీరజ్ శ్రీకృష్ణ ఇటీవల సింగపూర్‌లో జరిగిన పదవ ఏషియన్ యోగ చాంపియన్‌షిప్‌లో రాష్ట్రం నుంచి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి ట్రెడిషనల్, ఆర్టిస్ట్ విభాగాలలో బంగారు పతకాలు సాధించాడు. ఈ సందర్భంగా ధీరజ్, అతని తల్లిదండ్రులు గవర్నర్‌ను కలిశారు.

హరినాథ్, వివేక్‌లకు సత్కారం



హరినాథ్, వివేక్‌లను సత్కరిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

లబ్బీపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తెలుగునాట రంగ దినోత్సవం సందర్భంగా కందుకూరి విశిష్ట సేవా పురస్కారానికి ఎంపికైన శాంబోలు హరినాథ్, ప్రత్తిపాటి వివేక్‌లను శాప్ చైర్మన్ రవినాయుడు బుధవారం తన కార్యాలయంలో సత్కరించారు. శాంబోలు హరినాథ్ జిల్లాకు చెందిన టీడీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు, తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ కల్చరల్ ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ ప్రత్తిపాటి వివేక్‌లను శాప్ చైర్మన్ సత్కరించారు.

క్యాటరింగ్ కార్మికుల ధర్నా

● నగదు చెల్లించిన కాంట్రాక్టర్



రామాలయం వద్ద ఆందోళన చేస్తున్న క్యాటరింగ్ కార్మికులు

పటమట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి పర్వదినాన్ని పురష్కరించుకొని పటమట లంక పెద్ద రామాలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం 3 గంటలకు అంతా పూర్తయ్యింది. వంట చేసిన కార్మికులకు, వడ్డించిన వారికి డబ్బులు ఇవ్వకపోవడతో గేటు వద్ద బుధవారం ధర్నా చేశారు. ధర్నాతో దిగివచ్చిన కాంట్రాక్టర్ కార్మికులకు డబ్బులు ఇచ్చి పంపారు.

గ్రీన్ కంప్యూటింగ్‌పై లయోలలో ప్రత్యేక సదస్సు


భారతీనగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర లయోలా కళాశాలలో కంప్యూటర్ అప్లికేషన్స్ మాస్టర్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం గ్రీన్ కంప్యూటింగ్ అనే అంశంపై ప్రత్యేక సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి సీనియర్ డేటా సైంటిస్ట్ సయ్యద్ వసీం అక్రమ్, డీహెచ్‌ఎల్ ఆర్కిటెక్ట్ కళాశాల ప్రిన్సిపాల్ వి.రమేష్, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కంప్యూటర్‌లో స్థిరమైన పద్ధతులను వివరించారు. సాంకేతికతలో స్థిరత్వం ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ జి. కిషోర్, కరస్పాండెంట్ ఫాదర్ ఎం సగయరాజ్, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ ప్రభుదాస్, ఎంసీఏ హెచ్‌వోడీ మేరీమంజుల రాణి, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెక్నాలజీతో భవిష్యత్ ప్రణాళికపై..



డాక్టర్ విష్ణు వందనను సన్మానిస్తున్న సిస్టర్ క్యాండీ కూనా, కళావతి

ఆంధ్రా లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో ఫాదర్ జోజిరెడ్డి సమక్షంలో ఐక్యూఏసీ, సైన్ అండ్ హ్యూమానిటీస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం టెక్నాలజీతో భవిష్యత్ ప్రణాళిక అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ సంస్థ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ విష్ణు వందన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ కమ్యూనికేషన్ నైపుణ్యాలు భవిష్యత్‌కు ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ బాలస్వామి, ఫాదర్ మహేష్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సిస్టర్ క్యాండీకూనా, కళావతి, పాల్గొన్నారు.









స్ఫూర్తి కలిగించిన సైన్స్ విహారయాత్ర

హైదరాబాద్ వెళ్లిన 101 మంది విద్యార్థులు



హైదరాబాద్‌లోని బిర్లా సైన్ మ్యూజియం వద్ద విద్యార్థులు

లబ్బీపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ విద్యతో పాటు వైజ్ఞానిక ప్రదర్శనల్లో ప్రతిభ చూపిన 101మంది విద్యార్థులతో నిర్వహించిన సైన్స్ విహారయాత్ర విద్యార్థుల్లో ఎంతో స్ఫూర్తిని, సైన్స్‌పై అవగాహనను పెంచింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన పలు వైజ్ఞానిక ప్రదర్శనల్లో ప్రతిభ చూపిన 101 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వారి తల్లిదండ్రుల అనుమతితో జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ ఎం.హుస్సేన్ నేతృత్వంలో హైదరాబాద్‌కు సైన్స్ విహారయాత్రకు ఈ నెల 10న వెళ్లారు. వీరితో పాటు 18మంది గైడ్ టీచర్లను, ఐదుగురు ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులను కూడా పంపారు. రెండు రోజుల పాటు పలు వైజ్ఞానిక కేంద్రాలను విద్యార్థులకు చూపించి అక్కడి విషయాలను వివరించారు. ఈ యాత్రలో పాల్గొన్న విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తూ తాము చూసిన ప్రదేశాలు, తెలుసుకున్న అంశాలు తమ చదువుకు, తాము భవిష్యత్తులో నిర్వహించే వైజ్ఞానిక ప్రదర్శనలకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.

విద్యార్థులు చూసిన ప్రదేశాలు

సైన్స్ యాత్రలో భవానీపురంలోని ఏపీసీవోఎస్‌టీ, గరికపాడులోని అగ్రికల్చరల్ సెంటర్‌ను సందర్శించి వ్యవసాయ శాస్త్రవేత్తలతో నేరుగా సంభాషించి అక్కడి విషయాలు తెలుసుకున్నారు. హైదరాబాద్‌లోని బిర్లా సైన్స్ మ్యూజియం, ఐఐటీ కళాశాలలో పీహెచ్‌డీ విద్యార్థులతో ముఖాముఖి చర్చలు, ప్రొఫసర్లతో మోటివేషన్ సెషన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం డీఆర్‌డీవో మిసైల్ ల్యాబ్ సందర్శన, అక్కడి శాస్త్రవేత్తలతో పలు అంశాలపై చర్చగోష్ఠి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ సందర్శనతో సైన్స్ యాత్ర ముగించుకుని 12న తిరిగి వచ్చారు.

ఈ సైన్స్ టూర్ చాలా నచ్చింది



నాకు ఈ సైన్స్ టూర్ చాలా నచ్చింది. తీసుకువెళ్లిన ప్రతి ఒక్క ప్రదేశం, ప్రయాణంలో కలిసిన కొత్త స్నేహితులతో గడిపిన క్షణాలు ఎంతో గుర్తుండిపోతాయి. ఎన్నో సైన్స్ విషయాలు తెలుసుకున్నాను. ఇటువంటి టూర్‌లు మరిన్ని జరగాలి, తమకు ఎటువంటి లోటు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఈ టూర్ అవకాశం కల్పించిన టీచర్స్ కు, అధికారులకు ధన్యవాదాలు.

- హర్షవర్ధన్ నాయక్ (కంచికచర్ల హైస్కూల్)

విజ్ఞానాన్ని తెలుసుకోవడం ఒక గొప్ప అవకాశం



రెండు రోజుల పాటు నేను వెళ్లిన ప్రతి చోటులో అనేక విషయాలు తెలుసుకున్నాను. ఈ వైజ్ఞానిక ప్రదర్శన తమకు ఎంతో విజ్ఞానాన్ని అందించింది. నాకు లభించిన ఒక గొప్ప అవకాశం ఇది. ఈ అవకాశాన్ని కల్పించిన ప్రభుత్వానికి, ఇతర అధికారులకు ధన్యవాదాలు.

సుదీక్ష (గంపలగూడెం, మోడల్ స్కూల్)

ప్రభుత్వ సహకారం అద్భుతం



గత 25సంవత్సరాలో ఇటువంటి సైన్స్ విహారయాత్ర కు విద్యార్థులను తీసుకువెళ్లిన సందర్భాలు లేవు. ప్రభుత్వం ముఖ్యంగా మంత్రి నారా లోకేష్, ఎడ్యుకేషన్ కమిషనర్ వి జయరామరాజు,సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, కలెక్టర్ లక్ష్మీశ, జిల్లా విద్యాశాఖాధికారి యువి.సుబ్బారావు తదితరులు ఈ సైన్స్ యాత్రకు సహకరించి ప్రోత్సహించారు. ఇటువంటి యాత్రలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయి.

ఎం.హుస్సేన్ (జిల్లా సైన్స్ అధికారి)

పీఆర్‌టీయూలో భారీ చేరికలు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి సభ్యుడు గాదె శ్రీనివాసుల నాయుడు సమక్షంలో బుధవారం పీఆర్‌టీ యూలో భారీ చేరికలు జరిగాయి. సివిల్ కోర్టుల సమీపంలోని కేఎల్ రావు భవన్‌లో జరిగిన కార్యక్రమంలో డెమోక్రటిక్ పీఆర్‌టీయూకు చెందిన నేతలు మాతృ సంస్థ పీఆర్‌టీయూలో చేరారు. డెమోక్రటిక్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మద్ది ప్రభాకర్, ఇబ్రహీంపట్నం మండల ప్రధాన కార్యదర్శి ఇర్ఫాన్ భాష, పెడన మండలం ప్రధాన కార్యదర్శి సురయ్య సుల్తానా, దుబ్బాక కార్తీక్‌లు డీపీఆర్‌టీయూకు రాజీనామా చేసి మాతృసంస్థ పీఆర్‌టీయూలో చేరారు. వీరితో పాటు 50 మంది కార్యకర్తలు పీఆర్‌టీయూ సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసుల నాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం పీఆర్‌టీయూ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పీఆర్‌టీయూ బలమైన సంఘమని, అందుకు అనుగుణంగానే చేరికలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్ల కృష్ణయ్య, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్‌నవాబ్ జానీ, సోలార్ రాఘవ పాల్గొన్నారు.

19న రన్ ఫర్ జీసస్ శాంతి ర్యాలీ

● టీ షర్టుల ఆవిష్కరణ



లబ్బీపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఈస్టర్ పర్వ దినాన్ని పురస్కరించుకుని ఫెడరేషన్ ఆఫ్ తెలుగు చర్చస్, అన్ని క్రైస్తవ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 19న నగరంలో భారీ ఎత్తున రన్ ఫర్ జీసస్ శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సీఎస్ఐ కృష్ణా, గోదావరి డయాసిస్ బిషప్ మోస్ట్ రెవరెండ్ టి.జార్జి కొర్నేలియస్ తెలిపారు. బుధవారం బిషప్ అజరయ్య స్కూల్ గ్రౌండ్స్‌లోని ఆల్ సెయింట్ చర్చి ఆవరణలో జరిగిన కార్యక్రమంలో రన్ ఫర్ జీసస్ శాంతి ర్యాలీ టీ షర్టులను ఆవిష్కరించారు. బేతేలు మినిస్ట్రీస్ బైబిల్ కాలేజీ ప్రెసిడెంట్ పాస్టర్ సల్లూరి జయకుమార్ బాబు మాట్లాడుతూ 19న ఉదయం 6గంటలకు నిర్మలా హైస్కూల్ పక్కన ఉన్న సెయింట్ పాల్స్ కథెడ్రల్ చర్చి నుంచి రన్ ప్రారంభమై పాలిక్లినిక్ రోడ్ మీదుగా మదర్ థెరిస్సా విగ్రహం, గిరిపురం, శిఖామణి సెంటర్ మీదుగా సీఎస్ఐ సెయింట్ పాల్స్ బసిలిక చర్చి ప్రాంగణానికి చేరుకుంటుందని తెలిపారు. ఈ సమావేశంలో పాస్టర్స్ అల్లూరి విశ్వప్రసాద్, ప్రవీణ్ శీలం, బెల్లంకొండ శివాజిరాజు, కరుణానిధి, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పునర్వికాసానికి తోడ్పాటునివ్వాలి

● రచయితలు, ప్రచురణకర్తలు, సాహితీవేత్తల విజ్ఞప్తి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గ్రంథాలయ పునర్వికాస ప్రచార ఉద్యమ వేదిక నేతలు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ పునర్వికాసానికి ప్రభుత్వం చేయూత నివ్వాలని రచయితలు, ప్రచురణకర్తలు, సాహితీవేత్తల సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. బుధవారం గోపాలరెడ్డి రోడ్డులోని బుక్ ఫెస్టివల్ సొసైటీ భవన్‌లో సమావేశం జరిగింది. పలువురు ప్రచురణ కర్తలు, రచయితలు, సాహితీవేత్తలు సమావేశంలో పాల్గొన్నారు. ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో ఈనెల 27న విజయవాడ ఎంబీవీకేలో నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని వక్తలు పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉద్యమ వేదిక కన్వీనర్ వల్లూరు శివప్రసాద్, పుస్తక ప్రచురణ కర్తల అధ్యక్షుడు పల్లవి వెంకట నారాయణలు మాట్లాడుతూ ప్రజల్లో గ్రంథాలయాల పట్ల ఆసక్తి పెంచేందుకు విజయవాడ కేంద్రంగా పునర్వికాస ఉద్యమాన్ని ప్రారంభించామన్నారు. ఈనెల 27న ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగే సదస్సులో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, గ్రంథాలయ ఉద్యమ ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు మనోహర్ నాయుడు, ప్రచురణకర్తలు బి. బాబ్జి, విశ్వేశ్వరరావు, ఎంబీవీకే బాధ్యురాలు కె. స్వరూపరాణి, అరసం నేతలు పరుచూరి అజయ్, అరుణ్, రచయితలు ఆంజనేయరాజు, చలపాక ప్రకాష్, సాహితీ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వాటర్ వృథాగా...



భారతీనగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మూడో డివిజన్ పరిధిలోని నాగార్జుననగర్ కాలనీ ఐదో రోడ్లో ఇండియన్ బ్యాంక్ సమీపంలో ఉన్న మున్సిపల్ వాటర్ పైపు ధ్వంసమైంది. సంబంధిత అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో సుమారుగా రెండు వారాల నుంచి ఉదయం, సాయంత్రం సమయంలో పైపులు వదిలిన ప్రతిసారీ మంచి నీరు వృథాగా పోతున్నాయి. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

పటమట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): 13వ డివిజన్ జేడీనగర్‌లో విద్యుత్ స్తంభం తుప్పు పట్టి ప్రమాదకరంగా మారింది. అడుగు భాగంలో తుప్పుతో తినేయడంతో ఎప్పుడు కూలుతుందో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వెంటనే స్తంభాన్ని మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

జేడీ నగర్‌లో తుప్పు పట్టిన విద్యుత్ స్తంభం







సైడు కాల్వ మీద ఆక్రమణ, రోడ్డు మధ్యలో వాహనాల నిలుపుదల, రోడ్డు మార్జిన్‌లో చెత్త కలెక్షన్ పాయింట్

బోయపాటి మాధవరావు రోడ్డులో ఆక్రమణలు

● ఇళ్ల ముందు దుకాణాలు ● సైడ్ కాల్వనూ వదలని వైనం

మొగల్రాజపురం, ఆంధ్రజ్యోతి: మొగల్రాజపురం ఏడో డివిజన్‌కు ప్రధాన రహదారిగా ఉన్న బోయపాటి మాధవరావు రోడ్డు ఆక్రమణలతో మార్కెట్‌గా మారింది. గుహల నుంచి కొండ మీదకు వెళ్లే ఈ రోడ్డే కొండమీద ఉన్న వేలాది మందికి ప్రధాన రహదారి. దీంతో గుహల నుంచి కొండ మొదట ఉన్న బందెల దొడ్డి వరకు రోడ్డుకిరువైపుల ఇళ్లన్నీ దాదాపుగా దుకాణాలుగా మారిపోయాయి. ఇంటి హద్దులు, సైడు కాల్వను దాటి దుకాణాలు రోడ్డు మీదకు వచ్చాయి. ఈ రోడ్డులో ఉన్న అపార్ట్‌మెంట్‌ల ముందు సైడ్ కాల్వల మీద బండలు వేసి అద్దెలకు కూడా ఇస్తుంటారు. చిరువ్యాపారులు, బడ్డీలు, టిఫిన్ సెంటర్‌లు రోడ్డు మీద ఉండటంతో వాటి వద్దకు వచ్చే వాహనదారులు రోడ్లమీదే వాహనాలు నిలుపుతుంటారు. విశాలాంధ్ర రోడ్డు నుంచి మెట్రో మీదుగా నైస్ బార్ వద్ద ఐదో నెంబరు రోడ్డులోకి వచ్చే వాహనాలు, మెట్రో ఎదురుగా నాగళ్ల వారి వీధి మీదుగా రావిచెట్టు సెంటర్, శివాలయం మీదుగా బోయపాటి మాధవరావు రోడ్డులోకి వచ్చి అక్కడి నుంచి గుహల వద్ద ఐదో నెంబరు రోడ్డుకు వస్తుంటాయి. ఉదయం, సాయంత్రం వేళ ఈ రోడ్డులో కనీసం ఆటో కూడా వెళ్లే పరిస్థితి ఉండదు. గుహల వద్ద నుంచి మొదలు పెడితే స్క్రాప్ దుకాణం, ఆటో, కార్ల పార్కింగ్‌లు, టిఫిన్ సెంటర్‌లు, కూరగాయల కొట్లు, వీటికి తోడు వీఎంసీ చెత్త కలెక్షన్ పాయంట్ కూడా రోడ్డుమీదే ఉంటుంది. ఎవరినైనా కదిలిస్తే గొడవలకు సిద్ధంగా ఉంటున్నారు.

● పట్టించుకోని టౌన్‌ప్లానింగ్

ప్రధాన రోడ్లమీద దృష్టి పెట్టే టౌన్ ప్లానింగ్ విభాగం ఇలాంటి రోడ్లమీద దృష్టిపెట్టడం లేదు. చిరువ్యాపారులు ఇచ్చే నెల వారీ మామూళ్లు, ఉచితంగా ఇచ్చే టిఫిన్‌లు, కూరగాయలు వీరిని ఇటు వైపు చూడకుండా చేస్తున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మీదకు వచ్చిన స్టాల్స్‌ను, కాల్వల మీద ఉన్న ఆక్రమణలను వెనక్కి జరిపించాలని రోడ్డుమీద మార్కింగ్ చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

నగరంలో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

వన్‌టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరుగుతున్న, జరగాల్సిన పనులపై చర్చించారు. మంజూరైన ఇంజనీరింగ్ పనులు త్వరగా పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకు రావాలని అధికారులను ఆదేశించారు. నగర పరిధిలో ఉన్న ఎస్టేట్‌లన్నీ ఫైర్ ప్రూఫ్‌గా ఉండాలని, ఫైర్ ఆఫీసర్ ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. అనధికార హోర్డింగులను, కట్టడాలను ప్రతి రోజూ పర్యవేక్షిస్తుండాలని చీఫ్ సిటీ ప్లానర్‌ను ఆదేశించారు. అధికారులందరూ సమన్వయంతో ప్రజల సమస్యలను పరిష్కరించి నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆదేశించారు. ఈ సమావేశంలోఅడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి.చంద్రశేఖర్, సీఈ ఆర్.శ్రీనాథ రెడ్డి, చీఫ్ సిటీప్లానర్ సంజయ్ రత్నకుమార్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, టీపీటీ కమిషనర్ జి.సృజన, ఎస్ఈలు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, ప్రాజెక్టు ఆఫీసర్ పి.వెంకట నారాయణ, డిప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) రామ్మోహన్, అకౌంట్ ఆఫీసర్ పాల్గొన్నారు.







గిల్టు నగలు మన్నిక కోసం ఇలా చేయాలి..!

మారుతున్న ఫ్యాషన్ ట్రెండ్స్‌కు అనుగుణంగా ప్రస్తుతం రకరకాల గిల్టు నగలు అందుబాటులో ఉన్నాయి. చీర, గౌను, ట్రెండీ డ్రెస్ ఇలా ఏ అవుట్‌ఫిట్ మీదనైనా చక్కగా అమరుతాయి ఈ నగలు. తక్కువ బరువుతో సౌకర్యవంతంగా అనిపిస్తాయి. అందుకే మహిళలు వీటిని ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఎంతో ముచ్చట పడి కొనుక్కున్న గిల్టు నగలను ధరించేటప్పుడు చిన్న చిట్కాలు పాటిస్తూ సరైన పద్ధతిలో భద్ర పరచుకుంటే అవి ఎక్కువకాలం మన్నికగా ఉంటాయి. ఆ వివరాలు తెలుసుకుందాం...

- గిల్టు నగలకు తడి తగిలితే అవి బంగారు మెరుపును కోల్పోతాయి. అందుకే గొలుసులు, హారాలు, నెక్లెస్‌లు, గాజులు, ఉంగరాలను స్నానం చేసేటప్పుడు తీయడం మంచిది. చేతులు కడుక్కునేటప్పుడు కూడా వాటికి తడి తగలకుండా చూసుకోవాలి.
- మేకప్ ఉత్పత్తులు, మాయిశ్చరైజర్, పర్‌ఫ్యూమ్, లోషన్, డియోడరెంట్‌లు వాడేముందు గిల్టు నగలు ధరించకూడదు. అలా చేస్తే ఈ ఉత్పత్తుల్లోని రసాయనాల వల్ల నగలకు ఉన్న గోల్డ్ ప్లేటింగ్ తొలగిపోయి అవి నల్లబడే అవకాశం ఉంటుంది. మేకప్ పూర్తయి పర్‌ఫ్యూమ్ చల్లుకున్న అయిదు నిమిషాల తరవాతనే గిల్టు నగలు ధరించడం మంచిది.
- వేసవికాలంలో ఎక్కువగా చెమట పట్టే సమయాల్లో ఈ నగలు వేసుకోవద్దు. చెమట తగిలితే నగలు నలుపుతిరుగుతాయి.
- దుస్తులు ధరించిన తరవాతనే నగలు వేసుకోవాలి. లేదంటే దుస్తులకు ఉండే దారాలు, పోగులు పట్టుకుని నగలు విరిగిపోవచ్చు. నగల్లో ఉండే రాళ్ళు, పూసలు రాలిపోవచ్చు.



- ఒకసారి ధరించిన నగలను భద్ర పరచేముందు వాటిని వెల్వెట్ వస్త్రం లేదా పలుచని కాటన్ గుడ్డతో మెల్లగా తుడవాలి. నగలకు అంటుకున్న చెమట, దుమ్ము లాంటి వాటిని పూర్తిగా తొలగించాలి. లేదంటే నగలు మెరుపును కోల్పోయి పాత బడతాయి.
- గిల్టు నగలను అన్నింటినీ ఒకే బాక్సులో పెట్టకూడదు. అలా పెడితే ఒకదానికి మరోటి రాసుకుని వాటి మీద గీతలు పడతాయి. మెరుపుదనం తగ్గుతుంది. నగలను వాటికి నిర్దేశించిన బాక్సుల్లో మాత్రమే జాగ్రత్త చేయాలి.
- ఈ నగలను గాలి, వెలుతురు చొరబడని పెట్టె లేదా సంచిలో పెట్టి ఉంచితే ఎక్కువకాలం మన్నికగా ఉంటాయి. పలుచని గుడ్డలో చుట్టి పెడితే వాటి మెరుపుదనం చాలాకాలం వరకూ నిలిచి ఉంటుంది.

అభిరుచి

ప్రపంచమంతా చుట్టేయాలని ఎవరికి ఉండదు!
కానీ ఎంతమందికి అది సాధ్యమవుతుంది?
అందుకే ఈ జంట విభిన్నంగా ఆలోచించింది.
పర్యాటక ప్రదేశాల సందర్శన కోసం ఇంటినే వదిలేసింది.
దానికి పెట్టే అద్దె డబ్బులతో... నిరంతరం పర్యటనల్లోనే గడుపుతోంది.
దీని వెనుక ఉన్న కథ ఏంటో జంటలో ఒకరైన హేమని చావ్డా మాటల్లోనే...

జగమంత కుటీరం మాది

"చదువుకొనే రోజుల్లో మార్కుల రేసులు... పోటీ పరీక్షలు... ఆ తరువాత వృత్తిపరమైన ఎదుగుదల కోసం అలుపెరుగని ప్రయత్నాలు... సగటు మనిషి జీవితం ఇదే కదా. చిన్నప్పటి నుంచీ చూసి చూసి విసుగెత్తిపోయాను. అందరిలా కెరీర్ వెంట పరుగెత్తడం... ఊహ తెలిసినప్పటి నుంచీ దాని కోసమే ప్రణాళికా రచనలో మునిగిపోవడం... డిగ్రీ చదివే రోజుల్లోనే జీవితం అంటే ఇది కాదనిపించింది. ఛత్తీస్‌ఘడ్ రాజధాని రాయ్‌పూర్ మాది. మూస ఉద్యోగాలకు భిన్నంగా చదువు అవ్వగానే ఆర్జీగా కెరీర్ ప్రారంభించాను. అందులో ఊహించినంత కిక్ దొరకలేదు. దాంతో ట్రావెల్ బ్లాగర్‌గా మారాను. తరచూ కొత్త ప్రాంతాలకు వెళ్లడం, అక్కడి ప్రత్యేకతలను సామాజిక మాధ్యమాల్లో అందరితో పంచుకోవడం... చాలా ఉత్సాహంగా, ఉల్లాసంగా అనిపించింది. దాంతో ఆర్జీగా స్వస్తి చెప్పి ట్రావెల్ బ్లాగింగ్‌కు పూర్తి సమయం కేటాయించాలని అనుకున్నాను.

ఆయనదీ అదే దారి...

ఇక నా భర్త సాగర్ పటేల్‌కు కూడా పర్యటనలంటే చాలా ఇష్టం. ఆయన సొంతూరు మధ్యప్రదేశ్‌లోని ఝబువా. భౌగోళిక సమాచార రంగంలో పని చేసేవారు. మా ఇద్దరినీ కలిపింది మా అభిరుచే. ఆయన ఆధ్యాత్మిక పర్యాటకంపై వీడియోలు చేసి ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌ల్లో అప్‌లోడ్ చేసేవారు. నేనేమో పిల్లా పెద్ద అందరూ కలిసి ఆస్వాదించే ప్రాంతాలను చుట్టివచ్చేదాన్ని. అనుకోకుండా ఇద్దరం ఒక ఊరు వెళ్లినప్పుడు కలిశాం. ముందు అభిరుచులు కలిశాయి. తరువాత మనసులు ముడిపడ్డాయి. రెండున్నరేళ్ల కిందట ఇద్దరం పెళ్లి చేసుకున్నాం. అప్పటివరకు విడివిడిగా పర్యటించిన మేము... పెళ్లి తరువాత నుంచి ఎక్కడికైనా కలిసి వెళుతున్నాం. మా వృత్తుల కంటే ఇలా విహరించడమే మాకు బాగా నచ్చింది. అందుకే ట్రావెల్ బ్లాగింగ్‌కే పూర్తి స్థాయి సమయం కేటాయించాలని నిర్ణయించుకున్నాం.

ఇల్లు ఖాళీ చేసి...

అంతకుముందు మేమిద్దరం అహ్మదాబాద్‌లోని ఓ అద్దె ఇంట్లో ఉండేవాళ్లం. నెలకు అద్దె 40 వేలు. మెయింటెనెన్స్, పని మనిషి, కరెంటు... మరో పది వేలు అయ్యేవి. ఇవి కాకుండా సరుకులు, ఇతర నిత్యావసర వస్తువులు...అన్నీ కలుపుకొంటే దాదాపు లెక్క లక్ష తేలేది. ఇంతా చేసి నెలలో కనీసం ఓ వారం రోజులు కూడా మేం ఇంట్లో ఉండేవాళ్లం కాదు. పెళ్లయ్యాక మొదటి ఏడాదంతా జీవితంలో స్థిరపడాలనే ప్రయత్నాలతోనే సరిపోయింది. దాని కోసం ఎన్నో ప్రణాళికలు. లేచింది మొదలు మెదడులో ఇవే తిరుగుతుండేవి. ఇలాంటి జీవితం కాదు కదా నేను కోరుకున్నది! ఒక రోజు కూర్చొని ఆలోచిస్తుంటే... ఇద్దరి దారి, గమ్యం ఒకటే అయినప్పుడు ఇవన్నీ అవసరమా అనిపించింది. నెల తిరిగే సరికి ఇంత ఖర్చు భరించడం అంటే... తెలియకుండానే మాపై ఆర్థికంగా, మానసికంగా ఒత్తిడి పెరుగుతోంది. దీనివల్ల చేసే పని మీద ఏకాగ్రత కుదరడం లేదు. అన్నీ బేరీజు వేసుకున్నాక... ఇల్లు ఖాళీ చేయాలనే నిర్ణయానికి వచ్చాం. మాకున్న కొద్దిపాటి సామాను అత్తగారి ఇంట్లో పెట్టాం.

అద్దె డబ్బుతో...

ఇకపై పూర్తిగా పర్యటనల్లోనే గడపాలని ఇద్దరం అనుకున్నాం. అలా ఐదు నెలల కిందట ఇల్లు ఖాళీ చేసేశాం. అప్పటి నుంచి నిరంతరాయంగా ఊళ్లు తిరుగుతున్నాం. ఇప్పుడు మాకంటూ ఒక ఇల్లు లేదు. మేం ఎక్కడికి వెళితే అక్కడే మా నివాసం. ఎలాంటి బరువు, బాధ్యతలూ లేవు. నెల నెలా మేం కట్టే అద్దె డబ్బులతో నచ్చిన ప్రాంతాలన్నీ సందర్శిస్తున్నాం. 'మేం ఇలా గడపాలనుకున్నాం' అని మా పెద్దవాళ్లను కూడా ఒప్పించాం. అప్పుడప్పుడూ వారిని కూడా మాతో తీసుకువెళుతుంటాం. కొన్ని ఊళ్లకు తరచూ వెళుతుండంవల్ల స్థానికులతో పరిచయాలు ఏర్పడ్డాయి. దానివల్ల కొన్నిసార్లు కొత్త ప్రాంతానికి వెళ్లిన అనుభూతి కలగదు. అంతా మనవాళ్లే అనిపిస్తుంది. అలాగే బయటివారి కంటే తక్కువ ధరకే వసతి దొరుకుతోంది. మా ప్రయాణ ఖర్చులు, అక్కడి హోటల్‌లో బస, భోజనం... అన్నీ కలుపుకొంటే మేం కట్టిన అద్దె డబ్బు కంటే మించడంలేదు. సరుకులు కొనాల్సిన అవసరం లేదు. ఇద్దరికీ కలిపి ఒక సూట్‌కేస్, ఒక బ్యాక్‌ప్యాక్. ఇదే మా సంసారం.

లక్షల్లో ఫాలోవర్స్...

ప్రస్తుతం మేం తీసే వీడియోలన్నీ నా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తున్నాం. అక్కడ నాకు దాదాపు మూడున్నర లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ట్రావెల్ బ్లాగింగ్‌ను ఫుల్‌టైమ్ కెరీర్‌గా మార్చుకున్నాక ఫాలోవర్స్ విపరీతంగా పెరిగారు. మా ఆలోచనకు అభినందనలు తెలుపుతున్నారు. 'మీది సాహసోపేత నిర్ణయం' అంటూ పొగుడుతున్నారు. ఆ కామెంట్లు చూసినప్పుడు... 'ఇల్లు, కెరీర్‌ను వదిలేసి కొత్త మార్గంలో పయనిస్తున్నామంటే... నిజంగానే మాది సాహసమే కదా' అనిపిస్తుంది. అయితే జీవితం మొత్తాన్నీ ఒక సూట్‌కేసులో పెట్టేసి జీవించడమంటే అంత సులువు కాదు. కానీ ఒక్కటి నిజం... లగేజీ ఎంత తక్కువ ఉంటే ప్రయాణం అంత సౌకర్యంగా ఉంటుంది. ఏదిఏమైనా మా పర్యాటక అభిరుచిని జీవితాంతం కొనసాగించాలన్నదే మా ధ్యేయం. ఎందుకంటే ఇలాంటి అద్భుత అవకాశం అందరికీ రాదు కదా."

ప్రయోగాత్మకంగా...



మేం మొదలుపెట్టినప్పుడు ఎన్ని రోజులు కొనసాగిస్తామో తెలియదు. ప్రయోగాత్మకంగా ఏడాది పాటు ఇలా చేసి చూద్దామని అనుకున్నాం. ఐదు నెలలు గడిచిపోయాయి. రోజు రోజుకూ ఉత్సాహం, ఆసక్తి పెరుగుతున్నాయే కానీ తగ్గడంలేదు. కుదిరితే జీవితాంతం ఇలా పర్యటనల్లోనే గడిపేయాలని కోరుకొంటున్నాం. పర్యటిస్తూనే మేం సంపాదించుకొంటున్నాం. వెళ్లదలుచుకున్న చోట రెస్టారెంట్లు, దర్శనీయ స్థలాల నిర్వాహకులను సంప్రతిస్తాం. వారు కోరితే వాటికి ప్రచారం కల్పిస్తాం. వారి సామాజిక మాధ్యమాల ఖాతాలను నిర్వహిస్తాం. సాంకేతికంగా మాకు మంచి నైపుణ్యం ఉంది. ఈ సేవలకు గానూ వారు మాకు కొంత మొత్తం చెల్లిస్తారు. రెస్టారెంట్లు, కేఫ్‌ల్లో తాత్కాలికంగా హెల్పర్‌గా పని చేస్తాం. ఇవే మా ఆదాయ మార్గాలు.





ఆరాధ్యుల వెంకటేశ్వరరావు, గుర్రాల రవికృష్ణలకు పురస్కారాలు అందజేస్తున్న మంత్రి దుర్గేశ్

సాంస్కృతిక వైభవాన్ని పునరుద్ధరిస్తాం

- సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి దుర్గేశ్
- నాటక రంగంలో 113 మందికి 'కందుకూరి' పురస్కారాలు

విజయవాడ కల్చరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కళలు, సాంస్కృతిక వైభవాన్ని పునరుద్ధరిస్తామని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ పేర్కొన్నారు. కందుకూరి 177వ జయంతి సందర్భంగా ఏపీ రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం 'తెలుగు నాటక రంగ దినోత్సవం-2025' ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గేశ్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో నాటకానికి ఓ ప్రత్యేకమైన స్థానాన్ని కల్పించి, నాటకానికి సామాజిక ప్రయోజనం ఉండాలని విశ్వసించిన రచయిత వీరేశలింగం పంతులు అని కొనియాడారు. తెలుగులో మొట్టమొదటి నాటకం రాసిన కందుకూరిని నాటకరంగ ఆద్యుడుగా అభివర్ణించారు. నాటక రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 113 మందికి మంత్రి అవార్డులు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. రాష్ట్రస్థాయిలో ముగ్గురికి కందుకూరి ప్రతిష్టాత్మక రంగస్థల పురస్కారాలు, జిల్లాస్థాయిలో 110 మందికి కందుకూరి విశిష్ట పురస్కారాలను అందజేశారు.

సచివాలయం, ఐకానిక్ టవర్ల నిర్మాణానికి టెండర్లు

- మే 1న టెక్నికల్ బిడ్లను తెరవనునన్న సీఆర్డీఏ

విజయవాడ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అమరావతిలో నిర్మించతలపెట్టిన సచివాలయం, జీఏడీ ఐకానిక్ టవర్ల నిర్మాణానికి సీఆర్డీఏ టెండర్లు పిలిచింది. సచివాలయం కోసం 4 టవర్లు, జీఏడీ టవర్‌కు వేర్వేరుగా టెండర్ నోటిఫికేషన్లు ఇచ్చింది. మొత్తంగా రూ.4,668 కోట్లతో 5 టవర్లను డయాగ్రిడ్ మోడల్‌లో నిర్మించనున్నారు. సచివాలయ 4 టవర్లను బేస్‌మెంట్+39 ఫ్లోర్లు+టెర్రస్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో 1, 2 టవర్లను 28,41,675 చదరపు అడుగుల విస్తీర్ణం, 3, 4 టవర్లను 23,42,956 చదరపు అడుగుల విస్తీర్ణంతో నిర్మించనున్నారు. సీఎం కార్యాలయం ఉండే కీలకమైన జీఏడీ టవర్‌ను బేస్‌మెంట్+47 ఫ్లోర్లు+హెలిప్యాడ్‌తో కలిపి మొత్తం 17,00,3000 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. జీఏడీ టవర్ నిర్మాణానికి రూ.1,126 కోట్లు, సచివాలయం ఒకటి, రెండు టవర్ల నిర్మాణానికి రూ.1,897 కోట్లు, సచివాలయం టవర్ల కోసం రూ.1,664 కోట్లతో వేర్వేరుగా టెండర్ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. మే 1వ తేదీన సచివాలయం, జీఏడీ టవర్ల టెక్నికల్ బిడ్లను సీఆర్డీఏ తెరవనుంది.

పవన్ కల్యాణ్, మార్క్ శంకర్‌పై అసభ్య పోస్టులు
పోలీసుల అదుపులో కర్నూలు జిల్లా వాసి

- నిందితుడు అల్లు అర్జున్ అభిమానిగా గుర్తింపు

గుంటూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆయన కుమారుడు మార్క్ శంకర్‌పై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన కేసులో కర్నూలు జిల్లా గూడూరుకు చెందిన పుట్టపాశం రఘు అలియాస్ పుష్పరాజ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం గుంటూరు జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలు.. ప్రత్తిపాడుకి చెందిన సాంబశివరావు ఫిర్యాదు మేరకు రఘుని రెస్టు చేశామన్నారు. రఘు.. అల్లు అర్జున్‌కు వీరాభిమాని అని తెలిపారు. 2024 ఎన్నికల సమయంలో అర్జున్ నంద్యాలకు వచ్చి వైసీపీ అభ్యర్థికి మద్దతు తెలిపారు. దీంతో మెగా అభిమానులు అర్జున్‌ని విమర్శించారు. దీంతో రఘు.. మెగా కుటుంబంలోని వ్యక్తులపై అసభ్యకర పోస్టులు పెట్టేవాడని ఎస్పీ పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఈ నెల 8న పవన్ కల్యాణ్ చిన్నకుమారుడు మార్క్ శంకర్‌కు సింగపూర్‌లో అగ్ని ప్రమాదం జరిగిందని, ఇదే అదనుగా మెగా కుటుంబంపై ద్వేషాన్ని వెళ్లగక్కుతూ అనుచిత వ్యాఖ్యలు పోస్టు చేశాడని తెలిపారు.

విశాఖ కేంద్రంగా ప్రకటించిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ పనులు ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా తయారయ్యాయి. విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటు చేయడం ఒడిశాలోని తూర్పు కోస్తా జోన్ అధికారులకు ఆది నుంచీ ఇష్టం లేదు. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ కూడా ఆ రాష్ట్రానికి చెందిన వారే కావడంతో వారు అనుకున్నట్టుగానే చేస్తున్నారు. దీంతో గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు.



విశాఖ రైల్వే జోన్‌కు గెజిట్ ఏదీ?

ఒడిశా అధికారుల మోకాలడ్డు
- కొత్తవలసను కూడా రాయగడ
- డివిజన్‌లో చేర్చాలని డిమాండ్
- మళ్లీ ఆగిన జోనల్ ఆఫీస్ పనులు
- ఉమ్మడి జిల్లాలో రైల్వే స్టాండింగ్
- కమిటీ చైర్మన్ ఉన్నా ప్రయోజనం నిల్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ రైల్వే జోన్ ప్రకటించిన తర్వాత విశాఖలో కార్యాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి ఏళ్ల సమయం పట్టింది. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడ్డాక రైల్వే జోన్‌కు అవసరమైన భూ వివాదాలు పరిష్కరించి అధికారికంగా ముడసర్లోవలో 52 ఎకరాలు అప్పగించింది. దీనిలో కార్యాలయ సముదాయం నిర్మాణానికి ఈ ఏడాది జనవరి 8న ప్రధాని నరేంద్రమోదీ చేతులమీదుగా శంకుస్థాపన చేశారు. రైల్వే జోన్ భవన నిర్మాణానికి రూ.149 కోట్లతో టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్ అక్కడ పనులు ప్రారంభించగా వివాదాలు మొదలయ్యాయి. ఆ భూమి తమదంటూ కొందరు గిరిజనులు పనులను అడ్డుకున్నారు. దీంతో ఎక్కడి యంత్రాలు అక్కడే ఆగిపోయాయి. వైసీపీ హయాంలోనూ గిరిజనులు ఇలాగే అడ్డుపడ్డారు. వారికి ఆ భూములపై హక్కులు లేవని అధికారులు నిర్ధారించారు. అయితే, తాము చాలా కాలంగా ఇక్కడే జీవిస్తున్నామని, ప్రత్యామ్నాయం చూపించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సొంత భవనంతో సంబంధం లేకుండా రైల్వే జోన్‌ను ఆపరేషన్ చేసుకునే అవకాశం ఉంది. వాస్తవానికి రైల్వేలో ఏదైనా కొత్త జోన్ ఏర్పాటు చేసినప్పుడు దానికి సంబంధించి అధికారికంగా ఒక గెజిట్ విడుదల చేస్తా రు. దీనిలో న్యాయపరమైన అంశాలు ఉంటాయి. జోన్ పరిధి, హద్దులు, ఆపరేషన్ తేదీ, తదితర వివరాలు పేర్కొంటారు. గతంలో అన్ని జోన్లకు గెజిట్ ప్రకటించాకే పనులు ప్రారంభించారు. విచిత్రంగా విశాఖలోని దక్షిణ కోస్తా జోన్‌కు మాత్రం ఇప్పటివరకు గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వలేదు. 3 నెలలైనా దాని గురించి ఎవరూ ప్రశ్నించడం లేదు. జోనల్ కొత్త కార్యాలయం నిర్మాణం రెండేళ్లలో పూర్తిచేయాలని నిబంధన పెట్టారు. కానీ, మూడు నెలలైనా అక్కడ మొక్కలు కూడా తొలగించలేదు. గెజిట్‌లో 'ఆపరేషన్ డేట్' ప్రకటిస్తే దాని ప్రకారం రైల్వే అధికారులు పూర్తి చేయాల్సి ఉంటుంది. కానీ, ఉద్దేశపూర్వకంగా గెజిట్ ప్రకటించకుండా తొక్కి పెట్టారు.

కొత్తవలస కావాలని పేచీ

దక్షిణ కోస్తా జోన్ ప్రకటించిన సందర్భంలో వాల్తేరు డివిజన్‌ను విడగొట్టి కొత్తగా ఒడిశాలోని రాయగడ కేంద్రంగా మరో డివిజన్ ఏర్పాటు చేశారు. విజయనగరం జిల్లా కొత్తవలస నుంచి అరకు వరకు రాయగడ డివిజన్‌లో చేర్చారు. అయితే, తాజాగా కొత్తవలస స్టేషన్‌ను కూడా ఈ డివిజన్‌కే ఇవ్వాలని తూర్పు కోస్తా జోన్ అధికారులు భువనేశ్వర్ నుంచి ఒత్తిడి చేస్తున్నారు. దీనికి బలమైన కారణం ఉందన్న చర్చ సాగుతోంది. ఆ పరిసరాల్లో రైల్వే వ్యాగన్ డిపో త్వరలో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. దీంతో కొత్తవలస స్టేషన్ కూడా తమ పరిధిలో చేర్చాలని డిమాండ్ చేస్తున్నారు. అదయ్యాకే గెజిట్‌ను విడుదల చేయించాలనేది ఒడిశా నేతల ప్రణాళికగా ఉన్నట్టు సమాచారం.

మన నేతలు ఏం చేస్తున్నట్టు?

రైల్వే జోన్‌కు శంకుస్థాపన చేసేశాం కాబట్టి తమ పని అయిపోయిందని ఉత్తరాంధ్రకు చెందిన నాయకులు భావిస్తున్నారు. అనకాపల్లి ఎంపీగా ఉన్న సీఎం రమేశ్ సాక్షాత్తూ రైల్వే స్టాండింగ్ కమిటీకి చైర్మన్. ఆయన దీనిపై దృష్టి పెడితే రెండు రోజుల్లో గెజిట్ నోటిఫికేషన్ ఇప్పించే అవకాశం ఉంది. ఉత్తరాంధ్రాలోనే కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ఉన్నారు. ఆయన ఢిల్లీ పెద్దలతో మాట్లాడినా గెజిట్ విడుదల అవుతుంది. ఆ దిశగా దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

లైవ్‌లో అశ్లీల వీడియోలు

- నిషేధిత వెబ్‌సైట్‌కు అమ్ముతున్న ముఠా
- బెంగళూరు కేంద్రంగా ఇద్దరు.. గుంతకల్లులో మరొకరు దందా
- పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామన్న ఈగల్ చీఫ్ రవికృష్ణ

గుంటూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నిషేధిత అశ్లీల వెబ్‌సైట్‌లో మహిళల నగ్న వీడియోలు ప్రత్యక్ష ప్రసారం చేస్తూ సొమ్ము చేసుకుంటున్న ముగ్గురి గుట్టురట్టయింది. రెండేళ్లుగా ఈ అశ్లీల దందా నిర్వహిస్తున్న శ్రీకాకుళం జిల్లా పాతపట్నానికి చెందిన గణేశ్, జ్యోత్స్న, గుంతకల్లుకు చెందిన లూయిస్‌లను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం వారిని మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. వారి దందా వివరాలను ఈగల్ చీఫ్, సైబర్ క్రైమ్ ఇన్‌చార్జ్ ఐజీ ఆకే రవికృష్ణ గుంటూరులోని సీఐడీ కార్యాలయంలో వివరించారు. గణేశ్, జ్యోత్స్న డిగ్రీ చదువుకొని సులువుగా డబ్బు సంపాదించే మార్గాలను అన్వేషించారు. బెంగళూరు కేంద్రంగా సైప్రస్ దేశానికి చెందిన నిషేధిత ఎక్స్‌హ్యామ్‌స్టర్ వెబ్‌సైట్ ద్వారా మహిళల నగ్న వీడియోలను లైవ్ స్ట్రీమింగ్ చేస్తున్నారు. గుంతకల్లులో కాల్ సెంటర్ నిర్వహిస్తున్న లూయిస్ అనే వ్యక్తి కూడా ఈ అశ్లీల వీడియోల దందా నిర్వహిస్తున్నాడు. ఈ ముగ్గురికి వెబ్‌సైట్ నిర్వాహకులు క్రిప్టో కరెన్సీ బిట్‌కాయిన్‌లో చెల్లింపులు చేస్తే.. వాటిని డాలర్లలోకి, ఆపై రూపాయల్లోకి మార్చుకుంటున్నారు. ఇప్పటి వరకు బెంగళూరుకు చెందిన ముఠా రూ. 16 లక్షలు, లూయిస్ రూ. 11 లక్షలు సంపాదించారని పోలీసుల విచారణలో తేలింది. తమకు అందిన సమాచారం మేరకు సీఐడీ సైబర్ క్రైమ్ ఎస్పీ కృష్ణ ప్రసన్న ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బెంగళూరులోని గణేశ్, జ్యోత్స్న స్టూడియోపై దాడి చేసి లైవ్ స్ట్రీమింగ్ పరికరాలు, వెబ్ కెమెరాలు, పోర్న్ వీడియోల డేటా సీజ్ చేశారు. ఇక్కడ ప్రస్తుతానికి ముగ్గురు మహిళా బాధితులను గుర్తించారు. ఈ ముఠాపై ఇప్పటివరకు మూడు ఫిర్యాదులు నమోదయ్యాయని, దర్యాప్తు కొనసాగుతోందని, ఎంత మంది బాధితులు ఉన్నారనేది త్వరలోనే తెలియజేస్తామని ఐజీ ఆకే రవికృష్ణ తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సైబర్ క్రైమ్ బాధితులు 1930కు ఫిర్యాదు చేయొచ్చు

ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఆకే రవికృష్ణ సూచించారు. ఇటీవల బెట్టింగ్ యాప్స్, డిజిటల్ అరెస్టులు, ఓటీపీ ఫ్రాడ్ తదితర ఆర్థిక నేరాలు జరుగుతున్నాయన్నారు. అందువల్ల వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలకు సంబంధించి 1930 కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. న్యాయం జరగని పక్షంలో మంగళగిరిలోని సీఐడీ ప్రధాన కార్యాలయానికి రావచ్చన్నారు. సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టు పెడితే పదేళ్ల తరువాత అయినా అరెస్టు కాక తప్పదని హెచ్చరించారు. యువత డ్రగ్స్, గంజాయి వంటి మాదక పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. వాటిపై ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా 1972 అనే టోల్ ఫ్రీ నంబర్ ఉందన్నారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మందులను విక్రయించవద్దని మందుల షాపులకు సూచించారు. తల్లిదండ్రులూ పిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. సమావేశంలో ఎస్పీ కృష్ణ ప్రసన్న, డీఎస్పీ గోలి లక్ష్మయ్య పాల్గొన్నారు.


మూడేళ్లలో ఏపీ పోలీసుల్లో 33% మహిళలు

- మిగతా రాష్ట్రాలు 24 ఏళ్లకు గానీ కోటా చేరుకోలేవు
- ఇండియా జస్టిస్ నివేదిక-2025 వెల్లడి

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పోలీసు వ్యవస్థలో మహిళా రిజర్వేషన్ కోటా 33 శాతాన్ని ఇప్పటి వరకు ఏ రాష్ట్రం, కేంద్ర పాలిత ప్రాంతం కూడా సాధించలేదని ఇండియా జస్టిస్ నివేదిక-2025 వెల్లడించింది. మరో మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో 33 శాతానికి చేరుకుంటుందని తెలిపింది. అదే సమయంలో మిగతా రాష్ట్రాలు ఈ కోటాను పూర్తిగా అమలు చేయడానికి కనీసం మరో 24 ఏళ్లు అవుతుందని, జార్ఖండ్, త్రిపుర, అండమాన్-నికోబార్‌కు అయితే 200 ఏళ్లు పడుతుందని పేర్కొంది.

నివేదికలోని వివరాలు

- దేశవ్యాప్తంగా 17 శాతం పోలీసు స్టేషన్లలో సీసీటీవీ కెమెరాలు, 30 శాతం స్టేషన్లలో మహిళా హెల్ప్ డెస్కులు లేవు.
- పోలీసు వ్యవస్థలో లింగ వివక్ష అధికంగా ఉంది. దేశవ్యాప్తంగా ఉన్నత స్థాయి పోస్టుల్లో ఉన్న మహిళలు 8 శాతం మాత్రమే. ఏపీలో జాతీయ సగటు కంటే కూడా తక్కువగా ఉంది. ఏపీలో సగటున పోలీసు స్టేషన్‌కు మహిళా ఎస్‌ఐలు 0.2 శాతం, మహిళా కానిస్టేబుళ్లు 2.5 శాతం మాత్రమే.
- ఏపీలో మొత్తం పోలీసు ఉద్యోగుల్లో మహిళలు 21.5 శాతం, పోలీసు అధికారుల్లో 5.2 శాతం, జైలు ఉద్యోగుల్లో 8.4 శాతం ఉన్నారు.
- న్యాయవ్యవస్థలో పెండింగ్ కేసుల సంఖ్య ఎక్కువగా ఉంది. బిహార్‌లో మూడేళ్ల నుంచి పెండింగ్ కేసులు 71 శాతం ఉన్నాయి.
- ఏపీలో కింది కోర్టుల్లో మూడేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న కేసులు 33.5 శాతం. హైకోర్టులో ఐదేళ్ల నుంచి పెండింగ్ కేసులు 50.7 శాతం, 10-20 ఏళ్లలో పెండింగ్‌లో ఉన్నవి 26.7 శాతం, 20 ఏళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్నవి 22.5 శాతం ఉన్నాయి.
- 10 లక్షల మంది ప్రజలకు 50 మంది జడ్జిలు అవసరం కాగా, ప్రస్తుతం 15 మంది జడ్జిలు మాత్రమే ఉన్నారు. ఏపీలో జడ్జి, ప్రజల నిష్పత్తి10.5 శాతంగా ఉంది. ఇది 50 శాతం ఉండాలి.



- జిల్లా న్యాయస్థానాల్లో మహిళా జడ్జిలు 38 శాతం ఉన్నారు.
- ఏపీ హైకోర్టు జడ్జిల్లో మహిళలు 16.7 శాతం, సబ్ కోర్టుల్లో 50.9 శాతం ఉన్నారు.
- పోలీసు, న్యాయ వ్యవస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కోటాను అమలు చేసిన ఏకైక రాష్ట్రం కర్ణాటక.
- దేశవ్యాప్తంగా మహిళా పోలీసుల్లో 89 శాతం మంది కానిస్టేబుల్ స్థాయిలోనే ఉన్నారు.

ఏపీడీఏఎస్‌సీఏపీసీ అప్పటి చైర్మన్‌ను
ప్రతివాదిగా చేర్చండి: హైకోర్టు

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పేషీ సిబ్బందికి జీతాల చెల్లింపు పేరుతో అప్పటి ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల అసిస్టెన్స్ కార్పొరేషన్ (ఏపీడీఏఎస్‌సీఏపీసీ) చైర్మన్ జి.కోటేశ్వరరావు ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారని వచ్చిన ఫిర్యాదును అప్పటి ముఖ్యకార్యదర్శి, విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏఆర్ అనురాధ అర్ధాంతరంగా మూసివేశారని, ఆమెపై చర్యలు తీసుకొనేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ విజయవాడకు చెందిన సిటిజన్ ట్రస్ట్ ప్రెసిడెంట్ కె.దామోదర రావు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ పిల్ బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది జె.సుధీర్ వాదనలు వినిపించారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన అప్పటి చైర్మన్ ఎవరు? ఆయనను ప్రతివాదిగా చేర్చారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. లేదని పిటిషనర్ తరఫు న్యాయవాది బదులిచ్చారు. దీంతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం అప్పటి ఏపీడీఏఎస్‌సీఏపీసీ చైర్మన్‌ను ప్రతివాదిగా చేర్చాలని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 23కి వాయిదా వేసింది.

ఆర్టీజీఎస్ సీఈవోగా ప్రభాకర్ జైన్

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రియల్ టైమ్ గవర్నెన్స్ సీఈవోగా ప్రభాకర్ జైన్ నియమితులయ్యారు. ప్రస్తుతం బాపట్ల జిల్లా జేసీగా ఉన్న ఆయన ఆర్టీజీఎస్ సీఈవోగా నియమితులయ్యారు. అలాగే, నెల్లూరు మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న షైలవరపు సూర్యతేజను ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ ఎండీగా ప్రభుత్వం బదిలీ చేసింది. అక్కడు ఉన్న ఐఆర్ఎస్ అధికారి ఎం.రమణరెడ్డిని జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించింది.

టీటీడీకి డ్రోన్ వర్రీ!

(మొదటి పేజీ తరువాయి)


యాంటీ డ్రోన్ సిస్టమ్

కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ఇటీవల కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడికి సైతం ఇదే విషయమై లేఖ రాసింది. ఈ అంశం కేంద్రం, టీటీడీ మధ్య నలుగుతుండగానే గత ఐదారేళ్లుగా తిరుమల కొండపై డ్రోన్ల సంచారం అధికారులను కలవరపెడుతోంది. భక్తులు డ్రోన్లతో కొండపైకి రావడాన్ని టీటీడీ కొన్నేళ్ల క్రితమే నిషేధించింది. అయితే అలిపిరి భద్రతా సిబ్బంది నిర్లక్ష్యంతో కొందరు డ్రోన్లతో నేరుగా తిరుమలకు చేరుకుంటున్నారు. ఈ కారణంగా శ్రీవారి ఆలయంతో పాటు పరిసర ప్రాంతాల్లో అనేకమార్లు డ్రోన్లు ఎగిరిన ఘటనలు చోటుచేసుకున్నాయి.

అసాంఘిక శక్తులైతే?

ఇప్పటివరకు తిరుమలలో డ్రోన్లను ఎగువేసిన వ్యక్తులకు మరో ఉద్దేశమేమీ లేదని వెల్లడైంది. ఒకవేళ వారిలో అసాంఘిక శక్తులు ఉంటే కొండపై భద్రత పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. తిరుమలకు ఉగ్ర ముప్పు ఉందని ఇంటెలిజెన్స్ వర్గాల హెచ్చరికల నేపథ్యంలో అలిపిరిలో భద్రత తనిఖీలు దాటుకుని మరీ డ్రోన్లు తరచూ క్షేత్రంపై సంచరించడం పెనుప్రమాదాలకు దారితీస్తుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. తాజా డ్రోన్ ఘటనతో యాంటీ డ్రోన్ సిస్టమ్స్‌పై టీటీడీ మళ్లీ దృష్టి సారించింది. వాస్తవానికి 2021లోనే తిరుమలలో యాంటీ డ్రోన్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని భావించినా... అమలు కాలేదు. ఆ తర్వాత సోషల్ మీడియాలో డ్రోన్ విజువల్స్ ప్రత్యక్షనప్పుడు అప్పటి అధికారులు నావల్ యాంటీ డ్రోన్ సిస్టమ్ (ఎన్ఏడీఎస్)ను ఏర్పాటు చేస్తామని ప్రకటించినా అమలు కాలేదు.

భద్రతా వైఫల్యమే: భానుప్రకాశ్‌రెడ్డి

తాజా ఘటనపై టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి స్పందించారు. ఇది పూర్తిగా భద్రతా వైఫల్యమేనని అన్నారు. యాంటీ డ్రోన్ టెక్నాలజీపై డీఆర్డీవో మాజీ చైర్మన్ సతీశ్‌రెడ్డిని సంప్రదించామని, వచ్చే బోర్డు సమావేశంలో దీనిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. డ్రోన్‌ను డ్రాప్ చేసే టెక్నాలజీని మాత్రమే వినియోగిస్తే అవి ఆలయ పరిసర ప్రాంతాల్లో పడే అవకాశముంటుందని, అలా కాకుండా అసలు డ్రోన్లు పనిచేయకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే కొన్ని ప్రాంతాల్లో భద్రతా వైఫల్యాలు కూడా గుర్తించామని, సిబ్బంది సంఖ్యను పెంచడంతో పాటు అలిపిరిలో అధునాత స్కానర్లు అందుబాటులోకి తీసుకువచ్చి తనిఖీలను పటిష్ఠం చేస్తామని వివరించారు.

ఇవీ ఘటనలు

- 2020 డిసెంబరులో వైసీపీ ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి అనుచరులు తిరుమలకు డ్రోన్ తీసుకొచ్చి గోగర్భం వద్ద ఎగురవేశారు.
- 2023 జనవరిలో శ్రీవారి ఆలయ డ్రోన్ విజువల్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సర్వే కోసమని ఓ సంస్థకు అనుమతి ఇచ్చిన అప్పటి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆ సంస్థ సిబ్బంది గోగర్భం ప్రాంతంలో కాకుండా డ్రోన్‌ను నేరుగా ఆలయంపైకే తీసుకువెళ్లి ఆ విజువల్స్‌ను సోషల్ మీడియాలో పోస్టు చేశారు.
- 2024 జనవరిలో హరియాణాకు చెందిన ఓ జంట ఘాట్‌రోడ్డులో డ్రోన్‌ను ఎగరేయడం కలకలం రేపింది.
- తాజాగా, రాజస్థాన్‌కు చెందిన ఓ యూట్యూబర్ ఆలయంపై పది నిమిషాల పాటు డ్రోన్‌ను ఎగురవేయడంతో మరోసారి తిరుమల భద్రతకు సవాల్ విసిరినట్టయింది.

టీసీఎస్ గేమ్ చేంజర్

- రాష్ట్ర ఐటీ రంగానికి చోదక శక్తి
- ఐటీ హబ్‌గా విశాఖపట్నం
- ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాలు: లోకేశ్



అమరావతి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఐటీ రంగంలో రాష్ట్ర గేమ్ చేంజర్‌గా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) మారుతుందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. విశాఖలో 21.6 ఎకరాల భూమిని టీసీఎస్‌కు కేటాయించడంతో రాష్ట్ర ఐటీ రంగానికి ప్రత్యేక శక్తి వచ్చిందన్నారు. ఐటీ హబ్‌గా విశాఖ రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు. రానున్న ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా ఐటీ రంగాన్ని విస్తృతం చేసే చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఎన్నికల సమయంలో రాష్ట్రంలో ఐదేళ్లలో 20 లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేరుస్తామని తెలిపారు. ఇందులో భాగంగా ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 5 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు కార్యాచరణను రూపొందిస్తున్నామని లోకేశ్ పేర్కొన్నారు. గడచిన ఐదేళ్ల రాష్ట్రంలో ఐటీ రంగం ఉనికి లేకుండా పోయిందని, కూటమి హయాంలో రాష్ట్రంలో సాంకేతిక రంగాన్ని విస్తరిస్తామని తెలిపారు.







చిత్రజ్యోతి
SINCE 1965

మెరుగైన కంటెంట్.. భవిష్యత్తు కోసం ఏఐ



ప్రేక్షకులకు సరికొత్త వినోదం అందించడం కోసం చిత్ర పరిశ్రమ ఎప్పటికప్పుడు నూతన మార్గాలు అన్వేషిస్తుంటుంది. ఒకప్పుడు కలర్, సినిమా స్కోప్, 70 ఎం.ఎం, డి.టి.ఎస్, డి.ఐ ఇలా రకరకాల సాంకేతిక హంగులను సమకూర్చుకుని థియేటర్‌కు వచ్చే ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి కలిగించడానికి కృషి చేస్తోంది చిత్ర పరిశ్రమ. ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన సరికొత్త సాంకేతిక సదుపాయం ఏ.ఐ. ప్రస్తుతం ప్రతి ఒక్కరినీ ఆకర్షిస్తున్న ఏ. ఐ. విధానం భవిష్యత్‌ను శాసిస్తుందని కూడా కొందరు అంటున్నారు. ఏ.ఐ టెక్నాలజీ కోసం పెద్ద పెద్ద సంస్థలు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న నేపథ్యంలో నిర్మాత దిల్ రాజు దృష్టి కూడా దీనిపై పడింది. కొత్తను ఆహ్వానించడం, అనుసరించడంలో మిగిలిన వారి కంటే ముందు ఉండాలనే తపన కలిగిన ఆయన తాజాగా ఇప్పుడు ఏ.ఐ ప్రొడక్ట్ కంపెనీని ఏర్పాటు చేశారు. తెలుగు సినిమాలకు ఏఐ టెక్నాలజీకి సంబంధించిన పనులు చేసే 'క్వాంటమ్ ఏ వన్' కంపెనీతో ఆయన చేతులు కలిపారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఆయన సంస్థ విడుదల చేసిన వీడియో అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా దిల్ రాజు తన ఆలోచనలను పంచుకుంటూ 'ఇది కేవలం మెరుగైన కంటెంట్ గురించి మాత్రమే కాదు. వినోద ప్రపంచానికి అవసరమైన ఏ వన్ వ్యవస్థ నిర్మాణం గురించి కూడా. ఏ వన్ గ్లోబల్ సాంకేతిక నైపుణ్యాలతో భవిష్యత్‌కు సిద్ధంగా ఉన్న పరిష్కారాలను అందించడానికి మేం సిద్ధంగా ఉన్నాం' అని చెప్పారు. కంపెనీ పేరు, ఇతర వివరాలు మే 4న వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

మండు వేసవిలో చల్లని సినిమా

ప్రియదర్శి



ప్రియదర్శి, రూప కొడవాయూర్ జంటగా మోహన్‌కృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సారంగపాణి జాతకం'. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించారు. వీకే.నరేశ్, వెన్నెల కిశోర్, అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 25న సినిమా విడుదలవుతోంది. బుధవారం ట్రైలర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు ఇంద్రగంటి మోహన్‌కృష్ణ మాట్లాడుతూ "ఇదో విభిన్న తరహా కామెడీ క్రైమ్ చిత్రం. అన్ని రకాలుగా మెప్పిస్తుంది" అని అన్నారు. "ఇంటిల్లిపాదీ కలసి చూసేందుకు ఓ మంచి చిత్రాన్ని మీ ముందుకు తెస్తున్నాం. సినిమా విజయంపై పూర్తి నమ్మకం ఉంది" అని నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ చెప్పారు. "మండు వేసవిలో చల్లటి అనుభూతినిచ్చే సినిమా ఇది. తప్పకుండా అందరినీ ఆకట్టుకుంటుంది" అని హీరో ప్రియదర్శి తెలిపారు.

కథే ఈ సినిమాకు హీరో



- శివ రాజ్‌కుమార్

శివరాజ్‌కుమార్, ఉపేంద్ర, రాజ్.బి.శెట్టి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న సినిమా '45'. అర్జున్ జన్యా దర్శకత్వంలో ఉమా రమేశ్ రెడ్డి, ఎం.రమేశ్ రెడ్డి నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో హీరో శివరాజ్‌కుమార్ మాట్లాడుతూ "ఈ సినిమాలో సరికొత్త కథనాన్ని చూస్తారు. కథే ఈ సినిమాకు హీరో" అని చెప్పారు. "అందర్నీ మెప్పించే అంశాలున్న సినిమా ఇది" అని హీరో ఉపేంద్ర చెప్పారు. "వాణిజ్యాంశాలు ఉంటూనే కొత్తదనాన్ని పంచే చిత్రమిది" అని దర్శకుడు అర్జున్ జన్యా తెలిపారు.

ఆ పాఠమేంటో తెలియాలంటే సినిమా చూడాలి

- త్రినాథరావు నక్కిన



దర్శకుడు త్రినాథరావు నక్కిన నిర్మాతగా వ్యవహరించిన చిత్రం 'చౌర్య పాఠం'. ఇంద్రరామ్, పాయల్ రాధాకృష్ణ జంటగా నిఖిల్ గొల్లమారి తెరకెక్కించారు. ఈ నెల 25న సినిమా విడుదలవుతోంది. బుధవారం సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత త్రినాథరావు నక్కిన మాట్లాడుతూ "ఈ మధ్య థియేటర్లకు ప్రేక్షకులు రావడం బాగా తగ్గిపోయింది. అలాంటి సమయంలో చిన్న సినిమా తెరకెక్కించడమంటే సాహసమే. ఈ కథ చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఇందులోని పాత్రధారి ఓ అవసరం కోసం దొంగతనం చేసినప్పుడు తెలుసుకున్న పాఠమే ఈ చిత్ర కథాంశం. ఆ పాఠమేంటో తెలియాలంటే సినిమా చూడండి" అని చెప్పారు. "సినిమా అద్భుతంగా వచ్చింది" అని దర్శకుడు నిఖిల్ గొల్లమారి చెప్పారు.

మధురమైన విజయాన్ని అందుకోవాలి



- వి.వి.వినాయక్

ఉదయ్‌రాజ్, వైష్ణవి సింగ్ జంటగా రాజేశ్ చికిలే దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మధురం'. యం.బంగార్రాజు నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదల కానున్న సందర్భంగా మేకర్స్ ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దర్శకుడు వి.వి.వినాయక్ మాట్లాడుతూ "ఈ 'మధురం' చిత్రం మధురమైన విజయం సాధించాలి. చిత్రంలో భాగమైన వారందరికీ ఆల్ ద బెస్ట్" అని చెప్పారు. దర్శకుడు చికిలే మాట్లాడుతూ "ఈ చిత్రం టీమ్ సమష్టి కృషి. చిత్ర విజయంపై పూర్తి నమ్మకముంది" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు విజయ్‌కుమార్ కొండ, సంగీత దర్శకులు ఆర్.పీ.పట్నాయక్, రఘు కుంచె తదితరులు పాల్గొన్నారు.



గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ కమిటీకి జయసుధ సారథ్యం

- అవార్డ్సుకు కోసం 1248 నామినేషన్లు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్ కోసం 15 మంది సభ్యులతో కూడిన జ్యూరీ సమావేశం ఛైర్‌పర్సన్ జయసుధ ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. గద్దర్ ఫిల్మ్ అవార్డ్సుకు అన్ని విభాగాల్లో కలిపి 1,248 నామినేషన్లు అందాయి. 21వ తేదీ నుంచి నామినేషన్ల స్క్రీనింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. పురస్కారాల కోసం వ్యక్తిగత విభాగంలో 1172, ఫీచర్ ఫిల్మ్, బాలల చిత్రాలు, డాక్యుమెంటరీ/ లఘుచిత్రాలు, ఫిల్మ్ క్రిటిక్స్, పుస్తకాలు తదితర విభాగాల్లో 76 దరఖాస్తులొచ్చినట్లు జ్యూరీ వెల్లడించింది. సమావేశం సందర్భంగా జయసుధ మాట్లాడారు. తనకు అప్పగించిన బాధ్యతను సవాలుగా తీసుకొని ఫిల్మ్ అవార్డుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు ఆమె చెప్పారు. ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్‌రాజు మాట్లాడుతూ.. 14 ఏళ్ల తర్వాత ప్రభుత్వం చలనచిత్ర అవార్డులు ఇవ్వనుందని, ఉమ్మడి రాష్ట్రంలోనూ చలనచిత్ర పురస్కారాల కోసం ఇంత విశేష స్థాయిలో స్పందన రాలేదన్నారు. నామినేషన్లను జ్యూరీ నిష్పాక్షికంగా పరిశీలించాలని.. తెలుగు చలనచిత్ర రంగానికి జాతీయస్థాయి గుర్తింపు తెచ్చే విధంగా వ్యవహరించాలని జ్యూరీ సభ్యులను ఆయన కోరారు.

డ్రగ్స్ తీసుకునే వారితో నటించను

- విన్సీసోనీ అలోషియస్

ఇటీవలె వరుస కాస్టింగ్ కౌచ్, లైంగిక వేధింపుల ఆరోపణలతో మలయాళ చిత్రపరిశ్రమలో తీవ్ర కలకలం రేగిన సంగతి తెలిసిందే. జస్టిస్ హేమ కమిటీ నివేదిక వెలువడిన తర్వాత అక్కడ పరిస్థితులు సద్దుమణిగాయని అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అలాంటి తరుణంలో 'జనగణమన' ఫేమ్, హీరోయిన్ విన్సీసోనీ అలోషియస్ ఓ హీరోపై చేసిన ఆరోపణలు మరోసారి అంతటా చర్చనీయాంశమయ్యాయి. మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన పెంచే ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. ఇటీవల ఓ సినిమాలో తనతో కలసి నటించిన సహనటుడు డ్రగ్స్ తీసుకున్న మత్తులో లైంగికంగా వేధించాడని ఆరోపించారు. డ్రగ్స్ తీసుకునే వారితో ఇకపై ఎప్పటికీ సినిమాలు చేయనని స్పష్టం చేశారు. "ఓ సినిమా షూటింగ్ సమయంలో నేను వేసుకున్న డ్రెస్ అసౌకర్యంగా అనిపించింది. దుస్తులు మార్చుకుందామని డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్తుండగా, ఆ యాక్టర్ 'నేనూ నీకు తోడుగా వచ్చి నీ డ్రెస్ మార్చుకునేందుకు సహాయం చేస్తా' అని సెట్స్‌లో ఉన్న అందరి ముందే మాట్లాడి ఇబ్బందిపెట్టాడు. ఆయన సెట్స్‌లోనే డ్రగ్స్ తీసుకునేవాడు. ఆయనపై చిత్ర దర్శకుడికి, నిర్మాతలకు ఫిర్యాదు చేశా. ఆయనది ప్రధాన పాత్ర కావడంతో, సినిమా ఆగిపోతుందనే భయంతో వారు కూడా ఏమీ చేయలేకపోయారు. ఆ షూటింగ్ జరిగినన్ని రోజులు చాలా ఇబ్బందిపడ్డాను" అని పేర్కొన్నారు. కాగా, 2019లో నటిగా ఇండస్ట్రీలో అడుగుపెట్టారు విన్సీ. పలు చిత్రాల్లో నటించిన ఆమె, 'రేఖ' సినిమాకు ఉత్తమ నటిగా కేరళ స్టేట్ అవార్డును అందుకున్నారు.



నేటి మ్యాచ్
వేదిక ముంబై
ముంబై x హైదరాబాద్ రా.7.30 నుంచి

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
ఢిల్లీ	6	5	1	0	10	0.744
గుజరాత్	6	4	2	0	8	1.081
బెంగళూరు	6	4	2	0	8	0.672
పంజాబ్	6	4	2	0	8	0.172
లఖ్‌నవూ	7	4	3	0	8	0.086
కోల్‌కతా	7	3	4	0	6	0.547
ముంబై	6	2	4	0	4	0.104
రాజస్థాన్	7	2	5	0	4	-0.714
హైదరాబాద్	6	2	4	0	4	-1.245
చెన్నై	7	2	5	0	4	-1.276

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

ఢిల్లీ 'సూపర్'

● రాణించిన రాహుల్, అభిషేక్, అక్షర్
● రాజస్థాన్‌పై ఉత్కంఠ విజయం



అక్షర్ పటేల్ (14 బంతుల్లో 34)

న్యూఢిల్లీ: ఆద్యంతం హోరాహోరీగా సాగిన పోరు.. ఈ సీజన్‌లో జరిగిన తొలి సూపర్ ఓవర్‌లో పైచేయి సాధించిన ఢిల్లీ క్యాపిటల్స్ మళ్లీ గెలుపు బాటపట్టింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌ను ఓడించిన ఢిల్లీ మళ్లీ టాప్‌కు చేరుకొంది. 188 పరుగుల వద్ద ఇరు జట్ల స్కోర్లు సమం కావడంతో.. మ్యాచ్ ఫలితం సూపర్ ఓవర్‌కు దారితీసింది. సూపర్ ఓవర్‌లో మొదట రాజస్థాన్ 11/2 స్కోరు చేయగా.. ఢిల్లీ 4 బంతుల్లోనే 13 పరుగులు చేసి గెలిచింది. స్టబ్స్ సిక్సర్‌తో మ్యాచ్‌ను ఫినిష్ చేశాడు. అంతకుముందు తొలుత ఢిల్లీ 20 ఓవర్లలో 5 వికెట్లకు 188 పరుగులు చేసింది. అభిషేక్ పోరెల్ (49), కేఎల్ రాహుల్ (38), అక్షర్ పటేల్ (14 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 34), ట్రిస్టన్ స్టబ్స్ (34 నాటౌట్) రాణించారు. ఆర్చర్ 2 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో రాజస్థాన్ ఓవర్లన్నీ ఆడి 188/4తో స్కోరు సమం చేసింది. నితీశ్ రాణా (51), యశస్వి జైస్వాల్ (51) అర్ధ శతకాలు వృథా అయ్యాయి. సూపర్ ఓవర్‌లో కట్టుదిట్టంగా బౌలింగ్ చేసిన మిచెల్ స్టార్క్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

అదరగొట్టిన ఓపెనర్లు.. ఛేదనలో ఓపెనర్లు జైస్వాల్, శాంసన్ (31) రాజస్థాన్‌కు అదిరే ఆరంభాన్నిచ్చారు. పవర్‌ప్లేలో ఇద్దరూ పోటీపడి మరీ షాట్లు ఆడుతూ.. 34 బంతుల్లో 61 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే, గాయపడిన శాంసన్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. దీంతో ఆరు ఓవర్లకు రాజస్థాన్ 63/0తో నిలిచింది. మధ్య ఓవర్లలో ఢిల్లీ స్పిన్నర్లు పొదుపుగా బౌలింగ్ చేస్తూ పరుగులను కట్టడి చేశారు. ఈ క్రమంలో రియాన్ పరాగ్ (8)ను అక్షర్ బౌల్డ్ చేసి తొలి బ్రేక్ ఇచ్చాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన రాణాతో కలసి జైస్వాల్ స్కోరు బోర్డును నడిపించాడు. 12వ ఓవర్‌లో సింగిల్‌తో జైస్వాల్ ఫిఫ్టీ పూర్తి చేసుకోగా.. జట్టు స్కోరు సెంచరీ మార్క్ దాటింది. అయితే, కుల్దీప్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు యత్నించిన జైస్వాల్ క్యాచవుట్ అయ్యాడు. దీంతో రెండో వికెట్‌కు 36 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. సాధించాల్సిన రన్‌రేట్ పెరుగుతుండడంతో రాణా ఎదురుదాడికి దిగాడు. అక్షర్ బౌలింగ్‌లో 6,4,4తో 16 పరుగులు రాబట్టిన రాణా.. కుల్దీప్ వేసిన 16వ ఓవర్‌లో 6,4 బాదాడు. దీంతో లక్ష్యం చివరి 5 ఓవర్లలో 45 రన్స్‌కు దిగివచ్చింది. అయితే, హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొన్న రాణాను స్టార్క్ ఎల్బీగా వెనక్కు పంపడంతో ఢిల్లీ మ్యాచ్‌లోకొచ్చింది. కానీ, జురెల్ (26), హెట్‌మయర్ (15 నాటౌట్) జాగ్రత్తగా ఆడుతూ గెలుపు బాటలో నిలిపారు. కాగా, చివరి ఓవర్‌లో 9 పరుగులు కావాల్సి ఉండగా.. స్టార్క్ 8 పరుగులే ఇవ్వడంతో స్కోరు సమమైంది. చివరి బంతికి రెండు పరుగులు అవసరం కాగా.. సింగిల్ తీసిన జురెల్ రనౌటయ్యాడు.



స్టార్క్

అక్షర్ దూకుడు..: రాజస్థాన్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో.. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ ఇన్నింగ్స్ తడబడుతూనే సాగింది. మందకొడి పిచ్‌పై 14 ఓవర్లకు ఢిల్లీ 106/4 స్కోరు మాత్రమే చేసింది. ఈ క్రమంలో 150 కూడా చేరుకోవడం కష్టమేననిపించింది. కానీ, చివరి ఓవర్లలో స్టబ్స్‌తో కలసి కెప్టెన్ అక్షర్ పటేల్ 19 బంతుల్లోనే 41 రన్స్ జోడించడంతో స్కోరు బోర్డు రాకెట్ స్పీడ్‌తో దూసుకెళ్లింది. ఆ తర్వాత అశుతోష్ శర్మ (15 నాటౌట్) జతగా స్టబ్స్ వేగంగా 42 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో ఢిల్లీ ఊహించని రీతిలో 180 పరుగుల మార్క్ దాటింది. వీరిద్దరి దెబ్బకు రాజస్థాన్ చివరి 5 ఓవర్లలో 77 రన్స్ సమర్పించుకొంది. అంతకుముందు పోరెల్, రాహుల్ మూడో వికెట్‌కు 63 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొన్నారు. అయితే, రాహుల్‌ను ఆర్చర్.. పోరెల్‌ను హసరంగ బోల్తా కొట్టించారు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన అక్షర్ ఎడాపెడా షాట్లతో స్కోరు బోర్డులో ఊపుతెచ్చాడు. హసరంగ బౌలింగ్‌లో అక్షర్ 4,4,6తో 19 పరుగులు పిండుకొన్నాడు. తీక్షణ బౌలింగ్‌లో 4,4,6 బాదిన అక్షర్ మరో భారీ షాట్ ఆడే క్రమంలో అవుటయ్యాడు. మెక్‌గుర్క్ (9), కరుణ్ నాయర్ (0) విఫలమయ్యారు.

స్కోరుబోర్డు

ఢిల్లీ: మెక్‌గుర్క్ (సి) జైస్వాల్ (బి) ఆర్చర్ 9, అభిషేక్ పోరెల్ (సి) పరాగ్ (బి) హసరంగ 49, కరుణ్ నాయర్ (రనౌట్) 0, రాహుల్ (సి) హెట్‌మయెర్ (బి) ఆర్చర్ 38, స్టబ్స్ (నాటౌట్) 34, అక్షర్ (సి) జురెల్ (బి) తీక్షణ 34, అశుతోష్ (నాటౌట్) 15, **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 20 ఓవర్లలో 188/5; వికెట్ల పతనం:** 1-34, 2-34, 3-97, 4-105, 5-146; **బౌలింగ్:** ఆర్చర్ 4-0-32-2, తుషార్ 3-0-38-0, సందీప్ 4-0-33-0, తీక్షణ 4-0-40-1, హసరంగ 4-0-38-1, పరాగ్ 1-0-6-0.

రాజస్థాన్: జైస్వాల్ (సి) స్టార్క్ (బి) కుల్దీప్ 51, శాంసన్ (రిటైర్డ్ హర్ట్) 31, పరాగ్ (బి) అక్షర్ 8, నితీశ్ రాణా (ఎల్బీ) స్టార్క్ 51, జురెల్ (రనౌట్) 26, హెట్‌మయెర్ (నాటౌట్) 15, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 20 ఓవర్లలో 188/4; వికెట్ల పతనం:** 0-61 (రిటైర్డ్ హర్ట్), 1-76, 2-112, 3-161, 4-188; **బౌలింగ్:** స్టార్క్ 4-0-36-1, ముకేశ్ 3-0-31-0, మోహిత్ 4-0-38-0, విప్రాజ్ 1-0-13-0, అక్షర్ 3-0-23-1, కుల్దీప్ 4-0-33-1, స్టబ్స్ 1-0-12-0.

'బ్యాట్' పరీక్షలో నరైన్, నోకియా విఫలం



న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో ఫీల్డ్‌లో బ్యాట్ చెకింగ్ నిబంధనతో కోల్‌కతా బ్యాటర్ సునీల్ నరైన్‌కు చేదు అనుభవం ఎదురైంది. మంగళవారం పంజాబ్‌తో మ్యాచ్‌లో ఛేదనకు ముందు బౌండ్రీ అవతల నరైన్, రఘువంశీ బ్యాట్లను రిజర్వు అంపైర్ సయ్యద్ ఖలీద్ బ్యాట్ గేజ్‌తో పరీక్షించాడు. ఇందులో నరైన్ బ్యాట్ విఫలం కాగా.. రఘువంశీ బ్యాట్ పాసైంది. దీంతో బ్యాట్‌ను మార్చాల్సిందిగా నరైన్‌కు అంపైర్ సూచించాడు. కాగా, 16వ ఓవర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన నోకియా బ్యాట్‌ను ఫీల్డ్ అంపైర్ పరీక్షించి తిరస్కరించాడు. దీంతో రిజర్వు ప్లేయర్‌తో హడావిడిగా మరో బ్యాట్‌ను తెప్పించుకొన్నాడు. ఇలా ఇద్దరు కోల్‌కతా ఆటగాళ్లు తమ బ్యాట్లను మార్చాల్సి వచ్చింది. గతంలో డ్రెస్సింగ్ రూమ్‌లో ఇలా బ్యాట్లు నిర్ణీత ప్రమాణాల ప్రకారం ఉన్నాయా? లేదా? అని చెక్ చేసేవారు. కానీ, గత ఆదివారం నుంచి మైదానంలోనే పరీక్షించడం ఆరంభించారు.

భారత్‌కు పోటీగా కెనడా, నైజీరియా

లండన్: 2030 కామన్వెల్త్ క్రీడల ఆతిథ్యానికి భారత్ సహా ఐదు దేశాలు ఆసక్తిని కనబరుస్తున్నట్టు కామన్వెల్త్ స్పోర్ట్స్ తెలిపింది. 2036 ఒలింపిక్స్ కోసం బిడ్ వేయాలనుకొంటున్న భారత్.. ఇందుకు సన్నాహకాల్లో భాగంగా కామన్వెల్త్ క్రీడలను నిర్వహించాలనుకొంటోంది. కానీ, కెనడా, నైజీరియాతో పాటు మరో రెండు దేశాలు పోటీపడుతున్నాయి.

ఐపీఎల్‌కు ఫిక్సింగ్ బెడద?

హైదరాబాద్ వ్యాపారిపై బీసీసీఐ అనుమానం

జాగ్రత్తగా ఉండాలని ఫ్రాంచైజీలకు హెచ్చరిక

క్రికెటర్లు, కోచ్‌లు, వ్యాఖ్యాతలకూ సూచన



న్యూఢిల్లీ: ఈ సీజన్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో మ్యాచ్‌లన్నీ రంజుగా సాగుతున్నాయి. క్రికెట్ అభిమానులంతా ఉత్సుకతతో జట్ల మధ్య పోరును ఆస్వాదిస్తున్నారు. ఇలా సజావుగా సాగిపోతున్న ఈ లీగ్‌లో ఇప్పుడు భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ) జారీ చేసిన హెచ్చరిక షాక్‌కు గురి చేస్తోంది. ఐపీఎల్‌కు ఫిక్సింగ్ ప్రమాదం పొంచి ఉందంటూ సదరు ఫ్రాంచైజీలకు బీసీసీఐ సమాచారమిచ్చిందన్న వార్త సంచలనం రేపుతోంది. జాతీయ మీడియా కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఓ బడా వ్యాపారవేత్త మ్యాచ్‌లను ఫిక్స్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడని బీసీసీఐ అనుమానిస్తోంది. ఈమేరకు అతడు వ్యక్తులను ప్రలోభపెడుతున్నాడని, దాంతో జాగ్రత్తగా ఉండాలని పది ఐపీఎల్ ఫ్రాంచైజీల యజమానులను బీసీసీఐ లేఖ ద్వారా హెచ్చరించింది. అలాగే క్రికెటర్లు, కోచ్‌లు, సహాయ సిబ్బంది, వ్యాఖ్యాతలను కూడా బోర్డు అప్రమత్తం చేసింది. సదరు వ్యాపారవేత్తకు బుకీలతో సంబంధాలున్నట్టు బీసీసీఐ అవినీతి వ్యతిరేక, భద్రతా విభాగం (ఏసీఎస్‌యూ) గుర్తించింది. గతంలో బెట్టింగ్‌లు, మ్యాచ్ ఫిక్సింగ్‌లు చేసిన అనుభవం ఉన్న ఆ వ్యాపారవేత్త.. ఈమారు ఐపీఎల్ జట్లు బస చేస్తున్న హోటళ్లలో, మ్యాచ్‌లు జరిగే స్టేడియాల్లో కనిపించాడని ఫ్రాంచైజీలకు రాసిన లేఖలో పేర్కొంది. అయితే, అతను ఎవరన్నది మాత్రం ఆ లేఖలో బహిర్గతం చేయలేదని సమాచారం.

సోషల్ మీడియా ద్వారా..: సోషల్ మీడియా ద్వారా అతను ఆటగాళ్లకు చేరువయ్యే ప్రమాదం లేకపోలేదని హెచ్చరించింది. ఒకవేళ అతను ఇప్పటికే ఎవరినైనా సంప్రదించి ఉంటే తమకు సమాచారమివ్వాలని సూచించింది. ముఖ్యంగా యువ ఆటగాళ్లు బుకీల వలలో పడి బంగారం లాంటి భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని హితవు పలికింది.

గిఫ్టులు, పార్టీలంటూ...: ఐపీఎల్‌తో సంబంధం ఉన్న వ్యక్తులతో ఆ వ్యాపారవేత్త సన్నిహితంగా ఉండేందుకు కొంతకాలంగా ప్రయత్నిస్తున్నట్టు సమాచారం సేకరించింది. తన వ్యూహాలను అమలు చేసేందుకు హోటల్ సిబ్బందితో పాటు జట్టు సిబ్బందిని కూడా ప్రలోభపెడుతుంటాడని పేర్కొంది. అభిమానినని పరిచయం చేసుకొంటూ ఖరీదైన బహుమతులు అందజేయడం, ఫైవ్‌స్టార్ హోటళ్లలో పార్టీలకు తీసుకెళ్లడం అతడి నైజమని తెలిపింది. ఐపీఎల్ జట్ల యజమానుల కుటుంబ సభ్యులు, క్రికెటర్లు, కోచ్‌లు, సహాయ సిబ్బందితోపాటు కామెంటేటర్లను సంప్రదించడం ఆ వ్యాపారి బెట్టింగ్ వ్యూహంలో ఒక భాగం అని వెల్లడించింది.

గతంలోనూ..: ఐపీఎల్‌లో ఫిక్సింగ్ వార్తలు గతంలోనూ కలకలం రేపాయి. 2013లో రాజస్థాన్ రాయల్స్ ఆటగాళ్లు శ్రీశాంత్, అజిత్ చండీలా, అంకిత్ చవాన్ ఫిక్సింగ్ ఆరోపణలతో ఏకంగా అరెస్టవడం అప్పట్లో సంచలనం సృష్టించింది. అంతేకాదు.. బుకీలతో సంబంధాలున్నాయన్న కారణంగా చెన్నై సూపర్‌కింగ్స్ యజమాని గురు మేయప్పన్, రాజస్థాన్ రాయల్స్ సహ యజమాని రాజ్‌కుంద్రాపై వేటు కూడా పడింది. ఈ సంఘటనల తర్వాత అవినీతి నిరోధక విభాగాన్ని బీసీసీఐ మరింత బలోపేతం చేసింది. ఆటగాళ్లకు కఠిన నిబంధనలను విధించింది.

సురుచి 'డబుల్'

వరల్డ్ కప్‌లో రెండు స్వర్ణాలు కైవసం



లిమా (పెరూ): భారత టీనేజ్ షూటర్ సురుచి సింగ్ ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో రెండు స్వర్ణాలతో సత్తా చాటింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత ఈవెంట్‌లో విజేతగా నిలిచిన సురుచి.. ఆ తర్వాత మిక్స్‌డ్ ఈవెంట్‌లో సౌరభ్ చౌదరితో కలిసి స్వర్ణం నెగ్గడం విశేషం. వ్యక్తిగత ఈవెంట్‌లో సురుచి 243.6 పాయింట్లు స్కోరు చేసి బంగారు పతకం దక్కించుకుంది. 242.3 పాయింట్లతో మనూ భాకర్ రెండోస్థానంలో నిలిచి రజతానికి పరిమితమైంది. చైనా షూటర్ యావో కియాన్‌గ్జున్ కాంస్యం అందుకుంది. ఇక, 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్ స్వర్ణ పతక పోరులో 17-9తో చైనా జోడీని ఓడించి పసిడి దక్కించుకుంది.

హంపి, హారిక విజయాలు

పుణె: ఫిడే మహిళల గ్రాండ్ ప్రీ చెస్ టోర్నీ మూడో రౌండ్‌లో కోనేరు హంపి, హారిక విజయాలు సాధించారు. దివ్యా దేశ్‌ముఖ్‌పై హంపి 53 ఎత్తుల అనంతరం గెలిచింది. ఎన్‌గ్యుల్ సలిమోవా (బల్గేరియా)ను 68 ఎత్తులలో హారిక చిత్తు చేసింది. మూడు రౌండ్ల తర్వాత హంపి (2 పాయింట్లు) రెండో స్థానంలో కొనసాగుతోంది. హారిక (1.5) ఆరో స్థానంలో నిలిచింది.

రేస్ వాక్‌లో నితిన్‌కు రజతం



న్యూఢిల్లీ: భారత యువ రేస్ వాకర్ నితిన్ గుప్తా ఆసియా అండర్-18 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పతకంతో మెరిశాడు. సౌదీ అరేబియాలో జరిగిన ఈ టోర్నీ 5వేల మీటర్ల రేస్ వాక్‌లో 17 ఏళ్ల నితిన్ రెండోస్థానంలో నిలిచి రజతం దక్కించుకున్నాడు. చైనా అథ్లెట్ జూ నింగ్హావో స్వర్ణం, చైనీస్ తైపీకి చెందిన షెంగ్ కిన్ లో కాంస్యం గెలిచారు.

విప్రోకు టారిఫ్ కష్టాలు

జూన్ త్రైమాసిక ఆదాయ అంచనా 3.5% తగ్గింపు

● క్యూ4 లాభం రూ.3,569 కోట్లు
● ఆదాయం రూ.22,504 కోట్లకు..



న్యూఢిల్లీ: ఐటీ సేవల కంపెనీ విప్రో మార్చి 31తో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికానికి రూ.3,569.6 కోట్ల ఏకీకృత నికర లాభం ఆర్జించింది. వార్షిక ప్రాతిపదికన ఇది 25.9 శాతం అధికం. ఆదాయం మాత్రం స్వల్పంగా పెరిగి రూ.22,504.2 కోట్లుగా నమోదైంది. డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంతో పోలిస్తే క్యూ4లో నికర లాభం 6.43 శాతం, ఆదాయం 0.83 శాతం పెరిగాయి. కాగా, క్యూ4లో ఒక్కో షేరుపై ఆర్జన (ఈపీఎస్) రూ.3.4గా ఉంది. క్యూ3తో పోలిస్తే ఇది 6.2 శాతం పెరగగా.. వార్షిక ప్రాతిపదికన 25.8 శాతం వృద్ధి నమోదైంది. గడిచిన త్రైమాసికంలో విప్రో ఐటీ సేవల ఆదాయం (స్థిర కరెన్సీ ఆధారిత) అమెరికన్ కరెన్సీలో 259.65 కోట్ల డాలర్లుగా నమోదైంది. క్యూ3తో పోలిస్తే ఇది 1.2 శాతం, వార్షిక ప్రాతిపదికన 2.3 శాతం తగ్గింది. క్యూ4లో నిర్వహణ లాభాల మార్జిన్ వార్షిక ప్రాతిపదికన 1.1 శాతం పెరిగి 17.5 శాతానికి చేరుకుంది. కాగా, 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి విప్రో నికర లాభం వార్షిక ప్రాతిపదికన 18.9 శాతం పెరిగి రూ.13,135.4 కోట్లకు చేరగా.. ఆదాయం మాత్రం 0.74 శాతం తగ్గి రూ.89,088.4 కోట్లకు పరిమితమైంది.

● గత కొన్ని త్రైమాసికాలుగా ఉద్యోగులను తగ్గించుకుంటూ వచ్చిన విప్రో.. క్యూ4లో నికరంగా 614 మందిని చేర్చుకుంది. క్యూ3లో 15.3 శాతంగా నమోదైన ఉద్యోగుల వలసల రేటు 15 శాతానికి తగ్గింది.

● మార్చి 31 నాటికి విప్రో ఉద్యోగుల మొత్తం సంఖ్య 2,33,346గా నమోదైంది. 2023-24 ఆర్థిక సంవత్సరం చివరినాటికి ఉన్న 2,32,614 మందితో పోలిస్తే గడిచిన ఏడాది కాలంలో ఉద్యోగుల సంఖ్య 732 పెరిగింది.

● మార్చి త్రైమాసికంలో కంపెనీ 395.5 కోట్ల డాలర్ల ఆర్డర్లను దక్కించుకుంది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఇది 13.4 శాతం అధికం. అందులో బడా డీల్స్ మాత్రం 48.5 శాతం పెరిగి 176.3 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి మాత్రం ఆర్డర్లు 3.8 శాతం తగ్గి 1,430 కోట్ల డాలర్లకు పరిమితమయ్యాయి.

● ప్రాంగణ నియామకాల ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో ప్రణాళిక మేరకు 10,000 మంది వరకు ఫ్రెషర్లను నియమించుకున్నట్లు విప్రో చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ (సీహెచ్ఆర్ఓ) సౌరభ్ గోవిల్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనూ ఫ్రెషర్ల నియామకాలు కొనసాగిస్తామన్నారు. ఈ సారి నిర్దిష్ట లక్ష్యమేమీ లేదని తెలిపారు. గతంలో లాగా ఆఫర్ లెటర్లు జారీ చేసి వారిని సంస్థలో చేర్చుకోవడాన్ని వాయిదా వేయకుండా అవసరమైన మేరకు నియామకాలు చేపట్టనున్నట్లు చెప్పారు.

● ఈ జనవరి 17న ఒక్కో షేరుకు ప్రకటించిన రూ.6 మధ్యంతర డివిడెండ్‌నే 2024-25 ఆర్థిక సంవత్సరానికి తుది డివిడెండ్‌గా కూడా పరిగణించనున్నట్లు కంపెనీ స్పష్టం చేసింది.

క్లయింట్లు ఆచితూచి..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జూన్‌తో ముగియనున్న తొలి త్రైమాసికంలో మాత్రం ఐటీ సేవల ఆదాయం 250.5-255.7 డాలర్లకు తగ్గవచ్చని కంపెనీ అంచనా వేసింది. 2024-25 క్యూ4తో పోలిస్తే ఆదాయం 1.5-3.5 శాతం వరకు తగ్గవచ్చని సంస్థ భావిస్తోంది. ట్రంప్ సుంకాల కారణంగా అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు పెరగడమే ఇందుకు కారణమని విప్రో సీఈఓ, ఎండీ శ్రీనివాస్ పల్లియా అన్నారు. "అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలో క్లయింట్లు ఐటీ వ్యయాలపై ఆచితూచి నిర్ణయం తీసుకుంటున్నారు. నిలకడైన, లాభదాయక వృద్ధికి కట్టుబడి ఉంటూనే క్లయింట్లకు మరింత చేరువకావడంపై దృష్టిసారించాం" అన్నారు. ట్రంప్ సుంకాలు వాణిజ్య యుద్ధాలను తీవ్రతరం చేయడంతోపాటు అమెరికా ఆర్థిక వ్యవస్థను మాంద్యంలోకి నెట్టవచ్చన్న భయాలున్నాయి. ఈ పరిణామం అమెరికన్ కంపెనీల ఐటీ వ్యయ నిర్ణయాలపై ప్రభావం చూపవచ్చని, ఐటీ సేవలకు డిమాండ్ తగ్గవచ్చన్న అంచనాలున్నాయి. విప్రోకు అధిక ఆదాయం అమెరికా మార్కెట్ నుంచే సమకూరుతోంది.

కొండెక్కిన పసిడి



రూ.లక్షకు చేరువలో ధర

న్యూఢిల్లీ: పసిడి మార్కెట్‌లో ర్యాలీ కొనసాగుతోంది. 10 గ్రాముల మేలిమి (24 కేరట్స్) బంగారం ధర రూ.లక్షకు చేరువవుతోంది. బుధవారం ఢిల్లీ మార్కెట్‌లో రికార్డు స్థాయిలో రూ.98,100కు చేరింది. మంగళవారంతో పోలిస్తే ఇది రూ.1,650 ఎక్కువ. కిలో వెండి ధర సైతం రూ.1,900 లాభంతో రూ.99,400కు చేరింది. ఈ నెల 11 తర్వాత పసిడి ధర ఒకే రోజు ఈ స్థాయిలో పెరగడం ఇదే మొదటి సారి. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లోనూ పసిడి ధర మండుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం రికార్డు స్థాయిలో 3,328 డాలర్లకు చేరింది. ఈ సంవత్సరం ఇప్పటి వరకు 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.18,710 (23.56 శాతం) పెరిగింది. పసిడి ధర చుక్కలంటడానికి ఈ కింది అంశాలు ప్రధానంగా దోహదం చేస్తున్నాయి.

● అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధ భయాలు
● పెట్టుబడిగా పెరిగిన పసిడి కొనుగోళ్లు.
● ఆర్‌బీఐ సహా అనేక కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు.
● పెరుగుతున్న అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ ఉద్రిక్తతలు.

77000 పైన సెన్సెక్స్

ముంబై: స్టాక్ మార్కెట్ వరుసగా మూడో రోజూ లాభాలతో ముగిసింది. సెన్సెక్స్ 309.40 పాయింట్ల లాభంతో 77,044.29 వద్ద, నిఫ్టీ 108.65 పాయింట్ల లాభంతో 23,437.20 వద్ద ముగిశాయి. సెన్సెక్స్ గత రెండు వారాల్లో ఇంత గరిష్ఠ స్థాయిలో ముగియడం ఇదే మొదటిసారి. ఉదయం నష్టాలతో ప్రారంభమైన సెన్సెక్స్ ఇంట్రాడేలో 77,110.23-76,543.77 మధ్య ఆటుపోట్లకు లోనైంది. బ్యాంకింగ్, ఆయిల్ అండ్ గ్యాస్, ఎనర్జీ, టెలికం, ఆర్థిక సేవల కంపెనీల షేర్లకు బుధవారం చక్కటి కొనుగోళ్ల మద్దతు లభించింది. ఐటీ, క్యాపిటల్ గూడ్స్, ఆటో కంపెనీల షేర్లు మాత్రం అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఈ సంవత్సరం వరుణుడు బాగానే కరుణిస్తాడనే వాతావరణ శాఖ ప్రకటన కూడా ఇందుకు దోహదపడింది.

ఇండస్‌ఇండ్, ఐరెడా షేర్లలో ర్యాలీ : ఇటీవల తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనైన ఇండస్‌ఇండ్ బ్యాంకు, ఐఆర్ఈడీఏఎల్ కంపెనీల షేర్ల బుధవారం మంచి లాభాలతో ముగిశాయి. ఇండస్‌ఇండ్ బ్యాంకు షేర్లు 7.12 శాతం లాభంతో రూ.788.25 వద్ద, ఐఆర్ఈడీఏఎల్ షేర్లు 5.57 శాతం లాభంతో రూ.176.40 వద్ద ముగిశాయి.

'ఐసీఐసీఐ' సేవింగ్ డిపాజిట్ రేటు 0.25% తగ్గింపు

ముంబై: ఐసీఐసీఐ బ్యాంక్ సైతం పొదుపు ఖాతా డిపాజిట్లపై చెల్లించే వడ్డీరేటును 0.25 శాతం తగ్గించింది. కొత్త రేటు బుధవారం నుంచే అమలులోకి వస్తుందని బ్యాంక్ స్పష్టం చేసింది. దీంతో రూ.50 లక్షల లోపు సేవింగ్ డిపాజిట్లపై వార్షిక వడ్డీ 2.75 శాతానికి తగ్గింది. రూ.50 లక్షలకు పైగా డిపాజిట్‌పై వడ్డీ 3.25 శాతానికి దిగివచ్చింది. ఈ నెల 9న ఆర్‌బీఐ రెపో రేటు తగ్గించడంతో బ్యాంక్‌లు ఒక్కొక్కటిగా డిపాజిట్లపై వడ్డీరేట్లు తగ్గిస్తున్నాయి.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	130	విజయవాడ	130
వరంగల్	130	గుంటూరు	130
కరీంనగర్	130	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	130	చిత్తూరు	95
కర్నూలు	130	నెల్లూరు	100
విశాఖపట్నం	124	అనంతపురం	100
గోదావరి	130		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

17వ తేదీ

హైదరాబాద్	405	విజయవాడ	420
వరంగల్	407	గోదావరి	410
చిత్తూరు	460	విశాఖపట్నం	425
		దజను గుడ్లు రూ. 60	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	96,170 ▲	88,150 ▲	1,10,000 ▲
విజయవాడ	98,000 ▲	92,000 ▲	98,000 ▲
విశాఖపట్నం	95,660 ▲	87,690 ▲	96,790 ▲
రాజమండ్రి	95,510 ▲	87,550 ▲	97,600 ▼
ప్రొద్దుటూరు	93,800 ▲	86,110 ▲	98,500 ▲
ముంబై	94,580 ▲	86,630 ▲	96,575 ▲

కేఫిన్‌టెక్ చేతికి సింగపూర్ కంపెనీ

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే కేఫిన్ టెక్నాలజీస్ తన అంతర్జాతీయ ఫండ్ నిర్వహణ కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఇందులో భాగంగా సింగపూర్ కేంద్రంగా పని చేసే యాక్సెంట్ ఫండ్ సర్వీసెస్ పీటీఈ లిమిటెడ్ కంపెనీ ఈక్విటీలో 51 శాతం వాటాను 3.47 కోట్ల డాలర్లకు (సుమారు రూ.297.30 కోట్లు) కొనుగోలు చేసింది. మిగతా 49 శాతం వాటానూ వచ్చే ఐదేళ్లలో మూడు సమాన వాయిదాల్లో కొనుగోలు చేస్తామని కేఫిన్ టెక్నాలజీస్ తెలిపింది. యాక్సెంట్ 18 దేశాల్లోని 260 అంతర్జాతీయ ప్రత్యామ్నాయ పెట్టుబడుల నిర్వహణ సంస్థలకు సేవలు అందిస్తోంది. ప్రస్తుతం ఈ సంస్థలు వివిధ పెట్టుబడులకు సంబంధించి 576 ఫండ్స్ నిర్వహిస్తున్నట్టు పేర్కొంది.

పతంజలి చేతికి మాగ్మా ఇన్సూరెన్స్

న్యూఢిల్లీ :యోగా గురువు బాబా రాందేవ్ నాయకత్వంలోని పతంజలి ఆయుర్వేద్ కంపెనీ బీమా రంగంలోకి ప్రవేశిస్తోంది. మరో ఐదు సంస్థలతో కలిసి మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఈక్విటీలో 98.05 శాతం వాటా కొనుగోలు చేసేందుకు కాంపిటిషన్ కమిషన్ (సీసీఐ) ఆమోదం తెలిపింది. పతంజలితో పాటు ఎస్ఆర్ ఫౌండేషన్, రితి ఫౌండేషన్, ఆర్ఆర్ ఫౌండేషన్, సురుచి ఫౌండేషన్, స్వాతి ఫౌండేషన్ ఈ లావాదేవీలో భాగస్వాములవుతున్నాయి. సీసీఐ గ్రీన్ సిగ్నల్‌తో బీమా రంగంలో ప్రవేశించేందుకు పతంజలి ఆయుర్వేద్‌కు మార్గం సుగమమైంది.

విమానయానంపై రూ.20 లక్షల కోట్ల పెట్టుబడి

ఆసియా-పసిఫిక్, పశ్చిమాసియాపై ఏసీఐ అంచనా.. వచ్చే ఏడాదికి చైనాను అధిగమించనున్న భారత్

న్యూఢిల్లీ: వచ్చే పదేళ్ల కాలంలో ఆసియా-పసిఫిక్, పశ్చిమాసియా ప్రాంతాల్లో మొత్తం 124 కోట్ల మంది ప్రయాణికుల రాకపోకలకు అవసరమైన వసతులు కల్పించేందుకు విమానయాన రంగంలోకి 24 వేల కోట్ల డాలర్ల (రూ.20.40 లక్షల కోట్లు) పెట్టుబడులు రానున్నట్టు ఎయిర్‌పోర్ట్ కౌన్సిల్ ఇంటర్నేషనల్ (ఏసీఐ) అంచనా వేసింది. 68 కోట్ల మంది అదనపు ప్రయాణికుల సామర్థ్యం, 1.4 కోట్ల టన్నుల అదనపు కార్గో సామర్థ్యం జోడు కానున్నట్టు తాజా నివేదికలో తెలిపింది. 30 కీలక ప్రాంతీయ విమానాశ్రయాలపై ఏసీఐ సమగ్ర సర్వే నిర్వహించి ఈ నివేదిక రూపొందించింది. పదేళ్లలో చేసే ఈ భారీ పెట్టుబడి కేవలం కాంక్రీట్, రన్‌వేలకే పరిమితం కాదని; సమగ్ర సామాజిక, ఆర్థికాభివృద్ధికి ఈ పెట్టుబడులు దోహదపడతాయని ఏసీఐ ఆసియా-పసిఫిక్, పశ్చిమాసియా ప్రాంత ప్రెసిడెంట్ ఎస్‌జీకే కిశోర్ అన్నారు. రాబోయే 5-10 సంవత్సరాల కాలంలో భారత్‌లో భారీ విమానయాన హబ్‌లు అభివృద్ధి చెందనున్నాయని ఆయన చెప్పారు. ప్రస్తుతం దేశీయ విమానయాన సంస్థల చేతిలో 1700 కొత్త విమానాలకు ఆర్డర్లున్నాయని ఆయన తెలిపారు.

విమానయానంలో 10.5% వృద్ధి: వచ్చే ఏడాది నాటికి భారత్ విమాన ప్రయాణికుల సంఖ్యలో 10.5% వృద్ధితో పొరుగు దేశం చైనాను అధిగమించనున్నదని ఏసీఐ అంచనా వేసింది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న విమానయాన మార్కెట్లలో భారత్ ఒకటిగా ఉంది.



16 ఆర్థిక సంఘం సభ్యురాలిని సత్కరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్. డీహైడ్రేషన్, జ్వరంతో బాధపడుతున్న పవన్‌కు ఫ్లూయిడ్స్ ఎక్కిస్తున్నారు. దీనికోసం చేతికి అమర్చిన క్యాన్యులాతోనే ఆర్థిక సంఘం భేటీకి ఆయన హాజరయ్యారు.

వికసిత్ భారత్ లక్ష్యసాధనలో గ్రామీణాంధ్ర కీలకం

» పంచాయతీరాజ్ బలోపేతానికి సహకరించండి

» ఆర్థిక సంఘానికి పవన్ కల్యాణ్ వినతి

అమరావతి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ లక్ష్యసాధనలో గ్రామీణాంధ్రప్రదేశ్ పాత్ర కీలకమని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి 16వ ఆర్థిక సంఘం ఆర్థిక సహకారం ఎంతో అవసరమని తెలిపారు. బుధవారం సచివాలయంలో చైర్మన్ అరవింద్ పనగారియా, సీఎం చంద్రబాబుతో కలిసి ఆర్థిక సంఘం సమావేశంలో పవన్ మాట్లాడారు. గ్రామాల సమగ్రాభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం, వలసలు అరికట్టడం, ఆహార భద్రత వంటి లక్ష్యాల సాధన సాధ్యపడుతుందన్నారు. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాల సాధనకు ఆర్థిక సంఘం పూర్తిస్థాయిలో సహకరిస్తుందన్న ఆశాభావం వ్యక్తంచేశారు. పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖ తరఫున తొమ్మిది అంశాలతో కూడిన ప్రతిపాదనలను దాని ముందుంచారు. 'పంచాయతీలే దేశ నిర్మాణానికి పునాదులని నమ్ముతున్నాం. ఎన్ని ఇబ్బందులున్నా.. 2024-25లో దాదాపు రూ.800 కోట్ల ఇంటి పన్ను వసూలు చేశామన్నారు. పంచాయతీరాజ్ సంస్థల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా అడుగులు వేస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా నీటి సరఫరా సదుపాయం కల్పించి వాటిపై స్థానిక సంస్థలకు అజమాయిషీ కల్పించాం. 2026-27 నుంచి 2030-31 వరకు రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు రూ.62,515కోట్ల నిధుల లోటు ఉంటుందని అంచనా. ఉమ్మడి గ్రాంట్లలో అత్యధిక శాతం స్థానిక అవసరాల అభివృద్ధికి వినియోగించాలి. స్థానిక సంస్థలకు నిధులు నేరుగా పంపిణీ చేస్తే అభివృద్ధి పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లే అవకాశం లభిస్తుంది' అని పవన్ వివరించారు.

పీ-4 వేదిక ప్రాంతంలోనే ప్రధాని సభ

» అక్కడి నుంచే మోదీ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మే 2న అమరావతి రాజధాని పనులు పునఃప్రారంభించేందుకు వస్తున్నందున పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశించారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై బుధవారం అమరావతి సచివాలయంలో అధికారులతో సీఎస్ సమీక్షించారు. పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు వైద్యారోగ్యశాఖ కమిషనర్ వీరపాండ్యన్‌ను నోడల్ అధికారిగా నియమించామన్నారు. సాధారణ పరిపాలనాశాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, నోడల్ అధికారి వీరపాండ్యన్ మాట్లాడుతూ అమరావతి సచివాలయం వెనుక పీ-4 కార్యక్రమం జరిగిన ప్రాంతంలోనే ప్రధాని సభా వేదిక ఉంటుందన్నారు. అక్కడి నుంచే ప్రధాని మోదీ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారని తెలిపారు. ప్రధాని సభలో సుమారు 5లక్షల మంది ప్రజలు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రధాన వేదిక వద్ద 50వేల మంది కూర్చునేవిధంగా, మరో లక్ష మంది రోడ్ల వెంబడి నిలబడి ప్రధానికి స్వాగతం పలికేవిధంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ఏలూరు, ప్రకాశం సమీప జిల్లాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా, మిగతా జిల్లాల నుంచి తగినవిధంగా పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

విదేశీ పర్యటనకు చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబ సమేతంగా విదేశీ పర్యటనకు వెళ్లారు. బుధవారం రాత్రి గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు అక్కడినుంచి యూరప్ పర్యటనకు వెళ్తారు. చంద్రబాబుతోపాటు ఆయన సతీమణి భువనేశ్వరి, మంత్రి లోకేశ్ దంపతులు వెళ్లారు. 20న చంద్రబాబు 75వ జన్మదిన వేడుకలను యూరప్‌లోనే జరుపుకోనున్నారు. విదేశీ పర్యటన ముగించుకుని 21న ముఖ్యమంత్రి రాష్ట్రానికి చేరుకుంటారు. కాగా, ఈ నెల 18 నుంచి 20 వరకూ నిర్వహించనున్న జర్నలిస్టుల క్రికెట్ లీగ్ కప్‌ను సీఎం బుధవారం ఆవిష్కరించారు.

రాజ్యసభ స్థానానికి 9న ఉప ఎన్నిక

అమరావతి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన రాజ్యసభ స్థానానికి వచ్చేనెల 9న పోలింగ్ జరగనుంది. కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం ఈ మేరకు షెడ్యూల్ విడుదల చేసింది. 22న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తుంది. 29 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 30న వాటిని పరిశీలిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు మే 2 తుది గడువు. అవసరమైతే మే 9న పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపడతారు. మే 13తో ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుంది. కాగా.. ఈ ఉప ఎన్నికలో పోటీచేయరాదని టీడీపీ నిర్ణయించుకున్నట్లు సమాచారం.మిత్రధర్మంలో భాగంగా బీజేపీకి ఈ సీటు వదిలేయాలని భావిస్తోంది. రాజ్యసభలో సొంతగా బలం పెంచుకునేందుకు బీజేపీ ఈ స్థానాన్ని కోరినట్లు తెలిసింది. ఆ పార్టీ నుంచి ఎవరు పోటీ చేస్తారో ఒకట్రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

మరో 30 ఏఎంసీలకు చైర్మన్లు

» టీడీపీకి 25, జనసేనకు 4, బీజేపీకి 1

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధిష్ఠానం మరో 30 వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ)లకు చైర్మన్లను నియమించింది. బుధవారం విడుదల చేసిన జాబితాలో టీడీపీకి 25, జనసేనకు 4, బీజేపీకి ఒకటి ఇచ్చారు. మొత్తం 218 ఏఎంసీల్లో ఇంకా 103 కమిటీలకు చైర్మన్లను నియమించాల్సి ఉంది. సీఎం చంద్రబాబు విదేశీ పర్యటన ముగించుకుని వచ్చాక ఈ నెలాఖరులో ఈ కమిటీలతో పాటు 21 ప్రధాన దేవాలయాలకు కూడా పాలక మండళ్లను ప్రకటించనున్నారు.

బీజేపీకి కాంగ్రెస్ అంటే భయం: షర్మిల

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): 'భ్రష్ట జుమ్లా పార్టీ... బీజేపీకి కాంగ్రెస్ అంటే భయం పట్టుకుంది. దేశంలో కాంగ్రెస్ ఎదుగుదలను జీర్ణించుకోలేకపోతుంది. అందుకే దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఈడీలను సొంత ఏజెన్సీలుగా వాడుతోంది' అని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల మండిపడ్డారు. బుధవారం ఎక్స్ వేదికగా ఆమె స్పందించారు. 'ప్రతిపక్షంపై బీజేపీ అక్రమ కేసులు బనాయిస్తోంది. నేషనల్ హెరాల్డ్ ఆస్తులను స్వాధీనం చేయడాన్ని, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఈడీ చార్జిషీట్ దాఖలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. కాంగ్రెస్ మీద మీరు చార్జిషీట్ వేయడం కాదు... బీజేపీ మీదే ప్రజలు చార్జ్‌షీట్ వేసే సమయం దగ్గరపడింది' అని షర్మిల వ్యాఖ్యానించారు.

మంత్రి కొండపల్లితో డిజిటల్ గ్రీన్ ప్రతినిధుల భేటీ

తక్కువ ఖర్చుతో నాణ్యమైన వ్యవసాయ దిగుబడులు సాధిస్తూ, మార్కెటింగ్ సదుపాయాలను కల్పిస్తూ అంతర్జాతీయంగా పనిచేస్తున్న డిజిటల్ గ్రీన్ ప్రతినిధులు బుధవారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో సమావేశమయ్యారు. సన్న, చిన్నకారు రైతులకు డిజిటల్ గ్రీన్ ఒక గ్లోబల్ అభివృద్ధి సంస్థగా నిలుస్తోందని, సాంకేతిక, డేటా ద్వారా వ్యవసాయదారులు సాధికారత సాధించేలా కృషి చేస్తోందని తెలిపారు. మూడేళ్లుగా రాష్ట్ర ఉద్యానవన శాఖతో కలిసి ఇ-మిర్చి ప్రాజెక్టులో భాగంగా మిరప, పసుపు, టమాటా రైతులకు సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా రెండు ముఖ్యమైన యాప్‌లు అభివృద్ధి చేశామని వివరించారు. రైతుల కోసం ఏఐ ఆధారిత సలహా ప్లాట్‌ఫారం, రైతు ఉత్పత్తిదారుల సంస్థల సామర్థ్యాన్ని బలోపేతం చేసేందుకు మరో యాప్ రూపొందించినట్లు పేర్కొన్నారు.

కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు సగమివ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

వాటికి 24.3 శాతం దక్కేదని.. 15వ ఆర్థిక సంఘానికి వచ్చేసరికి 15.8 శాతానికి తగ్గిందని చెప్పారు. ఆంధ్ర వాటా దేశ జీడీపీ, జాతీయ జనాభా వాటా కంటే తక్కువగా ఉందని.. ఇది ఆర్థికంగా తమకు నష్టం కలిగిస్తోంది కనుక ఈ విభాగంలో ఏపీకి న్యాయం చేయాలని కోరారు. చైర్మన్ అరవింద్ పనగారియా నేతృత్వంలోని 16వ ఆర్థిక సంఘం బృందం నాలుగు రోజుల పర్యటన కోసం బుధవారం రాష్ట్రానికి వచ్చింది. మొదటి రోజు సచివాలయానికి వచ్చిన ఈ బృందానికి సీఎం స్వయంగా మొదటి బ్లాక్ వద్ద స్వాగతం పలికారు. తర్వాత అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకం మొదలైనవాటిపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను చూపించారు. రాజధాని విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలు, విభజన ప్రభావం, ఆర్థిక సవాళ్లు, 2014 తర్వాత వృద్ధిరేటులో రాష్ట్రం సాధించిన ప్రగతి, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, 2019-24 నడుమ నాటి ప్రభుత్వ విధానాల కారణంగా రాష్ట్ర ప్రజలకు, ఆర్థిక వ్యవస్థకు జరిగిన నష్టం, గత 10 నెలల్లో తమ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, స్వర్ణాంధ్ర విజన్-2047, మౌలిక వసతుల ప్రాజెక్టులు, పెట్టుబడులకు ఉన్న అనుకూలతలు, ప్రభుత్వ పాలసీలను ప్రజెంటేషన్ ద్వారా విశదీకరించారు. 2019-24 మధ్య జరిగిన విధ్వంసం కారణంగా ప్రస్తుతం రాష్ట్రం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు అదనపు సాయం అందించాలని ఆర్థిక సంఘాన్ని సీఎం కోరారు. రాష్ట్ర విభజన కారణంగా హైదరాబాద్ నగరాన్ని కోల్పోవడంతో రాష్ట్రం రెవెన్యూ లోటు కోరల్లో చిక్కుకుందన్నారు. 2025-26లో రెవెన్యూ లోటు రూ.1,28,146 కోట్లు ఉంటుందనేది అంచనాగా పేర్కొన్నారు. 2026-27లో రూ.1,29,725 కోట్లు, 2027-28లో రూ.1,33,345 కోట్లు, 2028-29లో రూ.1,37,005 కోట్లు, 2029-30లో రూ.1,42,073 కోట్ల లోటు ఉంటుందన్నారు. ఇంత భారీ లోటును తట్టుకునే సామర్థ్యం రాష్ట్రానికి లేదని, ఈ అగాధాన్ని పూడ్చేలా అధిక నిధులు సిఫారసు చేయాలని అభ్యర్థించారు. పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకానికి సాయం అందించాలని విజ్ఞప్తిచేశారు. ఇంకా ఏం కోరారంటే..

స్థానిక సంస్థలకు ఊతం..

గ్రామీణ స్థానిక సంస్థలకు గ్రాంట్లు కేటాయించేటప్పుడు 70 శాతం వెయిటేజీ జనాభాకు.. 20 శాతం వ్యవసాయం, అనుబంధ రంగాలకు.. 10 శాతం వెయిటేజీ ప్రాంతానికి ఇవ్వాలి. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లకు రూ.69,897 కోట్ల నిధులు అవసరం కాగా, రూ.7,381 కోట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మరో రూ.62,516 కోట్లు అవసరం. పట్టణ స్థానిక సంస్థల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రహదారుల నిర్మాణం, పట్టణ రవాణా, వీధి లైట్లు, మురుగునీటి పారుదల వ్యవస్థల కోసం రూ.19,871 కోట్ల గ్రాంట్లు అవసరం. 2026-31 మధ్య ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు రూ.16,181 కోట్లు కావాలి. రాజధాని అమరావతిలో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు రూ.77,249 కోట్లు అవసరం కాగా.. ప్రపంచ బ్యాంకు, హడ్కో, ఏఐఐబీ, కేఎఫ్‌డబ్ల్యూ ద్వారా రూ.31,000 కోట్ల రుణాలు సమకూరాయి. ఇంకా రూ.47,000 కోట్లు అవసరం.

ఆంధ్రప్రదేశ్ అవసరాలివీ..

పోలవరం-బనకచర్ల అనుసంధానం, తాగునీటి ప్రాజెక్టులు, 5 పర్యాటక హబ్‌లు(అమరావతి, విశాఖ, అరకు, తిరుపతి, రాజమహేంద్రవరం), ఐఐటీ-తిరుపతిలో ఇంక్యుబేషన్ సెంటర్, బౌద్ధపర్యాటకం, అమరావతిలో జాతీయ మ్యూజియం, విశాఖలో ప్రపంచస్థాయి కన్వెన్షన్ సెంటర్, నాలెడ్జ్ ఎకానమీలో భాగమైన క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టు, స్కిల్ డెవలప్‌మెంట్, రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్, 100 శాతం అక్షరాస్యత, పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులు, గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాలు, అంతర్గత జలరవాణా, రహదారులు.. అమరావతి, విశాఖపట్నం, తిరుపతి రీజినల్ గ్రోత్ సెంటర్లు.. తదితర ప్రాజెక్టులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి గ్రాంట్లు ఇచ్చేలా ఆర్థిక సంఘం సిఫారసులు చేయాలి.



రాజధాని అమరావతి అభివృద్ధి ప్రణాళికను ఆర్థిక సంఘం బృందానికి వివరిస్తున్న సీఎం చంద్రబాబు

రాష్ట్ర అనుకూలతలు ఇవే..

అతి పెద్ద తీరప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్.. తూర్పు దేశాలకు గేట్‌వే. 3 పారిశ్రామిక కారిడార్లు.. 6 పోర్టులు, 7 విమానాశ్రయాలు ఉన్నాయి. దేశ ఎగుమతుల్లో 5.8% రాష్ట్రం నుంచే జరుగుతున్నాయి. బ్లూ ఎకానమీ, ఐటీ, నాలెడ్జ్ ఎకానమీ, క్వాంటమ్ వ్యాలీ, డ్రోన్, ఐవోటీ, బ్లాక్‌చెయిన్ వంటి నూతన సాంకేతికతలను అందిపుచ్చుకోవడంలో ముందున్నాం. ఆంధ్రను గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తీర్చిదిద్దాలనే ప్రణాళికతో ఉన్నాం. రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులతో 2030 నాటికి 160 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి మా లక్ష్యం. 7.5 లక్షల ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

నిలబడేందుకు సాయం చేయండి

అప్పుల కోసం గత ప్రభుత్వం తహశీల్దార్ కార్యాలయాలను కూడా తనఖా పెట్టింది. 25 ఏళ్ల పాటు మద్యంపై వచ్చే రాబడినీ తాకట్టు పెట్టింది. ఇన్ని కష్టాల నడుమ రాష్ట్రం నిలబడేందుకు, ముందుకు వెళ్లేందుకు ఆర్థిక సంఘం సాయం చేస్తే దేశ నిర్మాణంలో ముఖ్యమైన రాష్ట్రంగా నిలుస్తాం. సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, ఉద్యోగ కల్పనకు అవసరమైన పెట్టుబడులు సాధించేందుకు అధిక ప్రాధాన్యమిస్తున్నాం. జాబ్ ఫస్ట్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అనే విధానంతో పనిచేస్తున్నాం. 2047 నాటికి వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు స్వర్ణాంధ్ర-2047 విజన్ రూపొందించుకున్నాం. 10 సూత్రాలతో ప్రణాళిక అమలు చేస్తున్నాం.

- హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాలు అమరావతికి చేరువలో ఉన్నాయి. ఈ 4 నగరాలను కలుపుతూ దక్షిణ భారతం మరింత అభివృద్ధి చెందేలా ప్రణాళికలు సిద్ధం చేస్తే వికసిత్ భారత్ లక్ష్యంలో భాగమవుతుంది.
- పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం మంది పేదలను.. అత్యున్నత స్థానంలో ఉన్న 10 శాతం మంది సంపన్నులు ఆదుకునే పీ-4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం.

- సీఎం చంద్రబాబు

ఏటా 15 శాతం వృద్ధిరేటు

ఏడాదికి 15% వృద్ధిరేటు సాధించి 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఆంధ్ర అవతరించేలా కృషి చేస్తున్నాం. తలసరి ఆదాయం 42,000 డాలర్లు, ఎగుమతులు 450 బిలియన్ డాలర్లు, సగటు జీవిత కాలం 85 ఏళ్లు, అక్షరాస్యత 100 శాతం, నిరుద్యోగ రేటు 2 శాతానికి మించకుండా అభివృద్ధి చెందాలన్న లక్ష్యాలతో పనిచేస్తున్నాం.

- ప్రస్తుత జీఎస్‌డీపీ రూ.18.25 లక్షల కోట్లు ఉండగా.. 2028-29 నాటికి రూ.29.29 లక్షల కోట్లకు చేరుకోవాలనేది టార్గెట్. ఇది సాకారం కావాలంటే 2029 నాటికి రూ.40 లక్షల కోట్ల పెట్టుబడులు రావలసిన అవసరం ఉంది.
- విభజన వల్ల హైదరాబాద్‌ను కోల్పోవడం ఆంధ్రప్రదేశ్ వెనుకబాటుతనానికి కారణమైంది.
- గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రానికి ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తగిలింది. 2014-19 మధ్య 13.49 శాతం సరాసరి వృద్ధి ఉంటే.. 2019-24 మధ్య 10.32 శాతానికి పడిపోయింది.
- ముఖ్యమైన రాష్ట్రాలతో పోల్చుకుంటే జీఎస్డీపీలో రాష్ట్ర సొంత ఆదాయ వనరుల శాతం ఏపీలో తక్కువ(6.48%)గా ఉంది. తెలంగాణలో 9.51, కేరళలో 8.49, మహారాష్ట్రలో 7.93 శాతంగా ఉంది.
- రాష్ట్ర విభజన జరిగి పదేళ్లవుతున్నా.. విభజన చట్టం షెడ్యూల్-9 ప్రకారం 91 ప్రభుత్వ కంపెనీలు, కార్పొరేషన్లకు సంబంధించి రూ.1.63 లక్షల కోట్లు, షెడ్యూల్-10 కింద ఉన్న 142 సంస్థలకు చెందిన రూ.39,191 కోట్ల ఆస్తుల పంపకం అంశం ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి.
- రాష్ట్రానికి సొంతంగా వచ్చే ఆదాయం కంటే వడ్డీ చెల్లింపులు, పెన్షన్లు, జీతాలు.. ఇలా కచ్చితంగా చేయాల్సిన ఖర్చే ఎక్కువ. 2023-24లో కచ్చితంగా చేయాల్సిన ఖర్చులు రూ.1,03,022 కోట్లు ఉంటే.. సొంత ఆదాయం రూ.93,410 కోట్లు మాత్రమే.
- 2024 జూన్ నాటికి రాష్ట్రం అప్పులు రూ.9.74 లక్షల కోట్లకు పైగా ఉన్నాయి. దీనికి తోడు పెండింగ్ బిల్లులు రూ.1.35 లక్షల కోట్లు ఉన్నాయి. మూలధన వ్యయమూ తగ్గిపోయింది.

వాట్సాప్ గవర్నెన్స్‌కు ప్రశంసలు

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వాట్సాప్ గవర్నెన్స్ విధానాన్ని పనగారియా, కమిషన్ సభ్యులు ప్రశంసించారు. ప్రధాని దృష్టికి తీసుకెళ్లారా అని పనగారియా అడిగారు. ఇంకా లేదని.. వచ్చే నెలలో భేటీ సందర్భంగా వివరిస్తామని సీఎం తెలిపారు. హైదరాబాద్ నగరం గురించి ఆర్థిక సంఘ సభ్యురాలు అన్నే జార్జ్ మాథ్యూ ప్రస్తావించారు. 30 ఏళ్ల నాటికి, నేటికీ ఎంతో అభివృద్ధి చెందిందని, ఇదంతా చంద్రబాబు విజన్ వల్లే సాధ్యమైందని చెప్పారు. అమరావతిని కూడా అదే స్థాయిలో అభివృద్ధి చేస్తారనే నమ్మకం ఉందన్నారు.

పోలవరం ప్రారంభోత్సవానికి రండి

పనగారియాకు చంద్రబాబు వినతి

» పుష్కరాల్లోపే పూర్తిచేస్తామని వెల్లడి

అమరావతి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలకు (2027 జూలై23-ఆగస్టు 3) ముందే పోలవరం ప్రాజెక్టును పూర్తిచేస్తామని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి రావాలని ఆర్థిక సంఘం చైర్మన్ పనగారియాను ఆహ్వానించారు. పోలవరం-బనకచర్ల పథకం రాష్ట్రానికి గేమ్ చేంజర్‌గా మారుతుందని.. పల్నాడు, రాయలసీమ జిల్లాల్లో దుర్భిక్షం దూరమవుతుందని తెలిపారు. ఈ పథకం ప్రయోజనాలను ప్రత్యేక ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా పోలవరంపై పనగారియా ఆరా తీశారు. గతంలో తాను నీతి ఆయోగ్‌లో బాధ్యతలు నిర్వహించిన సమయంలో ఈ ప్రాజెక్టును సందర్శించానని గుర్తుచేశారు. తనకు దీనిపై పూర్తి అవగాహన ఉందన్నారు. సీఎం స్పందిస్తూ.. ప్రాజెక్టు పనులు రాష్ట్రమే చేపడితే బాగుంటుందని.. త్వరితగతిన పూర్తవుతుందంటూ గతంలో పనగారియా చేసిన సూచన మేరకే రాష్ట్రప్రభుత్వం బాధ్యత తీసుకుందని చెప్పారు. 'ఆయన నీతి ఆయోగ్‌లో పనిచేసిన సమయంలోనే ఈ ప్రాజెక్టును రాష్ట్రానికి అప్పగించారు. దేశంలో ఉన్న ఇతర జాతీయ ప్రాజెక్టుల పురోగతి మందగించడంతో పోలవరం పూర్తి కావాలంటే రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టాలని సిఫారసు చేశారు. దీంతో పనులు చేపట్టి 2014-19 నడుమ 72 శాతం మేర హెడ్‌వర్క్స్ పూర్తి చేశాం. 2019లో ప్రభుత్వ మార్పిడి జరిగి ఉండకపోతే.. పోలవరం 2020 నాటికే పూర్తయ్యేది' అని చెప్పారు. పోలవరం-బనకచర్ల పథకం రాష్ట్ర అంతర్గత ప్రాజెక్టుగా ఉంటుందన్నారు. నదుల అనుసంధానం వివిధ రాష్ట్రాల గుండా చేపడితే.. సాంకేతిక సమస్యలతో పాటు ఆయా రాష్ట్రాల నుంచి అభ్యంతరాలు కూడా వస్తున్నాయని తెలిపారు. ఆర్థిక సంఘం కూడా రాష్ట్ర అంతర్గత నదుల అనుసంధానానికి ప్రాధాన్యమివ్వాలని కోరారు.

ఢిల్లీ వెళ్లి నిర్మలమ్మను కలవండి

» పోలవరం-బనకచర్ల నిధులపై వినతిపత్రం ఇవ్వండి: సీఎం

పోలవరం-బనకచర్ల పథకానికి నిధులివ్వాలని కోరుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు వినతిపత్రం సమర్పించాలని సీఎం రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్‌ను ఆదేశించారు. ఆమెను ఇప్పటికే సంప్రదించానని.. శుక్రవారం (18న) ఢిల్లీ వెళ్లి ఆమెతో భేటీ కావలసిందిగా పీయూష్‌కు సూచించాలని జలవనరుల శాఖ ప్రత్యేక సీఎస్ జి.సాయిప్రసాద్‌ను కోరారు. తాను కూడా 22న ఢిల్లీలో ఆమెను కలుస్తానని చెప్పారు. ఈ నేపథ్యంలో పర్యావరణ అనుమతులు.. ఇతర సాంకేతిక అనుమతులపై సమీక్షించి.. సమగ్ర నివేదిక సిద్ధంచేయాలన్నారు.

నెలనెలా జగన్ 'షాకులు'

(మొదటి పేజీ తరువాయి)

తప్పించుకుంది. రాబోయే రోజుల్లో మరిన్ని పొదుపులకు బాటలు పరుస్తోంది. అయితే, అప్పటి వరకు ప్రజలకు 'జగన్ షాకులు' తప్పకపోవడమే విచారం.

ఏం జరుగుతోంది?

జగన్ ప్రభుత్వం దిగిపోయి దాదాపు పదిమాసాలైంది. అయిప్పటికీ కరెంటు చార్జీల మోత మోగుతూనే ఉంది. ట్రూ అప్, ఇంధన సర్దుబాటు అంటూ.. డిస్కమ్‌లు బిల్లుల్లో బాదేస్తున్నాయి. దీంతో సగటు వినియోగదారులు తల్లడిల్లుతున్న పరిస్థితి కనిపిస్తోంది. వైసీపీ ప్రభుత్వం విద్యుత్తు రంగాన్ని సంక్షోభానికి గురిచేసి ఖాయిలా పడే పరిస్థితిని తీసుకొచ్చింది. దీంతో ప్రజలపై చార్జీల భారాన్ని ఇప్పటికిప్పుడు తగ్గించాలని కూటమి ప్రభుత్వానికి ఉన్నప్పటికీ.. సాధ్యం కావడం లేదు. అందుకే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ధరలు పెరగకుండా చూసేందుకు



ప్రయత్నాలు సాగుతున్నాయి. గతంలో నెలకు రూ.300 బిల్లు వచ్చే వినియోగదారుని కుటుంబాన్ని పరిగణనలోకి తీసుకుంటే.. ఫిక్స్‌డ్ చార్జీలు రూ.50, ఎలక్ట్రిసిటీ డ్యూటీ కింద రూ.28.98తోపాటు ఇంధన సర్దుబాటు చార్జీల కింద రూ.425.15 చెల్లించాల్సి వస్తోంది. ఇందులోనూ సర్దుబాటు ధరల పోటు.. ఏటికేడు మారిపోతోంది. అంతేకాదు.. డబుల్ సర్దుబాటు కూడా పడుతోంది. 2023-24లో సర్దుబాటు చార్జీల కింద 304.39, 2024-25లో మరో ఇంధన సర్దుబాటు చార్జీల కింద రూ.152.80 వసూలు చేస్తున్నారు. మొత్తానికి వినియోగించిన విద్యుత్ చార్జీకి అదనంగా ప్రతి నెలా రూ.వెయ్యి పంపిణీ సంస్థలు వసూలు చేస్తున్నాయి. దీంతో గతంలో నెలకు రూ.300 బిల్లు వచ్చే వినియోగదారుడికి రూ.1,200 నుంచి రూ.1,530 దాకా వస్తోంది. అలానే.. ఒక కుటుంబం నెలకు 370 యూనిట్లు వాడితే.. రూ.3357.50 బిల్లు కట్టాల్సి వస్తోంది. ఎలా చూసుకున్నా సగటున రూ.800 అదనపు భారం ఒక్కొక్క కుటుంబంపై పడుతోంది.

గాడిన పడుతోంది!

చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తికే ప్రాధాన్యం ఇస్తోంది. ఈ నేపథ్యంలో ఏపీ జెన్కో రోజుకు 230 మిలియన్ యూనిట్ల డిమాండ్‌ను కూడా తట్టుకునేలా విద్యుదుత్పత్తి చేస్తుండడం విశేషం. బయట నుంచి కేవలం 7.967 మిలియన్ యూనిట్లను మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. గడచిన 9 నెలలుగా ఏపీజెన్కో కేంద్రాల నుంచి గరిష్ఠ స్థాయిలో విద్యుదుత్పత్తి చేసేలా ఎండీ చక్రధరబాబు చర్యలు తీసుకున్నారు. ఫలితంగా బహిరంగ మార్కెట్ నుంచి కరెంటు కొనుగోళ్లు తగ్గి రూ.5467 కోట్ల మేర ఆదా చేశారు.

నిపుణుల మాట ఇదే..

కరెంటును బయట నుంచి కొనుగోలు చేయకుండా ఏపీ జెన్కో విద్యుదుత్పత్తి సంస్థలు ప్రస్తుత తరహాలోనే గరిష్ఠ స్థాయిలో విద్యుదుత్పత్తి చేయాలని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా బహిరంగ మార్కెట్ నుంచి విద్యుత్తు కొనుగోళ్లను తగ్గించవచ్చని అంటున్నారు. దీంతో ప్రజలపై ట్రూఅప్, ఇంధన సర్దుబాటు భారాన్ని తగ్గించే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. ఇంధన శాఖ ఈ దిశగా చర్యలు చేపట్టేలా స్పష్టమైన విధివిధానాలను అమలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

షాకులు ఇందుకే!

- 2019-24 మధ్య కాలంలో ఏపీ జెన్కో విద్యుదుత్పత్తి సంస్థలు విద్యుత్తు ఉత్పత్తి చేయలేదు. దీంతో వినియోగానికి అవసరమైన మేరకు బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు విద్యుత్తును కొనుగోలు చేశారు.
- జగన్ హయాంలో డిస్కమ్‌లు ఇష్టారాజ్యంగా వ్యవహరించి అధిక ధరలకు ట్రాన్స్‌ఫార్మర్లను కొన్నాయి.
- బహిరంగ మార్కెట్లో కరెంటును.. బొగ్గును కూడా చేతికి ఎముక లేదన్నట్టుగా 'చెప్పిన' ధరకు కొనుగోలు చేశాయి.
- ఈ ఇష్టారాజ్యం నిర్ణయాల ఫలితంగానే.. ట్రూఅప్, ఇంధన సర్దుబాటు చార్జీల భారం వినియోగదారులపై పడింది.

సర్దుబాటు.. పెద్ద పోటు!

- వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో విద్యుత్తు చార్జీలను పెంచలేదు. కానీ ట్రూఅప్, ఇంధన సర్దుబాటు పేరిట 9 సార్లు ప్రజలను బాదేశారు. ఇది ఆ రోజుకు, లేదా ఆ సంవత్సరానికి పరిమితం కాలేదు. కొన్నేళ్ల పాటు ప్రజలు ఈ భారాన్ని మోసేలా జగన్ దొంగదెబ్బకొట్టారు.
- 2022-23లో ఇంధన సర్దుబాటు చార్జీల కింద రూ.6,300 కోట్లు మోపారు.
- 2023-24లో మరోసారి ఇంధన సర్దుబాటు చార్జీలు కింద రూ.9,200 కోట్ల భారం వేశారు.
- మొత్తంగా ఆరెండేళ్లలోనే 15,500 కోట్ల మేరకు సర్దుబాటు పేరుతో మోత మోగించారు.
- వీటికితోడు ఫిక్స్‌డ్ చార్జీలు రూ.50, ఎలక్ట్రిసిటీ డ్యూటీ కింద రూ.28.98 వసూలు చేస్తున్నారు.

దార్శనికుడు చంద్రబాబు

» సమస్యలపై ఆయనలా ప్రజంటేషన్ ఇచ్చే నాయకులు అరుదు

» ఆర్థిక సంఘం చైర్మన్ పనగారియా వ్యాఖ్య

అమరావతి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): "మీ ముఖ్యమంత్రి దార్శనికుడు. వచ్చే పాతికేళ్లలో దేశం ఎలా ఉండాలనేది ఆయన కలలుగంటారు. 2047నాటి స్వర్ణాంధ్రప్రదేశ్‌ను ఇప్పుడే చంద్రబాబు ఊహిస్తారు" అంటూ 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగారియా వ్యాఖ్యానించారు. విజయవాడకు వచ్చిన ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "గత తొమ్మిది నెలలుగా పలు రాష్ట్రాల్లో పర్యటిస్తున్నాం. ఇప్పుడు ఏపీకి వచ్చాం. మా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రితో సమావేశమయ్యాం. అమరావతి రాజధాని, దాని చరిత్ర, ప్రాజెక్టుల గురించి సమగ్రంగా ఆయన ప్రజంటేషన్ ఇచ్చారు. నేను 2015లో నీతిఆయోగ్‌లో ఉన్నప్పుడు, చంద్రబాబు స్వచ్ఛ భారత్ మిషన్‌కు ప్రాతినిధ్యం వహించారు. డిజిటలైజేషన్ కమిటీకి నాయకత్వం వహించారు. భీమ్ అప్లికేషన్, యూపీఐ సిస్టం ఆయన హయాంలోనే అభివృద్ధి చెందాయి. ఆర్థిక సంఘం ఎదుట విస్తృతమైన ప్రజెంటేషన్లు ఇచ్చే ఇద్దరు, ముగ్గురు నాయకుల్లో చంద్రబాబు ఒకరు" అని వివరించారు. ఏపీకి కేంద్రం నుంచి ఇచ్చే వాటా 41శాతం నుంచి 50శాతం వరకు పెంచాలని ఆయన కోరారని తెలిపారు. ప్రత్యేకహోదా అనేది ప్రణాళికాసంఘం ఉన్నప్పుడు ఉండేదన్నారు. ఇప్పుడు దేశంలో ఎక్కడా ప్రత్యేక హోదా ఇవ్వడం లేదని విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా చెప్పారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొంటున్న సవాళ్లను గుర్తించామన్నారు. రాష్ట్రం అప్పుల ఊబిలో ఉన్న విషయాన్ని సీఎం తమ దృష్టికి తెచ్చారని తెలిపారు. ఏపీ సహా రాష్ట్రాల ప్రతిపాదనలపై ఇంకా నిర్ణయాలు తీసుకోలేదని, విస్తృత సంప్రదింపుల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. సమావేశంలో ఆర్థికసంఘం సభ్యులు మనోజ్ పాండా, అన్నే జార్జ్ మాథ్యూ, రాష్ట్ర ఆర్థికశాఖ అదనపు కార్యదర్శి జె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం నిర్దేశించినా అలసత్వమా?

» వెలిగొండ ప్రాజెక్టు సమీక్షలో అధికారులు, కాంట్రాక్టు సంస్థపై మంత్రి నిమ్మల ఆగ్రహం

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): లక్ష్యానికి అనుగుణంగా వెలిగొండ పనులు పూర్తి చేయకుండా అలసత్వం ప్రదర్శిస్తున్నారంటూ కాంట్రాక్టు సంస్థ, ఇంజనీరింగ్ అధికారులపై మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. విజయవాడ క్యాంపు కార్యాలయంలో బుధవారం సమీక్ష జరిపారు. ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు. 'ఈ నెలలో 432 మీటర్ల లైనింగ్ పనులు పూర్తి చేయాల్సి ఉంది. కాని, కేవలం 72 మీటర్లు మాత్రమే చేశారు. 2026 జూన్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యం. ఆలోగా పనులు పూర్తిచేసేలా వేగాన్ని పెంచాలి. టన్నెల్-2లో చిక్కుకున్న బోరింగ్ మిషన్(టీబీఎం)ను తొలగించడానికి, దాని విలువ నిర్ధారించడానికి కమిటీని వేస్తున్నాం. కోర్టు ఆదేశాలు ప్రకారం టీబీఎం తొలగింపు సాధ్యం కాకపోతే దానికి సమాంతరంగా మరో టన్నెల్ తవ్వకానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. వెలిగొండ ప్యాకేజీ-2, ప్యాకేజీ-4 కీలక పనుల కోసం రూ.106.39 కోట్లను కేబినెట్ ఆమోదించింది. ఫీడర్ కెనాల్, తీగలేరు కాలువ హెడ్ వర్క్స్, తూర్పు ప్రధాన కాలువ హెడ్ రెగ్యులేటర్ పనులు కాంట్రాక్టు సంస్థకు అప్పగించేందుకూ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది' అని మంత్రి నిమ్మల పేర్కొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై కౌంటర్ వేయండి

- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- హత్య చేసి ప్రమాదమంటున్నారు
- దర్యాప్తును సీబీఐకి అప్పగించాలి: కేఏ పాల్

అమరావతి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్‌కుమార్ పగడాల మరణంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రతివాదులుగా ఉన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోం శాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, సిట్ డీఎస్పీ తదితరులకు నోటీసులు జారీ చేసింది. విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులిచ్చింది. పాస్టర్ ప్రవీణ్ మరణంపై సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏపాల్ పిల్ దాఖలు చేశారు. పోస్టుమార్టం నివేదికతో పాటు సీసీటీవీ ఫుటేజీ, ఇతర సాక్ష్యాలన్నిటినీ భద్రపరిచేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. ఇదే అభ్యర్థనతో రాజమండ్రికి చెందిన దాడి నాగేశ్వరరావు మరో పిల్ వేశారు. ఈ వ్యాజ్యాలు బుధవారం విచారణకు రాగా కేఏ పాల్ 'పార్టీ-ఇన్-పర్సన్'గా తన వ్యాజ్యంపై తానే వాదనలు వినిపించారు. పాస్టర్ ప్రవీణ్‌ను హత్య చేసి ప్రమాదంగా చిత్రీకరించారని.. పోలీసులు కేసు దర్యాప్తును తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. ప్రవీణ్‌కు మద్యం సేవించే అలవాటు లేదన్నారు. దర్యాప్తులో భాగంగా సేకరించిన సాక్ష్యాలను భద్రపరిచేలా పోలీసులను ఆదేశించాలని.. కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కోరారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి స్పందిస్తూ.. ప్రవీణ్ మద్యం మత్తులో ద్విచక్ర వాహనం నడిపారని.. ప్రమాదవశాత్తూ కిందపడి మరణించారని తెలిపారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామన్నారు. ఇందుకు కోర్టు అనుమతించింది.

క్రషింగ్ వ్యాపారంతో నాకు సంబంధం లేదు

- విజిలెన్స్ కేసుల రివిజన్‌లో నా పాత్ర లేదు: కొల్ల అజయ్ వివరణ

అమరావతి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని క్రషింగ్ వ్యాపారాలతో తనకు సంబంధం లేదని, గుంటూరులోని క్రషింగ్ యూనిట్లను చేజిక్కించుకోవాలని ఎలాంటి ప్రయత్నాలూ చేయలేదని కొల్ల అజయ్ వివరణ ఇచ్చారు. క్రషింగ్ యూనిట్లు తనకు కావాలని వ్యక్తిగతంగా ఎవరిపైనా ఒత్తిడి తీసుకురాలేదని, తన పేరిట కూడా మరెవరూ రాయబారాలు నడపలేదని వివరించారు. గనుల శాఖలో జరిగే విజిలెన్స్ కేసుల రివిజన్స్‌లో తనకు ప్రమేయం, పాత్ర ఉండవన్నారు. 'మైనింగ్ డాన్', 'గుంటూరులోనూ అజయ్ దందా' శీర్షికలతో ఈనెల 15, 16 తేదీల్లో 'ఆంధ్రజ్యోతి' వార్తలు ప్రచురించింది. వీటిపై కొల్ల అజయ్ స్పందించారు. 'ఆంధ్రజ్యోతి'కి బుధవారం వివరణ పంపించారు. తనకు గుంటూరు జిల్లాలో ఏ క్రషర్ వ్యాపారంలోనూ భాగస్వామ్యం లేదని తెలిపారు. గుంటూరులో క్రషర్లు ఎక్కడున్నాయో కూడా తనకు తెలియదని, ఆ వ్యాపారంలో ఎలాంటి పాత్ర, భాగస్వామ్యం లేదని చెప్పారు. గనుల శాఖ చేస్తున్న రివిజన్‌లతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన తన వివరణలో పేర్కొన్నారు.

బోరుగడ్డకు రిమాండ్ పొడిగింపు

- మళ్లీ రాజమండ్రి జైలుకు తరలింపు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన బోరుగడ్డ అనిల్‌కు రిమాండ్ పొడిగిస్తూ పల్నాడు జిల్లా నరసరావుపేటలోని రెండో అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.గాయత్రి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లపై కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసినట్లు ఫిరంగిపురం పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. ఈ కేసులో బోరుగడ్డను మార్చి 24న స్థానిక కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. రాజమండ్రి కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న బోరుగడ్డను పోలీసులు బందోబస్తు మధ్య బుధవారం స్థానిక రెండో అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టులో హాజరుపరిచారు. ఈ క్రమంలో ఈ నెల 28 వరకు రిమాండ్ పొడిగిస్తూ న్యాయాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో తిరిగి రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలించారు.

మిథున్ రెడ్డికి 'సిట్' పిలుపు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లోనే ఉన్న రాజ్ కసిరెడ్డి తండ్రి ఉపేందర్ రెడ్డిని కూడా ప్రశ్నించారు. రాజ్ కసిరెడ్డి ఆచూకీ గురించి ఆరా తీయగా... తనకు ఏమీ తెలీదని ఆయన సమాధానం ఇచ్చారు. దీంతో ఆయన్ను విచారించి వాంగ్మూలం నమోదు చేయాలని సిట్ నిర్ణయించుకుంది. అందులో భాగంగానే గురువారం విజయవాడలోని పోలీస్ కమిషనరేట్ ప్రాంగణంలో ఉన్న సిట్ కార్యాలయానికి రావాల్సిందిగా నోటీసు ఇచ్చారు.

పరారీలోనే...

రాజ్ కసిరెడ్డి కోసం 'సిట్' సిబ్బంది ఆయన బంధువులు, స్నేహితులు, ఆత్మీయుల ఇళ్లకు వెళ్లి ఆరా తీశారు. హైదరాబాద్‌లోని రాయదుర్గం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న నివాసాల్లో పలు డాక్యుమెంట్లు సీజ్ చేసి కీలక ఆధారాలు సేకరించారు. లిక్కర్ స్కామ్‌లో తాడేపల్లి పెద్దల తరఫున అన్నీ తానై వ్యవహరించిన రాజ్ కసిరెడ్డి... సిట్ విచారణను తప్పించుకునేందుకు రకరకాల విన్యాసాలు చేశారు. మూడుసార్లు నోటీసులు ఇచ్చినా స్పందించలేదు. 'కారణం చెబితేనే వస్తా' అంటూ మెలిక పెట్టి హైకోర్టును ఆశ్రయించారు. అయితే... 'సిట్'కు చట్టబద్ధత ఉందని, విచారణకు సహకరించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఆయనకు మరో నోటీసు ఇవ్వాలంటూ సిట్ అధికారులకు సూచించింది. దీంతో ఈనెల 9న విచారణకు రావాలని మరోసారి నోటీసు ఇచ్చారు. అయినా... రాజ్ పట్టించుకోలేదు. హైకోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ విచారణకు డుమ్మా కొట్టారు. ఆయన ఫోన్లు స్విచ్ఛాఫ్ వస్తున్నాయి. దీంతో ఆయన ఉద్దేశ పూర్వకంగానే విచారణకు హాజరు కాకుండా పరారైనట్లు సిట్ అంచనాకు వచ్చింది.

సర్వం అతనే...

మద్యం స్కామ్‌తో ప్రభుత్వ ఖజానాకు 20వేల కోట్ల నష్టం వాటిల్లిందని... వైసీపీ పెద్దలు రూ.4వేల కోట్లు కమీషన్ల రూపంలో దోచుకున్నారని ప్రాథమికంగా తేలింది. ఈ స్కామ్ సర్వస్వం రాజ్ కసిరెడ్డి నడిపించినట్లు 'సిట్' నిర్ధారణకు వచ్చింది. మద్యం తయారీదారుల నుంచి ప్రతి నెలా 60కోట్ల రూపాయలకు తగ్గకుండా వసూలు చేసి... హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ప్రత్యేకంగా కార్యాలయం ఏర్పాటు చేసుకుని దందా నిర్వహించినట్లు ఆధారాలు లభించాయి. ఏ మద్యం కంపెనీ నుంచి ఎంత లిక్కర్ కొనుగోలు చేయాలి.. ఏ రోజు ఏ బ్రాండ్లు ఎంత మేరకు విక్రయించాలి.. అనేది రాజ్ కసిరెడ్డే నిర్ణయించారని సమాచారం! కమీషన్లుగా దండుకున్న డబ్బులో కొంత మొత్తాన్ని సినిమాల్లో పెట్టుబడులుగా పెట్టినట్లు అధికారులు గుర్తించారు. దీని వివరాలు రాబట్టేందుకు... సదరు చిత్ర నిర్మాణ సంస్థలకూ 'సిట్' నోటీసులు జారీ చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

నేడు 'సిట్' ముందుకు సాయిరెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

నుంచి వివరాలు రాబట్టే అవకాశముంది. నిజానికి... సాయిరెడ్డిని, మిథున్ రెడ్డిని కలిపి శుక్రవారం విచారించాలని 'సిట్' భావించినట్లు సమాచారం. అయితే... సాయిరెడ్డి ఆ రోజున తనకు ముందే నిర్ణయించుకున్న కార్యక్రమాలున్నాయంటూ, ఒక రోజు ముందే విచారణకు హాజరవుతున్నారు. 'మద్యం కుంభకోణంలో కర్త, కర్మ, క్రియ రాజ్ కసిరెడ్డే' అని సాయిరెడ్డి ఇదివరకే బహిరంగంగా స్పష్టం చేశారు. పోలీసులు అడిగితే తనకు తెలిసిన వివరాలన్నీ చెప్పేందుకు కూడా సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ నేపథ్యంలో... గురువారం 'సిట్' ముందు ఆయన ఏం చెబుతారన్నది ఆసక్తికరంగా మారింది.

విండ్‌షీల్డ్ దెబ్బతింటే ఎలా వెళ్లారు?

- హెలికాప్టర్‌పై దాడి ఎవరు చేశారు?
- జగన్ తిరుగు ప్రయాణం షెడ్యూల్‌లో ఉందా?
- కో పైలట్‌పై పోలీసుల ప్రశ్నల వర్షం

పుట్టపర్తి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయిజిల్లాలో మాజీ సీఎం జగన్ జరిపిన వివాదాస్పద హెలికాప్టర్ ప్రయాణంపై విచారణను పోలీసులు మొదలుపెట్టారు. 'హెలికాప్టర్ విండ్‌షీల్డ్ దెబ్బతింటే, ఎలా టేకాఫ్ చేశారు..? విండ్‌షీల్డ్‌పై ఎవరు, ఎలా దాడి చేశారు..? జగన్‌ను వదిలేసి ఎగరడానికి ఎవరి అనుమతి తీసుకున్నారు..?' అంటూ కో-పైలట్ శ్రేయాజ్ జైన్‌పై ప్రశ్నలవర్షం కురిపించారు. పాపిరెడ్డిపల్లిలో లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు ఈ నెల 8న జగన్ జిల్లాకు వచ్చారు. రామగిరి మండలం కుంటిమద్ది సమీపంలోని హెలిప్యాడ్‌లో దిగారు. ఆ రోజు జరిగిన సంఘటనలు వివాదాస్పదం కావడంతో పైలట్, కో పైలెట్‌లను పోలీసులు విచారణకు పిలిచారు. పైలట్ అనిల్ కుమార్ గైర్హాజరు కాగా, కో పైలట్ తన న్యాయవాదితో కలిసి విచారణకు హాజరయ్యారు. చెన్నేకొత్తపల్లిలోని రామగిరి పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్, రామగిరి సీఐ శ్రీధర్... ఆయనను బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2.45 గంటల దాకా విచారించారు. ఆ రోజు జరిగిన సంఘటనలు, జగన్‌ను వదిలేసి హెలికాప్టర్ వెనక్కి వెళ్లిపోవడానికి కారణాలను ఆరా తీశారు. విశ్వసనీయ సమాచారం మేరకు...కో పైలట్‌ను పోలీసులు అనేక విషయాలపై ప్రశ్నించి సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేశారు. అయినా, ఆయన కొన్ని ప్రశ్నలకే స్పందించారు. 'ఆ రోజు హెలికాప్టర్ బెంగళూరులోని ఏ ప్రాంతం నుంచి కుంటిమద్దికి వచ్చింది... తిరిగి వెళ్లేదాకా ఏం జరిగింది... ఎవరి ద్వారా హెలికాప్టర్ అద్దెకు తీసుకున్నారు.. ఎంత అద్దె చెల్లించారు.... అది ఏ కంపెనీది.. షెడ్యూల్‌లో జగన్ తిరుగు ప్రయాణం ఉందా...జగన్‌ను వదిలేసి బెంగళూరుకు వెళ్లిపోయేందుకు ఎవరు అనుమతిచ్చారు..విండ్ షీల్డ్ దెబ్బతినడం నిజమేనా....అలాగైతే మరమ్మతు చేయకుండా గాలిలోకి ఎగిరి ఎలా వెళ్లగలిగింది...వైసీపీ నేతలు, కార్యకర్తలు డోర్ లాగారా....పైలట్ బ్యాగ్‌ను తస్కరించారా... టేకాఫ్ చేస్తున్నట్లు జిల్లా పోలీస్ యంత్రాంగానికి ఎందుకు సమాచారం ఇవ్వలేదు.. ఇలా పోలీసులు శరపరంపరగా ప్రశ్నలు సంధించారు. అయితే, కో పైలట్ కొన్ని ప్రశ్నలకు సమాధానాలను దాటవేశారు. "హెలికాప్టర్ గోదావత్ ఏవియేషన్స్ కంపెనీది. బెంగళూరు వైట్‌ఫీల్డ్‌లోని చిప్పర్ ఏవియేషన్ ప్రైవేట్ కంపెనీ ద్వారా అద్దెకు తీసుకున్నారు. అద్దె ఎంతో నాకు తెలియదు. బెంగళూరు-కుంటిమద్దికి, తిరిగి కుంటిమద్ది-బెంగళూరుకు తీసుకెళ్లేలా షెడ్యూల్ ఇచ్చారు. హెలిప్యాడ్‌లో హెలికాప్టర్ దిగగానే జెండాలు పట్టుకుని భారీగా జనం చుట్టుముట్టారు. హెలికాప్టర్‌ను తాకారు. ఆ సమయంలోనే విండ్‌షీల్డ్ దెబ్బతింది. హెలికాప్టర్‌కు మినిమం ఎక్యూఎమెంట్ లిస్టు (కొన్ని పరికరాలు లేకపోయినా టేకాఫ్ తీసుకోవచ్చు. అయితే, ఏ పరికరాలు తప్పనిసరిగా ఉండాలనే లిస్టును పైలట్ ధ్రువీకరించాలి) ఉంటే టేకాఫ్ చేసుకుని వెళ్లవచ్చు." అని కో పైలట్ తెలిపినట్టు తెలిసింది. కాగా, తాను తప్పనిసరి పరిస్థితుల్లో సెలవులో ఉన్నారని, అందుకే విచారణకు రావడం లేదని కోపైలట్ ద్వారా పైలట్ అనిల్ కుమార్ పోలీసులకు సమాచారం అందించినట్టు సమాచారం. అయితే, పైలట్ గైర్హాజరీ పలు అనుమానాలకు తావిస్తోంది. ఇద్దరు పైలెట్లనూ మరోమారు విచారణకు రావాలని నోటీసులు జారీ చేసే అవకాశం ఉందని పోలీసుశాఖ వర్గాలు తెలిపాయి.

పోలీసుల అదుపులో వైసీపీ మహిళా నేత

- కూటమి నేతలపై అసభ్యకర పోస్టులే కారణం

దాచేపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కూటమి నేతలపై అసభ్యకర పోస్టులు పెడుతున్న వైసీపీ మహిళా నేత పాలేటి కృష్ణవేణిని బుధవారం పల్నాడు జిల్లా దాచేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు సమాచారం. కృష్ణవేణి వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్టుగా ఉన్నారు. హైదరాబాద్‌లో ఉన్న ఆమెను దాచేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కృష్ణవేణి స్వగ్రామం చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి గ్రామం. కూటమి నేతల ఫొటోలను మార్ఫింగ్ చేస్తూ సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టారని ఈమెపై పలు ఫిర్యాదులున్నట్లు సమాచారం.



వైసీపీ అధ్యక్షుడు జగన్‌తో కలసి ఉన్న పాలేటి కృష్ణవేణి(ఫైల్)

ఇంటర్ మార్కుల మెమోలు విడుదల

అమరావతి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఇంటర్మీడియట్ ఫలితాలు వెల్లడించిన ఇంటర్ బోర్డు మార్కుల మెమోలు విడుదల చేసింది. ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు వారి రోల్ నంబరు, పుట్టిన తేదీ వివరాలు ఇచ్చి మెమోలు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.



డాక్టర్ ఫణీంద్ర కుమార్‌ను అభినందిస్తున్న మురళీమోహన్, లక్ష్మణరావు

88 ఏళ్ల వృద్ధుడికి స్వరపేటిక శస్త్రచికిత్స

- గుంటూరులో అరుదైన శాండ్‌విచ్ థైరోప్లాస్టీ
- ఈ సర్జరీ చేయించుకున్న పెద్ద వయస్కుడిగా లక్ష్మణరావు
- నటుడు మురళీమోహన్‌కు బావ

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): స్వరపేటిక పక్షవాతానికి గురై గొంతు బొంగురుపోయిన 88 ఏళ్ల వృద్ధుడికి గుంటూరు వికాస్ హాస్పిటల్‌లో అరుదైన శాండ్‌విచ్ థైరోప్లాస్టీ శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ శస్త్రచికిత్స చేయించుకున్న అతిపెద్ద వయస్కుడిగా ఆ వృద్ధుడికి గుర్తింపు లభించినట్లు శస్త్రచికిత్స చేసిన వాయిస్ సర్జన్ డాక్టర్ వీ ఫణీంద్రకుమార్ తెలిపారు. గుడివాడకు చెందిన లక్ష్మణరావు సినీనటుడు, మాజీ ఎంపీ మురళీమోహన్‌కు స్వయానా బావ. ఎనిమిది నెలల క్రితం లక్ష్మణరావుకు గొంతు బొంగురుపోవడం, స్పష్టంగా మాట్లాడలేకపోవడంతో ఇటీవల చికిత్స కోసం గుంటూరులోని డాక్టర్ ఫణీంద్రకుమార్‌ను కలిశారు. వైద్యపరీక్షల్లో బాధితుడు ఓకల్ కార్డ్ పెరాలసిస్‌కు గురైనట్లు ఆయన గుర్తించారు. గుంటూరులోని వికాస్ హాస్పిటల్స్‌లో లక్ష్మణరావుకు శస్త్రచికిత్స నిర్వహించారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.